
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
04-06-2024
సంపుటి : 01 । సంచిక : 31 । పేజీలు : 12 । వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS
లక్ష్యం సమాజహితం


డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB
CMD



ఇటీవల చదువుకోని వారికంటే ఉన్నత చదువులు చదివివారు, ప్రముఖులు, సామాజంలో పేరు ప్రఖ్యాతలు ఉన్న వాళ్లే మూఢనమ్మకాలను నమ్ముతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటీవల కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ సైతం తమపై, సీఎంపై ప్రతిపక్షాలు క్షుద్రపూజలు చేయిస్తున్నారని సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అలాగే బాబాలు, స్వాముల దగ్గరకు ఎక్కువగా క్యూ కట్టేది కూడా రాజకీయనాయకులు, ప్రముఖులే. గతంలో మాజీ సీఎం కేసీఆర్ సైతం వాస్తు పేరుతో పాత కట్టడాలను కూల్చి కొత్తగా కట్టారు. యాగాలు, హోమాలు చేశారు. ఇంతవరకు ఎలా ఉన్నా.. ఏ యాగం, హోమం, వాస్తులు మార్పించకుండానే రేవంత్ రెడ్డి సీఎం పీఠం ఎక్కారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయిన ఏడు నెలలకు తను కూడా వాస్తు దోషాల పేరిట మార్పులకు శ్రీకారం చుట్టడం రాష్ట్ర ప్రజలను ఆశ్చర్యపరుస్తోంది.

# రేవంత్‌కు వాస్తు దోషం?

## కొత్త సెక్రటేరియట్‌కు మార్పులు

**ఆగస్ట్ సంక్షోభం బయటపడేందుకేనా..?**

- సీఎం ఇన్, అవుట్ గేట్లు మార్పు
- రేవంత్ ఇక వెస్ట్ గేట్ నుంచి ఎంట్రీ
- నార్త్ ఈస్ట్ గేట్ ద్వారా బయటకు..
- నాడు కేసీఆర్‌పై విమర్శలు..
- నేడు ఆయన్నే ఫాలో..?
- చర్చనీయాంశంగా సీఎం నిర్ణయం

**విశ్వంభర, హైదరాబాద్:**

వినటానికే విచిత్రంగా ఉన్నా.. సచివాలయంలో ఇప్పుడు వాస్తు మార్పులు మొదలయ్యాయి. ఇప్పటివరకు సెక్రటేరియట్ మెయిన్ గేట్ నుండి రేవంత్ రెడ్డి లోపలికి వెళ్లి, అక్కడి నుంచి మళ్లీ బయటకు వస్తున్నారు. మరి ఏ పండితుడు, సిద్ధాంతి సలహా ఇచ్చాడో కానీ ఇపుడు వాస్తు ప్రకారం మార్పులు చేస్తున్నారు. రేవంత్ ఇకనుండి వెస్ట్ గేట్ నుండి లోపలికి ప్రవేశించి నార్త్ ఈస్ట్ గేట్ నుంచి బయటకు వెళతారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సౌత్ ఈస్ట్ గేటులో నుండి రాకపోకలు సాగించబోతున్నారు. రేవంత్ ముఖ్యమంత్రి అయిన ఏడు మాసాల తర్వాత సచివాలయంలో ఈ వాస్తుమార్పులు చేయటం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది.

**అంత చేసిన కేసీఆర్ ఎందుకు ఓడిపోయారు?**

నిజానికి మనిషిరాత (జాతకం) బలంగా ఉంటే వాస్తుమార్పులతో పనిలేదని చాలామంది చెబుతుంటారు. పైగా వాస్తుమార్పులు ఎన్ని చేయించుకున్నా జరగాల్సింది జరగకమానదని కేసీఆర్ వ్యవహారం

మిగతా2లో...

## కాంగ్రెస్ అభ్యర్థులకు సీఎం దిశానిర్దేశం

- అభ్యర్థులు, ఇన్చార్జ్ మంత్రులతో జూమ్ మీటింగ్
- కౌంటింగ్ సమయంలో నిర్లక్ష్యం అస్సలు వద్దు
- చిత్తశుద్ధి, నిబద్ధత ఉన్నవారినే ఏజెంట్‌గా పంపాలి
- ప్రతి రౌండ్ కౌంటింగ్‌లో జాగ్రత్తగా ఉండాలి
- తేడా వస్తే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలి



2



3

## తెలంగాణ ఉద్యమకారులకు స్థలం

- 250 గజాల ఇంటి స్థలం మంజూరు
- ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం
- తెలంగాణను అవమానిస్తే చూస్తూ ఊరుకోం
- హన్మకొండలో మంత్రి పొన్నం ప్రభాకర్

## రాధాకిషన్ రావు ఇంట విషాదం

- ఆయన తల్లి సరోజనమ్మ కన్నుమూత
- తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మాజీ డీసీపీకి మధ్యంతర బెయిల్
- మంగళవారం సాయంత్రం 6 వరకు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు



2

## రికార్డు స్థాయిలో దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు

- మళ్లీ మోడీనే వస్తాడన్న అంచనాలతోనే..
- ఎన్డీఏకే పట్టం కట్టిన ఎగ్జిట్ పోల్స్
- సోమవారం ఆరంభం నుంచే స్టాక్ మార్కెట్లలో జోరు
- గత మూడేళ్లలో సింగిల్ డే గరిష్ఠాలు నమోదు చేసిన సెన్సెక్స్, నిఫ్టీ



2



## రేవ్ పార్టీ కేసులో నటి హేమ అరెస్ట్

- బెంగళూరు రేవ్ పార్టీలో పాల్గొన్న హేమ
- ఆమె రక్తంలో డ్రగ్స్ తీసుకున్న ఆనవాళ్లు
- రెండుసార్లు నోటీసులు ఇచ్చినా డుమ్మా
- హైదరాబాద్ వచ్చి అరెస్ట్ చేసిన కర్ణాటక పోలీసులు

2

## కవిత జైల్లోనే..

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీకి షాకిచ్చిన రౌస్ అవెన్యూ కోర్టు**

- జూలై 3వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు
- కవితపై తీవ్ర అభియోగాలు మోపిన ఈడీ అధికారులు
- లిక్కర్ స్కాంలో రూ.1100 కోట్ల నేరం జరిగింది
- రూ.192 కోట్ల లాభాలను ఇండో స్పిరిట్ పొందింది
- రూ.100 కోట్ల ముడుపులు ఆమ్ ఆద్మీ పార్టీకి..
- రూ.292 కోట్ల నేరంలో కవిత పాత్ర ఉంది
- డిజిటల్ ఆధారాలను కవిత ధ్వంసం చేసింది



**విశ్వంభర, ఢిల్లీ:**

ఢిల్లీ లిక్కర్ పాలసీ ఈడీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి షాకిచ్చింది. తీహార్ జైలులో కవిత జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో సోమవారం ఈడీ అధికారులు కవితను కోర్టులో ప్రవేశపెట్టారు. కవిత కస్టడీపై విచారణ చేపట్టిన జడ్జి కావేరి భవేజా కస్టడీ జూలై 3వ తేదీ వరకు పొడిగించారు. మార్చి 26వ తేదీ నుంచి

మిగతా2లో...

**ప్రజా పాలన కాదు..**

## గలీజు పాలన

- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పాలన
- ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన గలీజు పాలన
- 10 రోజులుగా నీళ్ల ట్యాంకులో శవం ఉన్నా మేల్కోరా..?
- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్



2

## ఫలితాల తర్వాత బీఆర్ఎస్ దుకాణం బంద్

- ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ
- ఎగ్జిట్ పోల్స్ ప్రకారమే ఫలితాలు ఉంటాయి
- దేశవ్యాప్తంగా 350కి పైగా, తెలంగాణలో 10 సీట్లు గెలుస్తాం
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జోస్యం



2



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 145 | ₹ 167 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 242 | ₹ 276 |

## దాహం తీర్చిన శవం కుళ్లిన వాటర్

- మిషన్ భగీరథ నీళ్ల ట్యాంకులో మృతదేహం
- 10 రోజులుగా అవే నీటిని తాగిన ప్రజలు
- ఆందోళనలో నల్లగొండ పట్టణ ప్రజలు



2

# కౌంట్ డౌన్ స్టార్ట్

## ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- నేటి ఉదయం 8 గంటలకు ప్రారంభం
- 17 పార్లమెంట్ స్థానాలు..1855 టేబుళ్లు
- అత్యధికంగా 24, అత్యల్పంగా 13 రౌండ్లు
- మూడు దశల్లో ఓట్ల లెక్కింపు పరిశీలన
- ర్యాండమ్‌గా వీవీ ప్యాట్ల పరిశీలన
- మహబూబాబాద్ పార్లమెంట్‌దే మొదటి ఫలితం
- తెలంగాణ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- జూన్ 5 ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు బంద్
- బహిరంగ ప్రదేశాల్లో పటాకులు పేల్చడంపై నిషేధం
- ప్రకటించిన ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి వికాస్ రాజ్



**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కోసం ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా హైదరాబాద్ నగరంతోపాటు తెలంగాణలో పోలీసులు సీఆర్‌పీసీ 144 సెక్షన్ విధించారు. నలుగురు కంటే ఎక్కువ మంది సమావేశమవడాన్ని నిషేధిస్తూ ఈ సెక్షన్ విధించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలకు

మిగతా3లో...

# రేవంత్‌కు వాస్తు దోషం?

(మొదటి పేజీ తరువాయి)

చూసిన వాళ్ళకి బాగానే అర్ధమయ్యింటుంది. వాస్తుమార్పులు, పూజలు, హోమాలు, యాగాలు చేయించటంలో కేసీయార్ తర్వాతే ఇంకెవరైనా. వాస్తు ప్రకారం సరిగాలేదని కేసీయార్ చాలాసార్లు సచివాలయానికి మార్పులు చేయించారు. చివరకు సచివాలయంలోని భవనాలన్నింటినీ కూలగొట్టించి తనకు కావాల్సినట్లుగా వాస్తు ప్రకారం కొత్త భవనాలు కట్టించారు. కొత్త సచివాలయానికి సుమారు రు. 700 కోట్లు ఖర్చయిందనే ప్రచారంపై ప్రతిపక్షాలు మండిపడిన విషయం తెలిసిందే. ఎన్ని పూజలు, యాగాలు, హోమాలు చేయించినా, వాస్తు ప్రకారం కొత్త సచివాలయాన్ని కట్టించినా కేసీయార్ కు ఓటమి తప్పలేదు.



**రేవంత్ రెడ్డికి వచ్చిన నష్టమేంటి..?**

ఈమధ్యనే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు 39 సీట్లు మాత్రమే వచ్చిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. సచివాలయానికి వాస్తుమార్పులు చేయించటమే కాకుండా పార్టీ కార్యాలయానికి కూడా చాలాసార్లు మార్పులు చేయించారు. ఎంత చేయించినా బీఆర్ఎస్ కు ఓటమి తప్పలేదు. ఇదే సమయంలో ఎలాంటి వాస్తుమార్పులు చేయించకుండానే, యాగాలు, హోమాలు చేయించకపోయినా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. వాస్తుమార్పులతో ఎలాంటి పట్టింపులు లేకుండానే ముఖ్యమంత్రయిన రేవంత్ ఏడుమాసాల తర్వాత సచివాలయంలో మార్పులు చేయించటమే విచిత్రంగా ఉంది. మరి చేస్తున్న మార్పులు రేవంత్ కు ఎంతమాత్రం అచ్చివస్తాయో చూడాల్సిందే. ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కేసీయార్ సచివాలయంలోని 6వ అంతస్తులో ఉండేవారు. ఇపుడు రేవంత్ తన ఆఫీసును తొమ్మిదో అంతస్తులోకి మారుస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. తొందరలోనే ఇతర భవనాలతో పాటు సెక్రటేరియట్లో వాస్తుప్రకారం మరికొన్ని మార్పులు జరగబోతున్నట్లు సమాచారం.

### అప్పుడు విమర్శలు.. ఇప్పుడు అదే ఫాలో..

కేసీఆర్ హోమాలు, యాగాలు చేసిన సమయంలో, పాత సెక్రటేరియట్‌లో వాస్తు మార్పులు చేసిన సమయంలో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మూఢనమ్మకాల్లో మునిగిపోయిన కేసీఆర్ వాస్తు మార్పుల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. ఇంకా 50 ఏళ్లైనా చెక్కు చెదరని సచివాలయాన్ని కూల్చి వందల కోట్లుతో కొత్త సెక్రటేరియట్ కట్టిస్తున్నారని ఆరోపణలు చేశారు. అయితే ఆ తర్వాత అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి నాటి మాటలకు భిన్నంగా వ్యవహరించడం హాట్ టాపిక్‌గా మారింది. కేసీఆర్‌ను విమర్శించిన రేవంత్.. ప్రస్తుతం సెక్రటేరియట్‌లో తన ఛాంబర్‌లో మార్పులు, రాక, పోకలకు వేర్వేరు గేట్లను ఉపయోగించాలని నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అయితే సీఎం నిర్ణయంపై రాజకీయ విశ్లేషకులు భిన్నంగా స్పందిస్తున్నారు. లోక్ సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని బీఆర్ఎస్, బీజేపీ పార్టీ అగ్రనాయకులు పలుమార్లు జోస్యం చెప్పారు. ఇదే జరిగితే ఆగస్టులో సంక్షోభం వస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలన్నా.. సీఎం సీటును పదిలపర్చుకోవాలన్నా పండితులు, స్వాముల మాటలు నమ్మాలని రేవంత్ భావించినట్లు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే తన పరిపాలనలో ఎలాంటి దోషాలు, ఆటంకాలు రాకుండా ఉండేందుకు వాస్తు మార్పులు చేపట్టినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కర్ణాటకలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంపై అఘోరాలతో క్షుద్రపూజలు చేస్తున్నారని అక్కడి ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రెస్ మీట్ పెట్టి చెప్పారు. ఇదే సమయంలో తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వాస్తు మార్పులకు శ్రీకారం చుట్టడం చూస్తే.. వీళ్లు కూడా కేసీఆర్ కోవకు చెందిన వాళ్లే అంటూ ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

## రేవ్ పార్టీ కేసులో నటి హేమ అరెస్ట్

**విశ్వంభర, హైదరాబాద్:** బెంగళూరు రేవ్ పార్టీ కేసులో సినీ నటి హేమ అరెస్ట్ అయ్యారు. గత నెలలో కర్ణాటక బెంగళూరులోని ఓ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీని అక్కడి పోలీసులు భగ్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా నటి హేమను తమ ముందు విచారణకు హాజరు కావాల్సిందిగా రెండుసార్లు నోటీసులు ఇచ్చారు. మే 27న రావాలని తొలుత నోటీసులు ఇవ్వగా, తనకు జ్వరం కారణంగా రాలేకపోతున్నానని, వారం రోజుల గడువు కావాలంటూ ఆమె కోరారు. దాంతో జూన్ 1న విచారణకు రావాలంటూ మరోసారి నోటీసులు జారీ చేశారు. అప్పుడూ దుమ్మా కొట్టడంతో తాజాగా మరోసారి నోటీసులు ఇచ్చి, విచారణ అనంతరం ఆమెను అరెస్ట్ చేశారు.

**హేమ అరెస్ట్‌కు కారణం ఇదే..**

బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడిన విషయం తెలిసిందే. ఇదే పార్టీకి వచ్చిన ఓ కారులో ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి సంబంధించిన స్టిక్కర్ కూడా దొరికింది. పార్టీలో పలు రకాల డ్రగ్స్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. 86 మంది మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు వైద్య పరీక్షల్లో తేలిందని నగర నేర నియంత్రణ దళం (సీసీబీ) అధికారులు వెల్లడించారు. 73 మంది పురుషుల్లో 59 మందికి, 30 మంది మహిళల్లో 27 మందికి వైద్య పరీక్షలో డ్రగ్ పాజిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. రేవ్ పార్టీ కేసులో అరెస్టయిన ఆరుగురు నిందితులతో పాటు సినీ నటి హేమ కూడా విచారణకు హాజరు కావాలని సీసీబీ పోలీసులు గత నెల 25న నోటీసులు జారీ చేశారు. అయితే తనకు వైరల్ ఫీవర్ వచ్చిందని, విచారణకు హాజరు కాలేనంటూ హేమ బెంగళూరు పోలీసులకు లేఖ రాశారు. విచారణకు హాజరు కావడానికి ఇంకాస్త సమయం కావాలని కోరారు. అయితే హేమ అభ్యర్థనను సీసీబీ పోలీసులు పరిగణనలోకి తీసుకోలేదు. విచారణకు గైర్హాజరైన హేమకు కొత్తగా నోటీసులు పంపారు. తాజాగా ఆమె విచారణకు హాజరు కాగా, విచారణ అనంతరం ఆమెను అరెస్ట్ చేశారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకు సీఎం దిశానిర్దేశం


**విశ్వంభర, హైదరాబాద్:** లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ సమయంలో కాంగ్రెస్ అభ్యర్థులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. అభ్యర్థులు, ఇన్చార్జ్ మంత్రులు, ఏఐసీసీ సెక్రటరీలతో సోమవారం ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "కౌంటింగ్ సమయంలో అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి. పోటాపోటీ ఉన్న నియోజకవర్గాల్లో నిర్లక్ష్యం వద్దు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తయ్యాకే ఈవీఎంల కౌంటింగ్ జరుగుతుంది. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చిత్తశుద్ధి, నిబద్ధత ఉన్నవారిని మాత్రమే ఏజెంట్గా పంపాలి. సీనియర్ నాయకులను కూడా కౌంటింగ్ సెంటర్లకు తీసుకెళ్లేలా చూడాలి. ప్రతి రౌండ్ కౌంటింగ్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రతి ఒక్కరి దగ్గరా 17సీ లిస్ట్ ఉండేలా చూసుకోవాలి. ఈవీఎం ఓట్లకు, 17సీ లిస్ట్ ఓట్లకు తేడా వస్తే అక్కడే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలి. అభ్యర్థులందరూ వీటిపై అవగాహనతో ఉండాలి" అని రేవంత్ సూచించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇన్చార్జ్ దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు స్థలం

**విశ్వంభర, హన్మకొండ:** తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసమే ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హన్మకొండ జిల్లా కేంద్రంలో ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఎన్నికల హామీలన్నీ తప్పకుండా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది కాకతీయ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. తెలంగాణ ఏర్పాటును ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆనాడు వ్యతిరేకించారని గుర్తుచేశారు. తెలంగాణను అవమానిస్తే చూస్తూ ఊరుకోము అని హెచ్చరించారు. ఉద్యమకారులకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమ్మేళనంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కోదండరామ్, తదితరలు పాల్గొన్నారు.

## ఆయన అరవడం, ఆయాసపడటమే..

### పవన్ కళ్యాణ్‌పై యాంకర్ శ్యామల హాట్ కామెంట్



**విశ్వంభర, హైదరాబాద్:** టాలీవుడ్ నటి, ప్రముఖ యాంకర్ శ్యామల ఈ ఎన్నికల్లో వైసీపీ తరఫున ప్రచారం చేయడం తెలిసిందే. ముఖ్యంగా, కాకినాడ జిల్లా పిఠాపురంలో వైసీపీ అభ్యర్థి వంగా గీత కోసం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్యామల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను అప్పుడూ, ఇప్పుడూ ఒక్కటే చెబుతానని, పిఠాపురంలో గెలిచేది వంగా గీత అని స్పష్టం చేశారు. 15 వేల ఓట్ల మెజారిటీతో పవన్ కల్యాణ్ గెలుస్తాడని సర్వేలు చెబుతున్నాయన్న ప్రశ్నకు శ్యామల బదులిస్తూ... సర్వేలు ఎప్పుడూ రిజల్ట్స్ కాబోవని, ఎవరు విజేత అన్నది జూన్ 4న తెలుస్తుందని అన్నారు. "ఒక్కటే మాట చెబుతా... రాజకీయాలు అంటే ఆవేశపడడం కాదు, రాజకీయాలు అంటే అరవడం కాదు. రాజకీయాలు అంటే సాయం చేయడం అని నేను నమ్ముతా. రాజకీయాలకు నేనిచ్చే నిర్వచనం ఇదీ! ఇప్పటివరకు ఆయన ఆవేశపడడం చూశాను, ఆయాసపడడం చూశాను. పాపం... వేదికలపై ఎంత అరుస్తారండీ ఆయన! ఆయనను ఈ విధంగా చూశానే తప్ప... సాయం చేయడం ఎక్కడా చూడలేదు" అంటూ శ్యామల పేర్కొన్నారు.

## మాల్దీవులకు నిషేధించడంపై ఇజ్రాయెల్ అదిరిపోయే కౌంటర్

**విశ్వంభర, ఢిల్లీ:** పాలస్తీనా భూభాగంలోని హమాస్ మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, పాలస్తీనా గడ్డపై సాధారణ పౌరులు కూడా సమిధలుగా మారుతున్నారంటూ అనేక దేశాలు ఇజ్రాయెల్ ను నిరసిస్తున్నాయి. ఈ క్రమంలో, ఇజ్రాయెల్ పౌరులు తమ దేశంలో పర్యటించడంపై మాల్దీవులు నిషేధం విధించింది. అయితే, మాల్దీవుల ప్రభుత్వ నిర్ణయానికి ఇజ్రాయెల్ అదిరిపోయే కౌంటర్ ఇచ్చింది. తమ పౌరులు భారత్ లోని లక్షద్వీప్ వెళ్లాలని ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయం ఓ ప్రకటన చేసింది. ఇంతకీ ఆ ప్రకటనలో ఏముందంటే... "ఇకపై ఇజ్రాయెల్ దేశస్థులను అనుమతించబోమని మాల్దీవులు ప్రకటించింది. అందుకే మీ కోసం భారతదేశంలోని కొన్ని సుందరమైన బీచ్ ల వివరాలను అందిస్తున్నాం. ఈ భారత బీచ్ లలో ఇజ్రాయెల్ పర్యాటకులకు హార్దిక స్వాగతం లభిస్తుంది. అత్యంత ఘనమైన ఆతిథ్యం అందిస్తారు. ఇప్పటివరకు మన దౌత్య వేత్తలు పర్యటించిన ప్రాంతాల ఆధారంగా ఈ బీచ్ లను సిఫారసు చేస్తున్నాం" అంటూ భారత్ లోని ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయం ట్వీట్ చేసింది. అంతేకాదు, లక్షద్వీప్, గోవా, అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్, కేరళ బీచ్ ల ఫొటోలను కూడా పంచుకుంది.

# ప్రజా పాలన కాదు.. గలీజు పాలన



**విశ్వంభర, హైదరాబాద్:**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'నాగార్జునసాగర్ ఉదంతం మరువకముందే నల్లగొండలో మరో ఘోరం' అంటూ వచ్చిన కథనాన్ని రీట్వీట్ చేశారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని పాతబస్తీ మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులో ఓ మృతదేహం లభ్యమైంది. దాదాపు పదిరోజులుగా ప్రజలు అవే నీళ్లు తాగుతున్నారు. తాగునీటిలో తేడా కనిపించడంతో మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి స్థానికులు వాటర్ ట్యాంకును పరిశీలించగా ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అంతకుముందు నాగార్జునసాగర్‌లో మంచినీటి ట్యాంకులో 30 కోతులు పడి చనిపోయాయి. నీళ్ల విషయంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేటీఆర్ స్పందించారు. ఇది ప్రజా పాలన కాదు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పాలన అని విమర్శించారు. కోతల్లేని కరెంట్ ఇవ్వరు... కోతకొచ్చిన పంటకు సాగునీళ్లివ్వరు... కోతులు పడి చనిపోయినా వాటర్ ట్యాంకులను పట్టించుకోరు... చివరకు నల్గొండలోని నీటి ట్యాంకులో పది రోజులుగా శవం ఉన్నా నిద్రలేవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సురక్షిత మంచినీళ్లు కూడా ఇవ్వలేని ఈ ప్రభుత్వానిది... ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలికొదిలేసిన గలీజు పాలన ఇది అని ఎద్దేవా చేశారు. మిషన్ భగీరథ పథకంతో దశాబ్దాల తాగునీటి సమస్యను తీరిస్తే... కనీసం నీటిట్యాంకుల నిర్వహణ కూడా వీరికి చేతకావడం లేదన్నారు. ఇదో అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ తీరు మారకపోతే ప్రజలు తరిమికొట్టడం ఖాయమన్నారు.

# కవిత జైల్లోనే..



(మొదటి పేజీ తరువాయి)

ఆమె తీహార్ జైలులో ఉన్నారు. ఈడీ కేసులో కోర్టు జ్యుడీషియల్ కస్టడీని పొడిగించడంతో కవితను తిరిగి తీహార్ జైలుకు తరలించారు. ఈడీ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని జులై 3వ తేదీ వరకు పొడిగిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. తదుపరి విచారణ జులై 3కు వాయిదా వేసింది. మే 10వ తేదీన ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్ ను పరిగణలోకి తీసుకున్న కోర్టు కవితను సమన్లు జారీచేస్తూ మీపై అభియోగాలు మోపబడ్డాయి. ఈ కేసుపై ట్రయల్ ప్రారంభం కావాల్సి ఉంది కాబట్టి జైల్లో ఉండాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది. కవితతో పాటు దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, చరణ్ ప్రీత్, అరవింద్ కుమార్ యాదవ్ నిందితులకు సంబంధించి.. కవిత, చరణ్ ప్రీతి ఇద్దరు మాత్రమే అరెస్ట్ అయ్యారు. వీరి కేసును జూలై 3కు కోర్టు వాయిదా వేసింది. మిగతా ముగ్గురికి లక్ష పూచికత్తుతో వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతూనే ఉంటుంది. కవిత ఈడీ కేసులో బయటకు రావాలంటే పైకోర్టు కవితకు బెయిల్ వస్తే బయటకు వచ్చే అవకాశం ఉంటుంది. మనీస్ సిసోడియాకు బెయిల్ రాకపోవటంతో రెండేళ్లుగా జైల్లో ఉంటూనే వస్తున్నారు. అదేతరహాలో బెయిల్ వచ్చేంత వరకు కవితకూడా జైల్లోనే ఉండాల్సి ఉంటుంది.

**కవితపై తీవ్ర అభియోగాలు నమోదు**

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితపైన దాఖలు చేసిన చార్జ్ షీటులో ఈడీ కీలక అంశాలు ప్రస్తావించింది. కవితపై అభియోగాలు నమోదు చేసిన ఈడీ.. 1100 కోట్ల రూపాయల నేరం జరిగిందని పేర్కొంది. రూ.192 కోట్ల లాభాలను ఇండో స్పిరిట్ పొందిందని తెలిపింది. 100 కోట్ల ముడుపులు ఆమ్ ఆద్మీ పార్టీకి ఇచ్చారని ఈడీ అధికారులు చెప్పారు. డిజిటల్ ఆధారాలను కవిత ధ్వంసం చేశారని తెలిపారు. రూ.292 కోట్ల నేరంలో కవిత పాత్ర ఉందని తెలిపింది ఈడీ. పీఎంఎల్ఏ సెక్షన్ 44, 45 కింద సప్లమెంటరీ ఛార్జ్ షీట్ ను దాఖలు చేసిన ఈడీ. పీఎంఎల్ఏ సెక్షన్ 17 ప్రకారం తెలంగాణ, ఢిల్లీ, ఏపీ, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, తమిళనాడు ఇతర ప్రాంతాల్లోని 24 స్థానాల్లో సోదాలు నిర్వహించామని చెప్పింది. ఇప్పటివరకు లిక్కర్ స్కాంలో 18 మందిని అరెస్ట్ చేసినట్లు ఈడీ తెలిపింది. ఈ కేసులో బెయిల్ పై ఉన్న శరత్ చంద్రా రెడ్డిని ఏ7గా, రాఘవ మాగుంటను ఏ18గా, ఏ 32గా కవిత పేరును ఈడీ పేర్కొంది. మొత్తం 49 మందిని ఈడీ అధికారులు విచారించారు. పీఎంఎల్ ఏ సెక్షన్ 50(2), (3) ప్రకారం.. కవిత, మాగుంట శ్రీనివాసులు, రాఘవ మాగుంట, గోపి కుమరన్, శరత్ చంద్రా రెడ్డి, సమీర్ మహేంద్రు, దినేశ్ అరోరా, అరుణ్ పిళ్లై, వి. శ్రీనివాస్ ఇతరుల వాంగ్మూలాల రికార్డు చేసినట్లు ఈడీ తెలిపింది. మరోవైపు లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించారు. జూన్ 7వరకు కస్టడీ పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు చెప్పింది. అదే రోజున సీబీఐ చార్జ్ షీటు దాఖలు చేయనుంది.

# దాహం తీర్చిన శవం కుళ్లిన వాటర్





**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** నాగార్జునసాగర్ ఘటన మరువక ముందే నల్గొండ జిల్లాలో మరో దారుణ ఘటన చోటు చేసుకుంది. నల్గొండ మున్సిపాలిటీలోని 11వ వార్డు పాతబస్తీ హిందూపూర్ వాటర్ ట్యాంకులో శవం తేలింది. వాటర్ ట్యాంక్‌లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభించడం స్థానికంగా కలకలం రేపింది. రొటీన్ తనిఖీల్లో భాగంగా అధికారులు వాటర్ ట్యాంకులో నీళ్లు చెక్ చేసేందుకు వెళ్లగా అందులో కుళ్లిన స్థితిలో ఉన్న శవం కనిపించింది. వెంటనే మున్సిపాలిటీ సిబ్బంది మృతదేహాన్ని వెలికి తీసి, ట్యాంకును శుభ్రం చేయించారు. తమకు తెలియకుండానే గత 10 రోజులుగా కుళ్లిన శవం ఉన్న నీళ్లు తాగామా అని స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

**మృతుడిని గుర్తించిన స్థానికులు**

వాటర్ ట్యాంక్‌లో కనిపించిన శవం హనుమాన్ నగర్‌కు చెందిన ఆవుల వంశీగా గుర్తించారు. అతడు గత పది రోజుల నుంచి కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. అయితే అతడు తనకు తానుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడా? లేదంటే మరెవరైనా హత్య చేసి శవాన్ని అందులో పడేశారా? అనే విషయం తెలియాల్సి ఉంది. మరోవైపు అది మంచినీళ్ల ట్యాంక్ కావడంతో గత పది రోజులుగా మున్సిపాలిటీలోని ప్రజలంతా అవే నీళ్లు తాగుతున్నారు. కలుషిత నీటిని 10 రోజుల నుంచి వాడామని తెలియడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

**జిల్లాలో ఇది రెండో ఘటన**

కాగా గత కొద్ది రోజుల క్రితం నాగార్జునసాగర్‌లో ఇదే రీతిలో మరో దుర్ఘటన జరిగిన సంగతి తెలిసిందే. దాహం తీర్చుకోవడానికి ఒకదాని వెంట మరొకటి మినీ వాటర్ ట్యాంకులోకి దిగిన కోతులు అందులోనే ప్రాణాలు కోల్పోయాయి. ఈ విషయం తెలియక అక్కడి ప్రజలు కలుషిత నీటినే సేవించారు. ఈ నేపథ్యంలో తాజాగా నల్గొండలోనూ మంచినీళ్ల ట్యాంకులో శవం తేలడం ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. కలుషితాన్ని అరికట్టేందుకు, నీటి సరఫరాకు భద్రత కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

## రాధాకిషన్ రావు ఇంట విషాదం

**విశ్వంభర, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితునిగా ఉన్న రిటైర్డ్ డీసీపీ పి. రాధాకిషన్ రావుకు మాతృ వియోగం కలిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించింది. జనగామ జిల్లా చిల్పూరు మండలం పల్లెగుట్టకు చెందిన రాధాకిషన్‌రావు పదోన్నతి పొందుతూ డీసీపీ స్థాయికి ఎదిగారు. తెలంగాణ ప్రభుత్వం దర్యాప్తు చేయిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన నిందితునిగా ఉన్నారు. ఇటీవలే తన తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నారని కోర్టు అనుమతి తీసుకున్న రాధాకిషన్‌రావు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. 98 ఏళ్ల వయసు ఉన్న సరోజనమ్మ నూరేళ్ల పాటు జీవించాలని కుటుంబ సభ్యులు ఆశించారు. ఆమె మరణించిన సమాచారం అందుకున్న రాధాకిషన్‌రావు తన తల్లిని చివరి చూపు చూసేందుకు అనుమతించాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేయించారు. అత్యవసర పిటిషన్‌ను విచారించి తన తల్లి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరుతూ రాధాకిషన్‌రావు నాంపల్లి కోర్టును అభ్యర్థించారు. ఈక్రమంలోనే తన తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు రాధాకిషన్‌రావుకు మధ్యంతర బెయిల్ మంజూరు అయ్యింది. మంగళవారం సాయంత్రం 6 వరకు కోర్టు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కరీంనగర్ ఆసుపత్రిలో సరోజనమ్మ మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచారు. కోర్టు ఆదేశాల అనంతరం ఆమె శవాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ సమీపంలోని పల్లెగుట్టకు తీసుకెళ్లనున్నారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు.


## ఫలితాల తర్వాత బీఆర్ఎస్ దుకాణం బంద్

**విశ్వంభర, హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని... లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ నడిచిందని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ఎగ్జిట్ పోల్స్ ప్రకారమే ఫలితాలు ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. అన్ని సర్వేలు కూడా బీజేపీ గెలుపునే చెబుతున్నాయని గుర్తు చేశారు. దేశంలో మోదీ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి రావాలని ప్రజలు కోరుకున్నారన్నారు. తాము ఎన్నికలకు వెళ్లింది కూడా మోడీ పేరు మీదేనని వెల్లడించారు. ఇతర పార్టీలకు ప్రధాని అభ్యర్థి కరవయ్యారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తామని కూడా వారు చెప్పలేకపోయారని ఎద్దేవా చేశారు. ప్రధాని అభ్యర్థే కరవైనప్పుడు కూటమికి ప్రజలు ఎలా ఓటు వేస్తారని ప్రశ్నించారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 350 నుంచి 370 సీట్ల మధ్య, ఎన్డీయే 400కు పైగా గెలుచుకుంటుందని భావిస్తున్నామన్నారు. తెలంగాణలో తాము గణనీయమైన స్థానాలు గెలుచుకుంటామని బండి సంజయ్ అన్నారు. 10 స్థానాలు పక్కా గెలుస్తామని... అంతకుమించి కూడా గెలువవచ్చునని ధీమా వ్యక్తం చేశారు. మిగిలిన స్థానాల్లోనూ తాము రెండో స్థానంలో ఉంటామన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

- కేసును సుమోటోగా స్వీకరించిన హైకోర్టు
- నేడు విచారించనున్న ధర్మాసనం..





**విశ్వంభర, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు సుమోటోగా విచారణ స్వీకరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసుపై మంగళవారం సీజే ధర్మాసనం విచారణ జరపనుంది. హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వెల్లడయ్యాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సుమోటా పిటిషన్ గా హైకోర్టు స్వీకరించింది. ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు పత్రికల్లో వచ్చిన కథనాలను ఆధారంగా హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, భుజంగరావు, ప్రణీతరావు, తిరుపతన్న ఫోన్ టాపింగ్ చేసినట్లు పత్రికల్లో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడానికి పలువురు రాజకీయనేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు భుజంగరావు వాంగ్మూలం ఇచ్చారని పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో హైకోర్టు న్యాయమూర్తి ఫోన్ సైతం టాప్ చేసినట్లు భుజంగరావు వెల్లడించినట్లు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలను సుమోటోగా స్వీకరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలోక అరాదే ధర్మాసనం.. మంగళవారం మధ్యాహ్నం ఈ పిటిషన్ ను విచారించనుంది.

# కౌంటింగ్ డౌన్ స్టార్ట్

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఎక్కువ మంది ఏజెంట్లు హాజరు అయ్యే అవకాశముంది. కౌంటింగ్ హాలు నుంచి 200 మీటర్ల దూరం వరకు ఎవరినీ అనుమతించమని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ శ్రీనివాసరెడ్డి చెప్పారు.

**మద్యం దుకాణాలు మూసివేత**

పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా తెలంగాణలో మద్యం దుకాణాలను ముందుజాగ్రత్త చర్యగా మూసివేశారు. మంగళవారం (జూన్ 4) ఉదయం 6 గంటల నుంచి బుధవారం (జూన్ 5) ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 4వ తేదీ మంగళవారం వెలువడనున్న లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్, ఫలితాల దృష్ట్యా నగరంలోని వైన్‌షాపులు, కల్లు కాంపౌండ్‌లు, బార్‌లు, రెస్టారెంట్లు, స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లలో మద్యం అమ్మకాలు నిషేధించనున్నారు.

**17 పార్లమెంట్ స్థానాలు..1855 టేబుళ్లు**

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 34 చోట్ల ఓట్ల లెక్కింపు జరగనుంది. 4వ తేదీ మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు మే 13వ తేదీన పోలింగ్ జరిగింది. మొత్తం 119 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో లెక్కింపునకు 1,855 టేబుళ్లు ఏర్పాటు చేశారు. అత్యధికంగా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 24 రౌండ్లలో, అత్యల్పంగా మూడుచోట్ల 13 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుపుతామని తెలంగాణ ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు.

**పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు**



తెలంగాణలో 2.18 లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. వీటి లెక్కింపు కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక హాల్ చొప్పున కేటాయించారు. చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాలలో రెండేసి హాళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌పై 500 పోస్టల్ బ్యాలెట్లు మించకుండా ఉండేలా ప్రణాళికను సిద్ధం చేశారు.

**24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు**

చొప్పదండి, దేవరకొండ, యాకుత్‌పుర స్థానాల్లో 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. సిర్పూర్, ఆసిఫాబాద్, స్టేషన్ ఘన్‌పూర్, ముథోల్, మానకొండూరు, ఆందోలు, జహీరాబాద్, గజ్వేల్, కార్వాన్, నకిరేకల్, శేరిలింగంపల్లి, ఆలేరు సెగ్మెంట్లలో 23 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. ఆర్మూర్, భద్రాచలం, అశ్వారావుపేటల్లో 13 రౌండ్లు మాత్రమే ఉంటాయి.

**మూడు దశల్లో ఓట్ల లెక్కింపు పరిశీలన**

ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తరవాత మూడు దశల్లో పరిశీలన ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన ఓట్ల లెక్కింపు పరిశీలకుడి ఆమోదం తరవాత ఆ రౌండ్‌లో ఏయే పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయన్నది ప్రకటిస్తారు.

**ర్యాండమ్‌గా వీవీ ప్యాట్ల పరిశీలన**

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక ఆ నియోజకవర్గంలోని వీవీప్యాట్ల నుంచి ర్యాండమ్‌గా ఐదింటిని ఎంపిక చేసి అందులోని ఓట్లను లెక్కించి ఆ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన టేబుళ్లలోని ఓట్ల లెక్కలతో సరిచూస్తారు.అన్నీ సక్రమంగా ఉన్నాయని గుర్తించిన తర్వాతే ఓట్ల లెక్కింపును అనుసరించి పరిశీలకుడు ఫలితాన్ని ప్రకటిస్తారు.

**మహబూబాబాద్ పార్లమెంట్‌దే మొదటి ఫలితం**

కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభం అయినా మొదటి అధికారిక ఫలితం మధ్యాహ్నం 34 గంటలకు వరకు ప్రకటించనున్నారు. అయితే ఈ ఫలితాల్లో మొట్టమెదటిది మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానిది వెలబడనుంది. ఈ నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు 13 రౌండ్లే. ఈ కారణంగా ఇక్కడి ఫలితం మధ్యాహ్నం వరకు తేలనుంది.

### పోలీసుల నిషేధాజ్ఞలు

2024 పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం అభ్యర్థుల విజయాన్ని పురస్కరించుకుని బహిరంగ ప్రదేశాల్లో పటాకులు పేల్చడంపై కూడా పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. హైదరాబాద్ నగరంలోని 16 కేంద్రాల్లో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు హైదరాబాద్ జిల్లా యంత్రాంగం పోలీసుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు చేసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద నగర పోలీసులతో పాటు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌ను మోహరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని శిక్షిస్తామని నగర పోలీస్ కమిషనర్ కె. శ్రీనివాసరెడ్డి ఉత్తర్వుల్లో తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఆయుధాలు, రాళ్లు తీసుకెళ్లరాదు. ఊరేగింపులు, సమావేశాల్లో ఆయుధాలు, కర్రలు ఉపయోగించరాదు ప్రజలు ఎవరైనా లేదా పార్టీల నేతలు మైకులు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఉపయోగించడాన్ని నిషేధించారు.



## బండ్ల గణేష్ కు తీవ్ర అస్వస్థత

**విశ్వంభర, జూబ్లీహిల్స్:** తాను ఏది అనుకుంటే అది నిర్భయంగా, నిర్మొహమాటంగా మాట్లాడుతూ..బండ్ల గణేష్' సోషల్ మీడియాలో నిత్యం హెడ్‌లైన్స్‌లో ఉంటూ వివాదాలకు కేంద్ర బిందువు అవుతాడు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నాడు. నిత్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటే ఉంటూ పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. అయితే, మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.ఈ క్రమంలోనే సోమవారం మధ్యాహ్నం బండ్ల గణేష్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయనను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు చికిత్స అందజేస్తున్నారు.తెలుగు సినీ పరిశ్రమలో ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ తీవ్ర అనారోగ్యంతో హస్పిటల్‌లో చేరడం సినీ ప్రముఖులు, అభిమానులు ఆందోళన గురవుతున్నారు.ఇదిలా ఉంటే... అయితే, ఒకవేళ కాంగ్రెస్ మెజారిటీ సీట్లు సాధిస్తే మైక్ ముందు కాంగ్రెస్ తరపున సవాళ్లు విసిరే నాయకుడు అందుబాటులో లేడే.. అన్న ఫీలింగ్‌లో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ..

**ఎలక్షన్ రిజల్ట్స్ పేరుతో మోసాలు**



**విశ్వంభర, హైదరాబాద్:** దేశం మొత్తం ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూస్తున్న వేళ దీన్నే ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడ వేశారు. ఎలక్షన్ రిజల్ట్స్ పేరుతో యాప్ సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారు. పలు గ్రూపుల్లో ఫేక్ ఎలక్షన్ రిజల్ట్స్ యాప్ వైరల్ అవుతోంది. దాన్ని క్లిక్ చేస్తే చాలు మీ ఫోన్లో ఉన్న సమాచారం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుంది. బ్యాంకు ఖాతా నుంచి, యూపీఐ పేమెంట్స్ వరకు అన్ని సైబర్ నేరగాళ్లు చేతుల్లో ఉంటాయి. మీ బ్యాంకు ఖాతా మొత్తం ఖాళీ అవుతుంది. ఇటువంటి ఫేక్ యాప్స్ నమ్మొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. అటువంటి యాప్స్ ను డౌన్లోడ్ చేయొద్దని అంటున్నారు. ట్రెండుకు తగ్గట్లుగా నేరగాళ్లు మోసాలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

## తెలంగాణ ఉద్యమంలో రేవంత్ ఉన్నాడా..?

- దశాబ్ది ఉత్సవాలు కాదు కాంగ్రెస్ వేడుకలు
- రాష్ట్ర గీతాన్ని కుదించడం సిగ్గుచేటు
- మందకృష్ణ మాదిగ తీవ్ర విమర్శలు

**విశ్వంభర, హన్మకొండ:** తెలంగాణ ఉద్యమంలో రేవంత్ ఉన్నాడా అని మంద కృష్ణ మాదిగ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం సాధించి దశాబ్ది ఉత్సవాలు కాదు కాంగ్రెస్ ఉత్సవాలు ను తలపించిందన్నారు ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ. సోమవారం ఆయన హనుమకొండ జిల్లా పల్లా రవీందర్ రెడ్డి హల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు లో రేవంత్ పాత్ర చెప్పలేదని, ఉద్యమంలో పాల్గొనని వాళ్లు ఉత్సవం చేస్తే ఎలా ఉంటుందో అది కొరవడిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సిఎం రేవంత్ కు ఏమాత్రం సంబంధం లేదని, రాష్ట్ర ఏర్పాటు లో ముగ్గురు మహిళల పేరు సోనియా గాంధీ, సుష్మా స్వరాజ్, మీరా కుమారి పాత్ర మరువలేనిది అన్న సిఎం సోనియా గాంధీ కోసం వెళ్ళినట్టే సుష్మా స్వరాజ్ ఇంటికి ఎందుకు పోలేదని మందకృష్ణ మాదిగ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ చరిత్రలో ఏ స్పీకర్ చేయని విధంగా మీరా కుమారి వ్యవహారించారు కాబట్టే తెలంగాణ ఏర్పాటు సాధ్యమని, తెలంగాణ బిల్లు ప్రవేశ పెట్టిన సుశీల్ కుమార్ షిండే తెలంగాణ గీతం అంశంలో కేసీఆర్ పదేండ్లు పొరపాటు చేసిందన్నారు. పదమూడు చరణాలలో మూడు మాత్రమే పెట్టి రేవంత్ రెడ్డి కూడా పొరపాటు చేసిందని, సారం, సందేశం, స్ఫూర్తి లేకుండా చేసి నైతికంగా చెప్పిందన్నారు. జాతీయ గీతం మాదిరే తెలంగాణ గీతం ఉంటుందని భావించామని, అందే శ్రీ రాసిన పాట యావత్ తెలంగాణ ఉద్రూతలుగించిందన్నారు. అంతేకాకుండా.. 'పది చరణాలు తొలగించిందుకు అందే శ్రీ కన్నీలు పెట్టుకోవాలి... భావ దారిద్రానికి నిదర్శనం. కొమురం భీమ్, పండుగ సాయన్నా, సర్వయ్ పాపన్న, కంచర్ల గోపన్న వంటి పోరాట యోధుల పేర్లు తొలగించిన పాట ను సీతక్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఎలా ఆమోదించినారు. అందె శ్రీ రాసిన.. నిన్న ప్రభుత్వం గుర్తించిన పాటను తెలంగాణ సమాజం గుర్తించం. అందె శ్రీ రాసిన పాట లో రెడ్డి సామాజిక వర్గం పేర్లు లేనట్టు ఉన్నాయి. అందుకే బహుజన పేర్లు తొలగించినారు. పోరాట స్ఫూర్తి ని నిద్రబుచ్చే పాట నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపి... తెలంగాణ సమాజం ను నిద్ర పుచ్చేలా కుట్రలు చేస్తున్నారు.. ఉద్యమ కాలం నాటి పాట ను అన్ని పార్టీ లను ఆమోదించే విధంగా కృషి చేస్తా.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులతో ప్రకటన చేయిస్తా. కేసీఆర్ ను కలిసి ఆయనతోనూ ప్రకటన చేయిస్తా.. రాజకీయ, కుల, మతాలకు అతీతంగా సదస్సు ఏర్పాటు చేస్తా.. కళాతోరణంను ఎందుకు తొలగించాలని చూస్తున్నారు. సమ్మక్క, సారలక్క లను చంపింది కాకతీయులు అయితే ఇంద్రవెల్లిలో చంపింది కాంగ్రెస్ కాదా.. తెలంగాణ అమరుల చావుకు కారకురాలు సోనియా గాంధీ కాదా.. 369మందిని పోలీస్ ల ద్వారా చంపింది కాసు బ్రాహ్మానంద రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం.





## గ్రాట్యూటీ కొలిక్కి రాక వాయిదా పడ్డ బీడీ కార్మికుల చర్చలు

**విశ్వంభర, మహబూబ్ నగర్ జూన్ 03:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో సోమవారం బీడీ కార్మికుల కూలీ రేటు పెంచాలని బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో కార్మిక సంఘాల నాయకులు చర్చలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఐదు సార్లు యజమానులతో కార్మిక సంఘాల ప్రతినిధులకు చర్చలు జరిగాయి. ఈ 5వ దఫా చర్చలో వేయి బీడీలకు రూ.230 కూలీ మరియు ప్రావిడెంట్ ఫండ్ యాజమాన్యం వాటా రూ.5 మొత్తం కలిపి వేయి బీడీలకు రూ.235 పెంచడం కొరకు యజమానులు అంగీకరించారు. గ్రాట్యూటీ సమస్య పెండింగ్ లో ఉండడం ఆ విషయం కూడా చర్చించాలని కార్మిక సంఘాలు పట్టుబట్టడంతో బీడీ యజమానులు గ్రాట్యూటీ గురించి చర్చించడం కొరకు మరో వాయిదాను కోరడం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా అనేక మంది కార్మికులు పనిచేస్తూ చనిపోయారని, చాలామంది కార్మికులు చేతకాక పనిని మానుకున్నారని వాళ్లకు ఇప్పటిదాకా గ్రాట్యూటీ చెల్లించకపోవడం విషాదకరమని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. గ్రాట్యూటీ పెంచే విషయంలో గతం మాదిరిగా యజమానులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కార్మిక సంఘాలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. పెంచిన కొత్త కూలీ ఏప్రిల్ 1 నుంచి అమలు అవుతుంది. ఈ చర్చలో బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యం సోహెల్, సుధాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వసీం, జియా సెట్, కార్మిక సంఘాల నాయకులు ఏఐటీయూసీ నాయకులు మాకం రామ్మోహన్, పీ వెంకటేష్, రాబర్ట్ టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యండీ ఖలీల్, పి.యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, టీఆర్ఎస్ కార్మిక విభాగం సభ్యులు అబ్రహం, ఎస్ జాన్, పెద్ద బాలరాజు, ఐఎఫ్‌టీయూ సభ్యుడు కే సూర్యం, జేఎన్ దేవదానం తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లు, రెస్టారెంట్లపై ఆగని ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో హోటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ



అధికారులు కొరఢా ఝుళిపిస్తున్నారు. వరుసగా తనిఖీలు చేస్తూ ప్రమాణాలు పాటించని హోటళ్లను సీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పలు హోటళ్ల తీరును చూసి అధికారులు షాక్‌కు గురవుతున్నారు. కనీస శుభ్రత పాటించని హోటళ్లు కొన్నయితే పాడైన ఆహారపదార్థాలు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న రెస్టారెంట్లు మరికొన్ని. ఇవన్నీ చూసి ప్రజలు బయటి ఫుట్ తినాలంటే భయపడుతున్నారు. ఒకపూట కడుపు మాడ్చుకున్నా ఫర్వాలేదు ఇంటికెళ్లి వండుకుని తినాలి అని ప్రజలు నిర్ణయానికి వచ్చేలా రెస్టారెంట్ల తీరు ఉంది. తాజాగా హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకా, కిచెన్ ఆఫ్ మూన్‌లైట్ బార్, హైడ్రేట్ ది బార్, న్యూ ఫిష్‌ల్యాండ్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. వీటిల్లో గడువు తీరిన ఆహార పదార్థాలు, పాడైపోయిన చికెన్ (5 కేజీలు), కారమెల్ కలర్, పెసర్లు (10 కేజీలు)ను గుర్తించి వాటిని అధికారులు సీజ్ చేశారు. మాంసం నిల్వ ఉంచే ప్రాంతంలో బొద్దింకలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు పాటించని లేబుల్ లేని కాజు (24 ప్యాకెట్లు), వండటానికి సిద్ధం చేసి ఫ్రిజ్‌లో ఎప్పటి నుంచో నిల్వ ఉంచిన పదార్థాలను సీజ్ చేసి నోటీసులు ఇచ్చారు. లక్డీకాపూల్‌లోని హైడ్రేట్ ది బార్‌లో ఎక్స్‌పైరీ అయిన చికెన్ వింగ్స్ (10 కేజీలు), అమూల్ పీనట్, పాస్తా (5 కేజీలు), లేబుల్ లేని బీబీక్యూ సాస్ గుర్తించి సీజ్ చేశారు. హోటల్ న్యూ ఫిష్‌ల్యాండ్‌లోని కిచెన్‌లో ఎలుకలు తిరుగుతున్నట్లు గుర్తించారు. సింథటిక్ ఫుడ్ కలర్, మూతలు ఏర్పాటు చేయని డస్ట్ బిన్లు, లేబుల్ లేని పదార్థాలు సీజ్ చేసి నోటీసులు జారీ చేశారు.

## తెలంగాణను తాకిన నైరుతి

* 6న రాష్ట్రంలోకి రుతుపవనాలు
* గతం కంటే ముందే రాక
* విస్తారంగా వర్షా లు కురిసే ఛాన్స్..



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగణలోకి నైతురు రుతుపవనాల ఆగమనంకు అంతా సిద్ధం అయింది. ఈ నెల 6వ తేదీన ఏపీ నుంచి తెలంగాణలోకి రాబోతున్నాయి. వీటి ప్రభావం అప్పుడే తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురవడంతోపాటు వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత నెల 30న కేరళను తాకిన రుతుపవనాలు.. కర్ణాటక మీదుగా రాయలసీమలోకి ప్రవేశించాయి. ఈనెల 6న రుతుపవనాలు తెలంగాణను తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది.

**ముందుగానే..**

చాలా రోజుల తర్వాత జూన్ 1, 2 తేదీల్లోనే రుతుపనాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభించడానికి రుతుపవనాలు రాక ఎంతో ఆవశ్యకం. రాయలసీమ జిల్లాల్లోకి ప్రవేశించిన రుతుపవనాలు క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. దీని ప్రభావంతో ఏపీలోనూ పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఈనెల 6న రుతుపవనాలు తెలంగాణను తాకే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రాయలసీమలోకి రుతుపవనాల రాకతో తెలంగాణలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆదివారం మొత్తం మబ్బులు పట్టి చిరుజల్లులు కురిశాయి. హైదారాబాద్ లో అయితే భారీ వర్షమే కురిసింది.

**తెలంగాణ జిల్లాల్లో ఈదురుగాలులు**

నైరుతి రుతుపవనాల రాకను పురస్కరించుకుని తెలంగాణ జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అసిఫాబాద్ జిల్లా వాంకిడిలో ఈదురుగాలులకు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. జగిత్యాల జిల్లా కోరుట్లలో పిడుగుపడి చెట్లు నేలకూలాయి. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది.

**మూడు రోజులు వర్షా లు**

రాగల మూడురోజులపాటు తెలంగాణ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఉపరితల ఆవర్తన ప్రభావంతో నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డితోపాటు ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడించింది.

## రైతులకు ఇబ్బందులు రావద్దు

- పచ్చిరొట్ట, పత్తి విత్తనాల ప్యాకెట్లు అందాలి
- బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రధాన వాణిజ్య పంట పత్తి సహా పచ్చిరొట్ట విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గడిచిన రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలు, వచ్చే మూడు నాలుగు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాలలో ఒక మోస్తరు నుంచి భారీ వర్ష సూచన ఉందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వర్షాలు దృష్టిలో పెట్టుకుని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే అన్ని జిల్లాలకు సరఫరా చేసిన పచ్చిరొట్ట, పత్తి విత్తనాల ప్యాకెట్లు రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అందే విధంగా చూడాలని ఆదేశాలు ఇవ్వాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇవాళ పత్తి విత్తనాలు, ఆదివారం పది లక్షల, 43 వేల, 474 ప్యాకెట్లతో కలిపి 84 లక్షల, 43 వేల, 474 సరఫరా కావడం జరిగిందని, ఇప్పటికే రైతులు 25 లక్షల, 10 వేల, 430 పత్తి ప్యాకెట్లు కొనుగోలు చేశారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కంపెనీల వారీగా సరఫరా సమీక్షించడం ద్వారా వ్యవసాయ శాఖ ప్రణాళిక ప్రకారం ఇంకా రాష్ట్రానికి సరఫరా చేయాల్సిన పత్తి ప్యాకెట్లను కూడా రైతులకు ఈ మూడు రోజుల్లో అందుబాటులో ఉంచేలా చూడాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

**విత్తనాలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తే చర్యలు**

పచ్చిరొట్ట విత్తనాలు ఇవాళ్టికి గత సంవత్సరంలో 37959.60 క్వింటాళ్లు రైతులు కొనుగోలు చేశారని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే 97,109 క్వింటాళ్లు అందుబాటులో ఉంచగా రైతులు 84,412 క్వింటాళ్లు పచ్చిరొట్ట విత్తనాలు కొనుగోలు చేశారని తెలియజేశారు. ప్రభుత్వం సరఫరా చేయ తలపెట్టిన విత్తనాలు ఈ నాలుగైదు రోజుల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో పచ్చిరొట్ట విత్తనాలు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి రావడం జరిగిందని మంత్రి ప్రస్తావించారు. రాష్ట్ర రైతు ప్రయోజనాలు పణంగా పెట్టి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా అనుమతి లేకుండా పత్తి విత్తనాల ప్యాకెట్లు విక్రయిస్తున్న 33 మందిపై కేసులు పెట్టి రూ. 2.49 లక్షల విలువ గల 118.29 క్వింటాళ్ల విత్తనాలును స్వాధీనం చేసుకున్నారని అధికారులు ప్రకటించారు. బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారని ఇద్దరు డీలర్లపై కేసులు పెట్టమని తెలిపారు. పత్తి విత్తనాలు మార్కెట్లలో అవసరం మేర అందుబాటులో ఉన్నాయని, రైతులందరూ అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. ఎన్నో మాయ మాటలు చెప్పి అమ్మే ప్రైవేటు వ్యక్తులు వద్ద రైతులు ఎలాంటి విత్తనాలు కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

# గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం



## నేడు ఎస్పీ బాలు జయంతి

తెలుగు నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు, తెలుగువారు అభిమానంగా బాలు అని పిలుచుకునే శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం దశాబ్దాల పాటు సినీ సంగీత సామ్రాట్టుగా నిలిచారు. పద్మశ్రీ డాక్టర్. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం (శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం) 1946 జూన్ 4 న నాటి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కోనేటమ్మపేట గ్రామంలో (ప్రస్తుతము ఈ గ్రామం తమిళ నాడు రాష్ట్రంలో ఉంది) జన్మించారు. ఒక సాంప్రదాయ శైవ బ్రాహ్మణ కుటుంబములో, ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు కల పెద్ద కుటుంబములో బాల సుబ్రహ్మణ్యం రెండో కుమారుడుగా పుట్టారు. ఆయన తండ్రి సాంబమూర్తి పేరొందిన హరికథా పండితులు. బాల్యము నుంచే బాలుకు పాటలు పాడటం ఒక హాబీగా ఉండేది. బాల్యం నుంచే బాలుకు సంగీతంపై ఇష్టం ఏర్పడింది. హార్మోనియం, పిల్లనగ్రోవి వంటి వాద్యాలు వాయించేవారు. తండ్రి వాయిస్తున్నప్పుడు చూసి తను నేర్చుకునేవారు. తండ్రి కోరిక మేరకు ఇంజనీరు కావాలనే ఆశయంతో మద్రాసులో ఏఎంఐఈ కోర్సులో చేరారు. ఆ కాలంలోనే వివిధ పాటల పోటీల్లో పాల్గొని ఎన్నో బహుమతులు గెలుచుకొన్నారు.

1964లో మద్రాస్ తెలుగు కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన పోటీలో బాలు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఇది ఆయన జీవితంలో టర్నింగ్ పాయింట్.

ఏఎంఐఈ చదువు పూర్తి కాకుండానే బాలసుబ్రహ్మణ్యం చలనచిత్ర రంగ ప్రవేశం చేశారు. సంగీత దర్శకుడు ఎస్పీ కోదండపాణి ఆయనకు అవకాశం ఇచ్చారు. 1966లో నటుడు, నిర్మాత అయిన పద్మనాభం నిర్మించిన కోదండపాణి సంగీత దర్శకత్వం వహించిన, శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న చిత్రంతో బాలు సినీ గాయకుడిగా జీవితం ప్రారంభించారు. ఈ చిత్రానికి తనకు సినీ గాయకుడిగా జీవితాన్ని ప్రసాదించిన కోదండ పాణిపై భక్తితో, అభిమానంతో తాను నిర్మించిన ఆడియో ల్యాబ్ కు "కోదండపాణి ఆడియో ల్యాబ్స్" అని ఆయన పేరే పెట్టుకున్నారు బాలు. తరువాత తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం సినిమాల నుంచి ఆయనకు ఆఫర్లు వచ్చాయి. సినిమాలో పాటలు పాడే ముందు బాలు.. మ్యూజిక్ బ్యాండ్‌కు లీడర్‌గా ఉండేవారు. బ్యాండ్‌లో ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా గిటార్ వాయించేవారు. గళం విప్పినా.. స్వరం కూర్చినా.. ఆ పాటలోని కవి భావాన్ని సూటిగా ప్రేక్షకుల వద్దకు తీసుకువెళ్ళగలిగే సత్తా బాలు గళానికి ఉంది. గురుముఖంగా శాస్త్రీయ సంగీతం ప్రత్యేకంగా నేర్చుకొన్న నేపథ్యం లేకపోయినా.. స్వర రచయిత ఇచ్చిన బాణీని శృతి పక్వంగా, లయ బద్ధంగా గానం చేయగలిగిన సహజ సిద్ధమైన ప్రతిభ బాలూకు రాణింపు తెచ్చింది. తరాలు మారినా ఎందరో నటులకు వారి హావ భావలకు, నటనా శైలులకు అనుగుణంగా ఆయన పాటలు పాడి ప్రాణం పోశారు. అందుకే అమర గాయకుడు ఘంటసాల తరువాత తెలుగు సినీ పాటకు సిసలైన వారసుడిగా నిలిచారు. పదాల మాధుర్యాన్ని గమనించి ఆయన చేసే ఉచ్చారణ, పాటను పండిత పామరులకి చేరువ చేసింది. శంకరాభరణం, సాగర సంగమం లాంటి తెలుగు చిత్రాలే కాకుండా "ఏక్ దుజే కేలియే," లాంటి హిందీ చిత్రాలకు అతను పాడిన పాటలు దేశమంతా ఉర్రూతలూగించాయి.

బాలు 40 ఏండ్ల సినీ ప్రస్తానంలో 40 వేల పాటలు 11 భాషల్లో పాడి, 40 సినిమాలకి సంగీత దర్శకత్వం వహించి ప్రపంచంలోనే ఒక అరుదయిన రికార్డు సృష్టించారు. తెలుగు, తమిళమే కాకుండా కన్నడంలో కూడా అతను పాడిన పాటలకి జాతీయ పురస్కారాలు లభించాయి. 2001 పద్మశ్రీ భారత ప్రభుత్వం తరపున, 1999 డాక్టరేట్ శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, 2011 పద్మభూషణ్, 2016 శత వసంత భారతీయ చలనచిత్ర మూర్తిమత్వ పురస్కారం తదితరాలను ఆయన అందుకున్నారు. గాయకుడి గానే కాకుండా గాత్రదాన కళాకారుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా ఆయా విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారాన్ని 29 సార్లు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి గాన గంధర్వుడు. 2016 నవంబరులో గోవాలో జరిగిన 47వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఆయనకు శత వసంత భారతీయ చలనచిత్ర మూర్తిమత్వ పురస్కారాన్ని (సెంటినరీ అవార్డ్ ఫర్ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2016) ప్రదానం చేశారు.

బాలు...1981 తమిళనాడు ప్రభుత్వం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను 1999లో, కర్నాటక ప్రభుత్వం కర్నాటక రాష్ట్ర అవార్డు 2008లో, సత్యబామా విశ్వవిద్యాలయం, చెన్నై డాక్టరేట్ 2009లో, ఆంధ్ర విశ్వ విద్యాలయం కళా ప్రపూర్ణ అవార్డు 2009లో, జేఎన్‌టీయూ అనంతపురం గౌరవ డాక్టరేట్ 2010లో, ఘంటసాల పురస్కార్ ఘంటసాల కుటుంబం కళా ప్రదర్శిని, చెన్నై 2017లో, గౌరవ డాక్టరేట్ ది ఇంటర్నేషనల్ తమిళ విశ్వవిద్యాలయం, యునైటెడ్ స్టేట్స్ 2017లో తదితర అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. నటుడిగా బాల సుబ్రహ్మణ్యం అనేక సినిమాల్లో నటించాడు. ఈటీవీలో "పాడుతా తీయగా" అనే కార్యక్రమంతో బాల సుబ్రహ్మణ్యం బుల్లితెర ప్రవేశం చేశారు. అనేక మంది కొత్త గాయనీ గాయకులను ఈ కార్యక్రమం ద్వారా పరిచయం చేశారు. శాస్త్రీయ సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, బాలును ఉద్దేశించి "మేము సినిమాలో పాట పాడాలంటే ఓ రోజంతా రిహార్సల్ చేసి పాడతాము. అలాంటిది బాలు వచ్చి రాగానే ఒక సారి విని వెంటనే సంగీత కారుడు చెక్కిన దానికి తనవైన సొబగులు అద్ది మరింత రంజకంగా గంటలోపు పాట రికార్డు చేసేస్తాడు, వాడి ప్రతిభను నేనెలా చెప్పేది" అంటూ చేసిన వ్యాఖ్యానికి మించిన కితాబు ఏముంటుంది. బాల సుబ్రహ్మణ్యం దక్షిణ భారత భాషల్లో మరియు హిందీలో ఐదు దశాబ్దాలుగా తరాల నటీనటుల కోసం ఎన్టీఆర్, అక్కినేని, కృష్ణ, శోభన్ బాబు, ఎంజీఆర్, శివాజీ గణేషన్, జెమిని గణేశన్ నుంచి ప్రస్తుత తారల వరకు అత్యధిక పాటలు పాడిన గాయకుడిగా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కు సాధించారు. బాలు భార్య సావిత్రి కాగా, పాటతో పెనవేసుకున్న అనుబంధం మరిచి పోకుండా పిల్లలకు చరణ్, పల్లవి పేర్లు పెట్టు కున్నారు. 2020 ఆగస్టు 5న బాల సుబ్రహ్మణ్యం కోవిడ్ 19 చికిత్స కోసం చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరారు. ఇతర శ్వాసకోశ సమస్యలు కూడా చేరి, పరిస్థితి ఆశాజనకంగా లేక, ఎక్మో, వెంటిలేటర్ సాయంతో చికిత్స పొందుతూ.. సెప్టెంబరు 25న మధ్యాహ్నం 1.04 లకు బాలు తుదిశ్వాస విడిచారు. సెప్టెంబరు 26న తిరువళ్ళూరు జిల్లాలోని రెడ్ హిల్స్, తామరపాకంలోని ఆయన వ్యవసాయం క్షేత్రంలో తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో అంత్య క్రియలు నిర్వహించారు.

# సేవా నిరతికి ప్రతిరూపం దుగ్గిరాల జీవితం




తమ తాత తండ్రుల నాటినుండి నివాసముంటున్న తమ ఆవాస స్థానాలను వదిలి, కేవలం ఒక వ్యక్తి చెప్పిన మాటలను తూ.చా తప్పకుండా పాటించి ఒక నిరసన తెలియ జేయడం కోసం లక్ష్య సాధన ధ్యేయంగా గ్రామాలనే వదిలి వెళ్ళిన ఉదంతం చరిత్రలో ఎక్కడా జరిగి ఉండదు. భారత స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఒక అరుదైన స్ఫూర్తిదాయకమైన సంఘటన తెలుగు నేలపై జరిగింది. ఒకరు కాదు ఇద్దరు కాదు, పదులు కాదు వందలు కాదు, రెండు గ్రామాలకు చెందిన పదిహేడు వేల మంది ఆ సంఘటనలో స్వగ్రామాలు వదిలి సరి హద్దులు దాటి బయట సంవత్సర కాలంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ లక్ష్యం కోసం జీవితాలు గడపాలంటే అది సామాన్యమైన విషయం కాదు. అలా వేలాది మంది అభిమానాన్ని చూరగొని వారిని సంఘటితంగా ఒక్కటిగా నిలిపిన ఘనత ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, తెలుగు వాడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య దక్కుతుంది. 1919 లో బ్రిటిష్ ప్రభుత్వం చీరాల, పేరాల రెండు గ్రామాలను కలిపి మునిసిపాలిటీగా విలీనం చేసినపుడు, అధిక పన్నులు చెల్లించడానికి వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమానికి గోపాల కృష్ణయ్య నాయకుడు. ఇది స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన గాంధీజీ సందర్శించి అభినందించిన చీరాల పేరాల సమరం సుప్రసిద్ధం, ముఖ్య ఘట్టం.

స్వాతంత్ర్య సమర యోధుల్లో ప్రముఖుడు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య (జూన్ 2, 1889 జూన్ 10, 1928) ఆయన గొప్ప నాయకుడు, సాహసికుడు, వక్త, కవి, గాయకుడు. ఆంధ్ర రత్న బిరుదు బిరుదాంకితుడు. కృష్ణా జిల్లా, పెనుగంచిప్రోలు గ్రామంలో 1889 జూన్ 2 న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జన్మించారు. ఆయన పుట్టిన మూడవ రోజునే తల్లి సీతమ్మ, మూడో ఏట తండ్రి కోదండ రామస్వామి మరణించారు. అప్పటినుండి పిన తండ్రి, నాయనమ్మల సంరక్షణలో పెరిగారు. కూచిపూడిలోను, గుంటూరులోను ప్రాథమిక విద్య జరిగింది. హైస్కూలులో చదివే సమయంలోనే 'జాతీయ నాట్య మండలి' స్థాపించి సంగీత, నాటక కార్యక్రమాలు నిర్వహించారు. అయితే చదువుపై అంత శ్రద్ధ చూపక పోవడం చేత మెట్రిక్యులేషనులో తప్పారు. తరువాత బాపట్ల లో చదివి ఉత్తీర్ణుడయ్యారు.

# తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర ఆరుద్ర

## నేడు ఆరుద్ర వర్ధంతి



తెలుగు సాహిత్యంలో ఆరుద్రది ప్రత్యేక స్థానం. అపరాధ పరిశోధక నవలల నుంచి సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల వరకు ఆరుద్ర స్పృశించని సాహితీ శాఖ లేదంటే అతిశయోక్తి కాదేమో. కవిగా, రచయితగా, కథకుడిగా, పరిశోధకుడిగా, నాటక కర్తగా, విమర్శకుడిగా ఆరుద్ర సాహితీ సేవనం అనితరసాధ్యం. నిరంతరం నవ్యత కోసం పరితపించిన నిత్య శోధనా సక్తులు ఆరుద్ర. శ్రీశ్రీ తర్వాత యువతరంపై ఎక్కువ ముద్ర పడిన కవిగా పేరు పొందిన ఆరుద్ర 'అభ్యుదయ రచయితల సంఘం' వ్యవస్థాపకుల్లో ఒకరు.

**తెలుగు సినిమా పాటకు ఓ కొత్త ఒరవడి సృష్టించిన ఆరుద్ర**

సంగీత దర్శకులిచ్చిన బాణీలకు అనుకూలంగా, సునాయాసంగా, సరళంగా పాటలు రాయగలిగారు. ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివ శంకర శాస్త్రి. 1925 ఆగస్టు 31న విశాఖ పట్టణంలో ఆరుద్రా నక్షత్రాన జన్మించిన ఆరుద్రపండిత వంశంలో పుట్టడం భూమికగా బాల్యం నుంచీ సాహిత్యంపై మక్కువ కలిగి, పట్టు చిక్కించు కున్నారు. తెలుగుతో పాటు అనేక భాషల్లోనూ పాండిత్యం సంపాదించారు. విశాఖపట్నం ఏవీఎన్ కాలేజీ ఉన్నత పాఠశాలలో, విజయనగరంలో ఎంఆర్ కళాశాలలో ఆరుద్ర విద్యాభ్యాసం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో చదువుకు స్వస్తి పలికి 194347 మధ్యకాలంలో రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో గుమ్మస్తాగా పనిచేశారు. తరువాత మద్రాస్ కు మకాం మార్చి, ఆనందవాణి అనే పత్రికకు రెండేళ్ళు సంపాదకుడిగా పనిచేసారు. 1949 లో సినీరంగ ప్రవేశం చేసి, అనేక సినిమాలకు మాటలు, పాటలు వ్రాశారు. 1954లో ప్రఖ్యాత రచయిత్రి అయిన రామలక్ష్మిని వివాహం చేసుకున్నారు.

చిత్తూరు నాగయ్య నటించిన 'బీదలపాట్లు' చిత్రంలో తొలిసారి ఆరుద్రకు సినీ పాటల రచనకు అవకాశం వచ్చింది. అందులో ఆయన రాసిన "ఓ చిలుకరాజా నీ పెళ్ళెపుడయ్యా..." పాట అలరించింది. ఆరుద్ర గురించి తెలిసిన ప్రఖ్యాత హిందీ నటులు రాజ్ కపూర్ తన 'ఆహ్' చిత్రాన్ని తెలుగులో డబ్బింగ్ చేస్తూ, ఆయననే రచయితగా ఎంచుకోగా, రాజ్ కపూర్ 'ప్రేమలేఖలు' తెలుగులోనూ మంచి ఆదరణ పొందింది. అందులో ఆరుద్ర పలికించిన పాటలన్నీ జనాన్ని మురిపించాయి. "పందిట్లో పెళ్ళవుతున్నాదీ.. కనువింద వుతున్నాదీ.." పాట విశేషాదరణ పొందింది. నాటి రోజుల్లో పెళ్లి పందిళ్ళలో బాజా భజంత్రీల ద్వారా బాగా వినిపించేది.

ఆరుద్ర వందలాదిగా గేయాలు, గేయ నాటికలు, కథలు, నవలలు, సాహిత్య పరిశోధక వ్యాసాలు, వ్యంగ వ్యాసాలు, పుస్తకాలకు పీఠికలు, పుస్తకాలపై విమర్శలు... ప్రధానంగా సినీ గీతాలు ఒక్కటే మిటి, సకల సాహితీ ప్రక్రియల్లో వైవిధ్య రచనల్లో సాటిలేని మేటి అనిపించుకున్నారు.

త్వమేవాహం, సినీవాలి, కూనలమ్మ పదాలు, ఇంటింటి పద్యాలతో పాటు వెన్నెల వేసవి, దక్షిణ వేదం, జైలు గీతాలు వంటి అనువాద రచనలు రాదారి బంగళా, శ్రీకృష్ణదేవరాయ, కాటమరాజు కథ వంటి అనేక రూపకాలుతో పాటు కథలనూ, నవలలనూ కూడా రాశారు. మేధస్సునే కాక, ఆరోగ్యాన్ని కూడా ఫణంగా పెట్టి రచించిన సమగ్ర ఆంధ్ర సాహిత్యం ( 14 సంపుటాలు) ఆరుద్ర పరిశోధనా దృష్టికి పరాకాష్ఠ. వేమన వేదం, మన వేమన, వ్యాస పీఠం, గురజాడ గురుపీఠం, ప్రజాకళలో ప్రగతి వాదులు వంటివి ఆరుద్ర సాహిత్య విమర్శనా గ్రంథాలు. రాముడికి సీత ఏమౌతుంది?, గుడిలో సెక్స్ వంటి రచనలు ఆరుద్ర పరిశీలనా దృష్టికి నిదర్శనాలు. సంగీతం పైనా, నాట్యం, ఇతర కళలపై సాధికారికంగా రచించిన వ్యాసాలు, చదరంగం అంశాన్ని దశాబ్దాలకు పూర్వమే ఒక గ్రంథస్థం చేయడం ఆరుద్రలోని ప్రత్యేకతకు నిదర్శనం. అంతేకాదు, ఆరుద్ర క్లబ్ పాటలు కూడా విశేష సినీ ప్రేక్షకుల ఆదరణకు పాత్రాలు అయినాయి. మ్ము మ్ము మ్ము ముద్దంటే చేదా ఇపుడా ఉద్దేశం లేదా?, తీస్కో కోకాకోలా ఏస్కో రమ్ము సారా.., మసక మసక చీకటిలో మల్లెతోట వెనకాల; మొదటి పెగ్గులో మజా వేడి ముద్దులో నిషా లాంటి పాటలెన్నో ఆరుద్రనే రాశారా అన్న అనుమానం కలిగేలా చేశాయి. తెలంగాణ పోరాట ఇతివృత్తం నేపథ్యంలో రాసిన త్వమేవాహంక చదివి ఇక నేను పద్యాలు రాయక పోయినా పరవాలేదు అని మహాకవి శ్రీశ్రీ ప్రశంస పొందిన ఆరుద్ర... ఇతను 'ఆరుద్ర' కాదు, 'ఆరో రుద్రుడు' అని శ్రీశ్రీ చేత శ్లాఘించ బడిన గొప్ప వ్యక్తి ఆయన. తెలుగు సాహితీ పుస్తకంలో చెరగని సంతకం చేసిన ఆరుద్ర... మహాకవి శ్రీశ్రీకి మేనల్లుడు, ప్రఖ్యాత తెలుగు రచయిత్రి కే రామలక్ష్మికి పతి దేవుడు. 1998 జూన్ 4న ఆరుద్ర ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోనే బాల్యానికి స్వేచ్ఛ



## నేడు అంతర్జాతీయ పీడిత బాలల దినోత్సవం

ఇష్టం లేని పనిని బలవంతంగా చేయించడమే బానిసత్వం. పిల్లల వద్ద బలవంతంగా పని చేయించుకోవడం, ఇళ్ళల్లో వెట్టి చాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపు వృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోనే పరిష్కారం సాధ్యమని విజ్ఞుల భావన.

ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా.. ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరి కొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్‌ను అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు, భిక్షాటన వృత్తిలోకి మరి కొందరు బాలలు బలవంతంగా నెట్టవేయడుతున్నారు. వివిధ రంగాల్లో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. బానిసత్వంలో ఉన్న బాలలకు విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత ప్రభుత్వ అధికారుల్లో లేకపోవడం బాధాకరం. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగంలోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా.. అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేసింది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధంగా సేవలు చేయించు కోవడం అపరాధం. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాల్లో, గనుల్లో, ఇతర ప్రమాదకరమైన పనుల్లో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనుల్లో నియమించ రాదు.

1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొందించిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయి కూడా.

బాలల హక్కుల సంబంధిత కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు.

రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించడం లేదు. ప్రపంచ బాలకార్మికుల్లో మూడవ వంతు మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుంచి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుంచి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలల్లో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్ర మాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా.. బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



# ఢిల్లీ తాజ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో అగ్నిప్రమాదం

**విశ్వంభర, ఢిల్లీ:** తాజ్ ఎక్స్ ప్రెస్ రైల్లో అగ్నిప్రమాదం జరిగింది. ఢిల్లీ నుంచి ఆగ్రా వెళ్తున్న తాజ్ ఎక్స్‌ప్రెస్ లో మంటలు చెలరేగాయి. 4 కోచ్‌లలో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో తుగ్లకాబాద్-ఓఖ్లా మధ్య రైలును నిలిపేశారు. ఈ ఘటనలో ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని రైల్వే శాఖ ప్రకటించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగింది. 6 అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని రైల్వే డీసీపీ తెలిపారు. షాట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు సమాచారం. రైల్లో మంటలు చెలరేడంతో ప్రయాణికులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏం జరిగిందో తెలియక ప్రాణ భయంతో హడలిపోయారు. అయితే, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరక్కపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సౌత్ ఈస్ట్ ఢిల్లీ సరితా విహార్ దగ్గర ఈ ప్రమాదం జరిగింది. సాయంత్రం 4గంటల 24 నిమిషాలకు రైల్లో మంటలు చెలరేగినట్లు తమకు సమాచారం అందిందని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ అధికారి ఒకరు తెలిపారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందిని ఘటనా స్థలానికి పంపామని, వారు మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారని అధికారి వెల్లడించారు. ఢిల్లీ సమీపం ఓఖ్లా, తుగ్లకాబాద్ మధ్య తాజ్ ఎక్స్ ప్రెస్ లో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రైలులోని ఒక బోగీలో మంటలు రావడంతో లోకో పైలెట్ అప్రమత్తమయ్యారు. వెంటనే రైలు నిలిపివేశారు. ఢిల్లీ, ఆగ్రా మార్గంలో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి" అని రైల్వే అధికారి తెలిపారు.

# గోడకూలి ఇద్దరు చిన్నారుల మృతి..

## మరో ముగ్గురికి గాయాలు



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో విషాదం చోటుచేసుకుంది. నగరంలోని మైలార్ దేవ్‌పల్లి బాబుల్ రెడ్డి నగర్‌లో గోడకూలి ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే చనిపోయారు. మరో మగ్గురికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఘటన చోటు చేసుకుంది. ఈ ఏరియాలో బీహార్, ఒడిశాకు చెందిన కొందరు వలస కూలీలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. అయితే స్థానికంగా ఉన్న కంపెనీలో వీరంతా పనిచేస్తున్నారు. ఆయా కుటుంబాలకు చెందిన చిన్నారులు ఇంటి ముందు ఆడుకుంటుండగా గోడ ఒక్కసారిగా కూలిపోయింది. దాంతో గోడ శిథిలాల కింద చిక్కుకుని ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఇదే ప్రమాదంలో మరో ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయపడ్డారు. దాంతో వెంటనే వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన చిన్నారులు నూర్జాన్, ఆసిఫ్ పర్వీన్ గా గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న మైలార్ దేవుపల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు. నాణ్యత లేకుండా నిర్మించిన గోడే ప్రమాదానికి కారణమని పోలీసులు చెబుతున్నారు. రాత్రి కురిసిన చిన్న వర్షానికి గోడ తడిసి కూలిపోయింది. పిల్లలు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు, మున్నీరుగా విలపిస్తున్నారు.

# ఒక్కటి కూడా వదలను..

- ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తా
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**విశ్వంభర, ఖమ్మం :** తెలంగాణలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇచ్చినటువంటి హామీలన్నింటిని నెరవేరుస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో పర్యటించారు మంత్రి పొంగులేటి. ఈ సందర్భంగా అక్కడి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం.. న్యాయమైన కోరికలు అన్నీ నెరవేరుస్తామని తెలిపారు. సంవత్సరంలోపు పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి చేస్తామని.. రూ.22.5 కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ఏడాదే రోహిణి కార్తెలోనే వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని పేర్కొన్నారు. అనేక కష్టాలు, నష్టాలు పడి తనను మంచి మెజారిటీతో గెలిపించారని, మీరిచ్చిన అవకాశంతోనే తాను ఈస్థాయిలో ఉన్నానని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పాలేరు నుంచి అత్యధిక మెజారిటీ రాబోతోందని చెప్పారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదవారికి ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, అర్హులైన వారికి ఆసరా పెన్షన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఓడిపోయిన విషయాన్ని మరిచి బీఆర్ఎస్ నేతలు ఇంకా అహంకార ధోరణి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.



# క్రికెట్ ఆడుతూ సిక్స్ కొట్టి.. మృతి

**విశ్వంభర, హైదరాబాద్ :** క్రికెట్ ఆడుతూ బ్యాటింగ్ చేస్తున్న ఓ యువకుడు సిక్స్ కొట్టి ఆ వెంటనే మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటన మహారాష్ట్రలోని థానేలోని మీరారోడ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. తమతో పాటు అప్పటివరకు క్రికెట్ ఆడుతూ అతడు మృతి చెందిన ఘటన అక్కడి వారిని షాక్‌కు గురిచేసింది. బౌలర్ బంతి వేయగానే షాట్‌ను కొట్టి ఆ తర్వాతి బంతిని ఆడడానికి అతడు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా అక్కడే కుప్పకూలిపోయాడు. తోటి ఆటగాళ్లు అతడిని వెంటనే లేపే ప్రయత్నం చేశారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదు. దీనిపై కేసు నమోదుచేసుకున్న పోలీసులు మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు.

# కౌంటింగ్‌కు కరీంనగర్ రెడీ..

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- ఎంపీ సీటుకు 28 మంది పోటీ
- కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
- కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత



**విశ్వంభర, కరీంనగర్ :** నేడు కరీంనగర్ లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు సిద్ధం అయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపునకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు ఎస్ఆర్ఆర్ కాలేజీలో ఓట్ల లెక్కింపునకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేరువేరుగా ఓట్ల లెక్కింపును చేపడుతారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 395 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 18 టేబుల్స్ 22 రౌండ్లు, చొప్పదండి లోని 327 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్, 24 రౌండ్లు, వేములవాడ లోని 260 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 19 రౌండ్స్ వారీగా ఓట్లను లెక్కించనున్నారు. సిరిసిల్ల 287 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 21 రౌండ్స్, మానకొండూర్ 316 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 23 రౌండ్స్, హుజురాబాద్ 305 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 22 రౌండ్స్, హుస్నాబాద్ 304 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 22 రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## పోటీలో 28 మంది..

కరీంగనర్ పార్లమెంట్ స్థానంలో మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,97,150 మంది ఓటర్లు ఉండగా, 13,03,690 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 72.54 నమోదయింది. వయోవృద్ధులు దివ్యాంగులు 1625 మంది ఉండగా, హెూమ్ ఓటింగ్ ద్వారా 1560 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. పోలింగ్ సిబ్బంది 10, 200 మంది ఉండగా 8,811 మంది, సర్వీస్ ఓటర్స్ 1018 మంది ఉండగా, 476 మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను కరీంనగర్ లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు.

## నియోజకవర్గాల వారీగా..

కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల కోసం సీట్లు కేటాయించారు. విద్యుత్తు నిరంతరయంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కోసం సిబ్బందిని నియోజకవర్గంలో వారీగా సైతం అలాట్ చేశారు. దీనికోసం సెకండ్ రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పమేలా ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌంటింగ్ సూపర్ వైజర్స్ 124 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 124, మైక్రోఅబ్జర్వర్లు 124 మందిని కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్వైజర్స్ 21, కౌంటింగ్ అసిస్టెంట్లు 35, మైక్రో అబ్జర్వర్లు 14 మందిని అలాట్ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకు వీరిని టేబుల్స్ వారీగా కేటాయించనున్నారు. వీరందరికీ ఇప్పటికే ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇచ్చారు.

## ఉదయం 8 గంటల నుంచే..

మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఎనిమిదిన్నర గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా ప్రకటించనున్నారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు ఫలితాలను ఎన్నికల కమిషన్ వెబ్సైట్‌తో పాటు ఎంకోర్ సాఫ్ట్వేర్ లో నమోదు చేయనున్నారు. కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతి ఆధ్వర్యంలో పటిష్టమై న భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మంగళ వారం 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ ముగిసే వరకు ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీ ఎదుట ఉన్న రోడ్డుపై రాకపోకలకు అనుమతి లేదు. ఈ మేరకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లకు గుర్తింపు కార్డుల ను అందిస్తున్నారు. గుర్తింపు కార్డులు లేని ఏజెంట్లు, సిబ్బందిని అనుమతించేది లేదని అధికారులు సూచిం చారు. సోమవారం ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సాధారణ ఎన్నికల పరిశీలకులు అమిత్ కటారియా, కౌంటింగ్ పరిశీలకురాలు జీ నజ్మాతో కలిసి పరిశీలిం చారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మొత్తానికి ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది.

# మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ఊరట

- అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టు ఆదేశాలు
- భూ కబ్జా కేసులో హైకోర్టులో పిటిషన్




**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులకు హైకోర్టులో ఊరట లభించింది. భూ కబ్జా కేసులో ఆయనతో పాటు ఆయన కుటుంబాన్ని తాత్కాలికంగా అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టు ఆర్డర్ వేసింది. జీవన్ రెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులపై చేవెళ్ల, మొకిల పోలీస్ స్టేషన్‌లలో పలు సెక్షన్ కింద కేసులు నమోదయ్యాయి. ఆ కేసును సవాల్ చేస్తూ, తనను, తన కుటుంబసభ్యులను అరెస్ట్ చేయకుండా మినహాయింపు ఇవ్వాలని ఆయన తరపు లాయర్లు కోర్టును కోరారు. వాదనలు విన్న అనంతరం జీవన్ రెడ్డి కుటుంబసభ్యులను అరెస్ట్ చేయవద్దని పోలీసులును హైకోర్టు ఆదేశించింది.

## భూ కబ్జా ఆరోపణలు..

దామోదర్ రెడ్డి అనే వ్యక్తి 2022లో ఎర్లపల్లిలో 20 ఎకరాల 20 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. అందులో సర్వే నెంబర్ 32, 35, 36, 38 లో ఓ ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఆయన భూమి పక్కనే మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి భూమి ఉంది. 2023లో ఆ ఫంక్షన్ హాల్ ను జీవన్ రెడ్డి తన మనుషులతో కూల్చివేయించి, ఆ భూమిని కబ్జా చేశారని ఆరోపణలు వచ్చాయి. తన ఫంక్షన్ హాల్ కూల్చివేయడంతో పాటు భూమిని ఆక్రమించుకున్నారని బాధితుడు దామెదర్ రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై కబ్జా కేసు పెట్టాడు. తన ఫంక్షన్ కూల్చివేసి, భూమిని లాక్కోవడంపై నిలదీయడానికి వెళ్లిన తనపై జీవన్ రెడ్డి గ్యాంగ్ దాడి చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

## ఊరట కలిగించిన తీర్పు

దాంతో జీవన్ రెడ్డిపై చేవెళ్ల, మొకిల పీఎస్‌లలో కేసులు నమోదయ్యాయి. పోలీసులు తనను, తన కుటుంబసభ్యులను అరెస్ట్ చేస్తారేమోనని జీవన్ రెడ్డి కోర్టును ఆశ్రయించారు. తనపై అక్రమంగా కేసులు బనాయించారని, తనను, కుటుంబసభ్యులను అరెస్ట్ చేయకుండా చర్యలు తీసుకోవాలని జీవన్ రెడ్డి తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తాత్కాలికంగా జీవన్ రెడ్డి, ఆయన కుటుంబసభ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, అరెస్ట్ చేయకూడదని హైకోర్టు తీర్పుతో ఊరట కలిగింది. ధర్మం గెలిచింది, న్యాయం గెలిచింది అంటూ జీవన్ రెడ్డి స్పందించారు.



# అమెరికాలో హైదరాబాద్ విద్యార్థిని అదృశ్యం

**విశ్వంభర, హైదరాబాద్ :** యూఎస్ లో ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లిన వారు మిస్సింగ్, అనుమానాస్పద స్థితిలో మృతి చెందుతున్న విషాదకర ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇలాంటి ఘటన అమెరికాలో మరొకటి చోటుచేసుకుంది. తెలంగాణకు చెందిన 23ఏళ్ల యువతి నితీషా కందుల అమెరికాలో అదృశ్యమైంది. కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెల్స్ నుంచి ఆమె కనిపించకుండా పోయింది. అమెరికా కాలమానం ప్రకారం గత శుక్రవారం రాత్రి నుంచి ఆమె అదృశ్యమైనట్లు ఆమె సన్నిహితులు పేర్కొన్నారు. ఆమె మొబైల్ కు కాల్ చేసినా కూడా స్పందించడం లేదని, దీంతో సాయం కోసం వాట్సాప్ ద్వారా ఆమె కుటుంబ సభ్యులు అభ్యర్థిస్తున్నారు. అదృశ్యమైన నితీషా కనిపిస్తే ం91 80749 62618 నంబర్‌కు సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# మానసిక వికలాంగురాలిపై లైంగిక దాడి

**విశ్వంభర, నేరేడుచర్ల జూన్ 03 :** మానసిక వికలాంగురాలిపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేసిన సంఘటన నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని లాల్ లక్ష్మిపురం గ్రామంలో చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్లూరు గ్రామపంచాయతీ లాల్ లక్ష్మిపురం గ్రామానికి చెందిన మానసిక వికలాం గురాలైన ఓ మహిళపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నేరేడుచర్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఈనెల 17 లేదా 18న తెలంగాణలో సెలవు?

**విశ్వంభర, హైదరాబాద్ :** రంజాన్ తర్వాత ముస్లింలు జరుపుకునే అతి పెద్ద పండుగ బక్రీద్. బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే మూగజీవి.. ఈద్ అంటే పండుగ అని అర్థం.ముస్లింలు దీనిని 3వ అతి ముఖ్యమైన పండుగగా జరుపుకొంటారు.ఇస్లామీయ కేలండర్ ప్రకారం 12వ నెల యైన జుల్ హజ్జా 10వ తేదీన ఈ పండుగ జరుపుకొంటారు. ఈ పండుగ 3 రోజుల పాటు జరుపుకుంటారు. ఈ నెలలోనే హజ్ తీర్థయాత్రగూడా చేస్తారు. ఈ యాత్రకొరకు సౌదీ అరేబియా లోని మక్కా నగరానికి వెళ్ళి మస్జిద్-అల్-హరామ్ లోని కాబా చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేస్తారు. ఈ పండుగ రంజాన్ పండుగ జరిగిన 70 రోజుల తరువాత జరుపుకుంటారు. ఇదిలా ఉంటే%ౌ% బక్రీద్ పండుగ సందర్భంగా ఈనెల 17న తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. నెలవంక దర్శనం ఆధారంగా ముస్లింలు బక్రీద్ను జరుపుకుంటారు. ఈనెల 7న నెలవంక కనిపిస్తే జూన్ 17న, లేకపోతే 18న జరుపుకోనున్నారు. పండుగ జరుపుకునే రోజున (17%శీతీ%18) సెలవు ఉండనుంది.



# ఉరేసుకుని యువతి ఆత్మహత్య

**విశ్వంభర, వీర్నపల్లి :** సిరిసిల్లా జిల్లా వీర్నపల్లి మండలంలో విషాదం చోటు చేసుకుంది. మండలంలో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు, మున్నీరుగా విలపిస్తున్నారు. లాల్ సింగ్ తండాకు చెందిన భూక్య సరస్వతి(18) డిగ్రీ చదువుతోంది. అయితే ఆమె వ్యక్తిగత సమస్యలు తీర్చుకోలేకపోతున్నానని కొన్ని రోజులుగా మనస్థాపానికి గురయింది. ఈ క్రమంలోనే సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం ఇంట్లోనే ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించే సమయానికే ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



## సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ రైడ్స్

- ఏజెంట్ల ద్వారా సబ్ రిజిస్ట్రార్ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం
- జాయింట్ సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ రైటర్లను అదుపులోకి
- ఓ ఏజంట్ నుంచి రూ.99,200 నగదు స్వాధీనం

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో :** సూర్యాపేట జిల్లాలో ఏసీబీ దాడుల కలకలం రేగింది. సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్ అక్రమ లేఔట్లకు రిజిస్ట్రేషన్ చేస్తూ ఏజెంట్ల ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ రంగంలోకి దిగింది. సూర్యాపేటకు చెందిన మేక వెంకన్న అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై సోమవారం సాయంత్రం ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. సొమ్ము ముట్ట చెప్పిన వారికి ఏ పనైనా అవలీలగా పూర్తి చేస్తున్న సబ్ రిజిస్టర్,తన కూతురుకు ఇచ్చిన 800 గజాల స్థలం గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు 4 నెలలుగా తిప్పుకుంటూ పెద్ద మొత్తంలో సొమ్ము డిమాండ్ చేయడంతో సదరు బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీనితో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగినట్లు సమాచారం. సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ రైటర్ల ద్వారా డబ్బులు డిమాండ్ చేయగా, బాధితుడు మేక వెంకన్న నుంచి రూ. 90,200 లను డాక్యుమెంట్ రైటర్లు కల్లురు శ్రీనివాస్, తంగేళ్ల వెంకటరెడ్డి తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు రిజిస్టర్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అధికారులు డాక్యుమెంట్ రైటర్లు కల్లూరి శ్రీనివాసు, తంగెళ్ల వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. కార్యాలయంలోని మొత్తం ఫైళ్లను స్వాధీనం చేసుకుని వాటిపై సమగ్ర విచారణ తర్వాత ఈ కేసులో ఏ1గా సబ్ రిజిస్టర్ సుందర్ నాయక్, ఏ2గా కొల్లూరు శ్రీనివాస్ రెడ్డి, ఏ3గా తంగెళ్ల వెంకటరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



## కాకతీయ యూనివర్సిటీలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది అరెస్ట్

**విశ్వంభర, హనుమకొండ జూన్ 03 :** కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కాకతీయ యూనివర్సిటీ లోని ఎగ్జామినేషన్ బ్రాంచ్ లో వారం రోజుల కింద జరిగిన మాల్ ప్రాక్టీసుకు సంబంధించిన కేసులో సంబంధం ఉన్న 11 మంది ఔట్ సోర్సింగ్ మరియు దినసరి కూలీలను కేయూసీ పోలీస్ అరెస్ట్ చేశారు. కేయూసీ పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్.ఓ సంజీవ్ కథనం ప్రకారం కాకతీయ యూనివర్సిటీలోని ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో గత కొన్ని సంవత్సరాలుగా కొందరు అవుట్ సోర్సింగ్ మరియు దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఫెయిల్ అవుతామనే ఆలోచన ఉన్న డిగ్రీ విద్యార్థులను కలిసి ఎగ్జామినేషన్ బ్రాంచ్ లో సీలు వేసిన జవాబు పత్రాలను బయటకు తీసుకుని వచ్చి విద్యార్థులకు ఇచ్చి వారు మిగిలిన జవాబులు రాసిన తర్వాత మల్లి యదావిధిగా ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో పెట్టి పాస్ చేయించేవారు. ఇది చాల రోజులు గా జరుగుతుంది. 2024 మే 23 న అందు లో పనిచేస్తున్న మాదాసి సునీల్, గడ్డం రాణా ప్రతాప్, నాసం శ్రీధర్ జవాబు పత్రాలను తీస్తుండగా సీసీటీవీ లో పడడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన కేయూ పోలీస్‌లు సమగ్ర దర్యాప్తు ప్రారంభించగా అవుట్ సో ర్సింగ్ ఉద్యోగులతో పాటు వివిధ కాలేజీ లకు చెందినా విద్యార్థులు పెద్ద మెంత్తంలో ఉన్నట్టు గా బయటపడింది. దాంతో ఈ కేసుతో సంబంధం ఉన్న 11 మంది ఔట్ సోర్సింగ్, దినసరి కూలీలను ముందుగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో యూని వర్సిటీ ఉద్యోగుల పాత్ర పైన అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. త్వరలో ఈ కేసుతో సంబంధం ఉన్న మిగిలిన అందరు వ్యక్తులను కూడా అరెస్ట్ చేస్తామని కేయూ ఇన్స్పెక్టర్ సంజీవ్ తెలిపారు.

# ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధం

- గంటకు తొలి రౌండ్
- 9 గంటల్లో పూర్తి రిజల్ట్
- కౌంటింగ్‌కు 112 టేబుళ్లు

**విశ్వంభర, యాదాద్రిభువనగిరి:** భువనగిరి -లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. 39 మంది అభ్యర్థులు పోటీ చేసిన ఈ స్థానంలో ఈనెల 13న పోలింగ్‌జరిగిన సంగతి తెలిసిందే. ఆరు జిల్లాల్లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించిన భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని 2141 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలోని 18,08,585 ఓట్లకు 13,88,680 ఓట్లు (76.78 శాతం) పోలింగ్‌అయ్యాయి. ఈ నియోజకవర్గానికి చెందిన కౌంటింగ్‌యాదాద్రి జిల్లా భువనగిరిలో జరుగనుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆఫీసర్లు కంప్లీట్ చేస్తున్నారు. మంగళవారం ఉదయం 5.30 గంటలకు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూం తెరుస్తారు. ఎన్నికల కమిషన్‌ఆదేశాల మేరకు ఉదయం 8 గంటలకు పోస్టల్‌బ్యాలెట్‌తోపాటు ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. కౌంటింగ్‌మొదలైన గంటకు తొలి రౌండ్ ఫలితం వెలువడనుంది. ఆ తర్వాత అరగంటకు రౌండ్‌చొప్పున మొత్తంగా 9 గంటల్లో రిజల్ట్‌వచ్చే అవకాశాలు ఉన్నాయి.

### కౌంటింగ్‌కు 112 టేబుల్స్..

ఏడు అసెంబ్లీల్లో పోలైన ఓట్లను కౌంటింగ్‌చేయడానికి మెంత్తం 112 టేబుల్స్‌ఏర్పాటు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 20 టేబుల్స్‌ఏర్పాటు చేస్తుండగా మునుగోడు, తుంగతుర్తిలో 18 టేబుల్స్‌చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. నకిరేకల్, ఆలేరు, భువనగిరి, జనగామ నియోజకవర్గాలకు సంబంధించి 14 టేబుల్స్‌చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు కోసం టేబుల్‌కు ముగ్గురు చొప్పున



336 మంది స్టాఫ్‌తోపాటు అదనంగా మరో 72 మందిని ఎంపిక చేశారు. నియోజకవర్గంలో పోస్టల్‌బ్యాలెట్‌లో 13,792 ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుల్స్, సర్వీస్ ఓట్ల కోసం 7 టేబుల్స్ సిద్ధం చేస్తున్నారు. 21 టేబుల్స్ కోసం ఒక్కోదానికి నలుగురు స్టాఫ్ చొప్పున 84 మంది స్టాఫ్‌ను ఎంపిక చేశారు.

### అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పోలింగ్‌స్టాఫ్‌కు రెండుమార్లు ట్రైనింగ్ ఇచ్చాం. పోస్టల్‌బ్యాలెట్ కోసం ఈసారి ప్రత్యేక హాల్ ఏర్పాటు చేశాం. సమయం వృథా కాకుండా ఈవీఎంలతోపాటు పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్‌కొనసాగుతుంది.

**–హనుమంతు జెండగే, ఎన్నికల అధికారి**

# జగనే మళ్లీ సీఎం

- కేంద్రంలో ముచ్చటగా మూడోసారి మోదీ
- స్వామి పరిపూర్ణానంద జోస్యం



**విశ్వంభర, హిందూపురం జూన్ 03:** ఏపీ ఎన్నికలతో పాటు, లోక్ సభ ఎన్నికలపైనా రకరకాల ఊహాగానాలు, అపోహ లు, వివిధ భావజాలాలు ప్రచారంలో ఉన్న తరుణంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త స్వామి పరిపూర్ణానంద సోమవారం హిందూపురంలో చేసిన వాఖ్యలు సంచలనం రేపాయి. హిందూపురంలో స్వామి పరిపూర్ణానంద విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల అంశంపై స్పందించారు. ముఖ్యంగా, ఏపీలో ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉందని తెలిపారు. జ్యోతిష్యులు, సర్వే సంస్థలు, విశ్లేషకులు, మీడియా ఆ పార్టీ, ఈ పార్టీ అంటూ పార్టీలను పంచుకున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఎటువైపు నిలిచారన్న నిర్దిష్ట సమాచారం తనకుందన్నారు. తాను ఒక వ్యక్తిని అనుసరిస్తుంటాను.. ఆ వ్యక్తి ఇప్పటివరకు తనకు చెప్పింది ఏదీ పొల్లుపోలే చెప్పుకొచ్చారు. ఆ వ్యక్తి 2014 నుంచి చెబుతున్న అంశాలు ఇప్పటివరకు చెప్పింది చెప్పిన ట్టు జరిగిందన్నారు. తాను 2014లో మోదీ నాయకత్వంలో బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పానని, 2019లో మోదీ 300 పైన సీట్లను కచ్చితంగా సాధిస్తారని చెప్పాను ఆ విధంగానే జరిగింది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని పక్కనబెడితే, మోదీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. అందులో అనుమా నాలు, అపోహలు, ఊహాగానాలు అక్కర్లేదన్నారు. ఏపీ విషయానికొస్తే... ఈసారి ప్రధానంగా రెండు అంశాలపైనే ఎన్నికలు జరిగాయన్నారు. జగన్ కావాలి అనే వర్గం ఒకటి.. జగన్ పోవాలి అనే వర్గం మరొకటి.. అంతే తప్ప ఇంకెవరూ కనిపించలేదన్నారు. జగన్ కావాలి అనే వాదనకు అనుకూలంగా పెద్ద ఎత్తున ఓట్లు పడ్డాయని తనకు సన్ని హిత వ్యక్తి చెప్పాడని, అయితే, ఎక్కడో పడిపోయిన టీడీపీని గెలిపించేందుకు చంద్రబాబు అద్భుతమైన ప్రయత్నం చేశారు. ఇందులో అనుమానమే లేదన్నారు. చంద్రబాబు తన రాజకీయ అనుభవం, రాజకీయ చతురతను ఉపయోగించి గట్టి ప్రయత్నం చేశారు పేర్కొన్నారు. కానీ తనకున్న సమాచారం ప్రకారం జగన్ 123 స్థానాలతో మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని స్వామి పరిపూర్ణానంద జోస్యం చెప్పారు.



## డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సస్పెండ్

### కలెక్టర్ వెంకట్రావ్

**విశ్వంభర, సూర్యాపేట జూన్ 03:** సూర్యాపేట జిల్లా వైద్యాధికారిని లైంగికంగా వేధించారంటూ సూర్యాపేట జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్, నాన్కమ్యూనికబుల్ డిసీజెస్ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిపై కేసు నమోదు కాగా ఆయనపై ఎంక్వైరీ చేసేందుకు నలుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అడిషనల్ కలెక్టర్ ప్రియాంక కమిటీ చైర్మన్ గా, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆఫీసర్, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్‌అఫీసర్, డీఎంహెచ్ ఆఫీస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కమిటీ మెంబర్లుగా ఉన్నారు. ఇందులో భాగంగా గత శుక్రవారం కలెక్టరేట్ లో మహిళా వైద్యాధికారితో పాటు ఇద్దరు ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇద్దరు మహిళా సిబ్బందిని విచారించారు. డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి ప్రస్తుతం పరారీలో ఉన్నారని, ఆయన కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ నెల 28న ఆయనపై సూర్యాపేట పీఎస్ లో కేసు నమోదు కాగా అప్పటి నుంచే 10 రోజులపై సెలవుపై వెళ్లాడని డీఎంహెచ్వో డాక్టర్ కోట చలం తెలిపారు. ఆయన మొబైల్ స్విచ్ ఆఫ్ వస్తోందన్నారు. అయితే కల్యాణ్ చక్రవర్తి ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. డాక్టర్ చక్రవర్తిని తప్పించేందుకు సొంత శాఖ ఆఫీసర్లే ప్రయత్నాలు చేశారన్న ఆరోపణలున్నాయి. లైంగిక వేధింపుల విషయమై లోకల్ కంప్లయింట్ కమిటీ (ఎల్.సీసీ) రెండు దఫాలు నోటీలు జారీ చేసినప్పటికి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి హాజరు కాలేదని కమిటీ నివేదిక ఆధారంగా జరిగిన సంఘటనపై డాక్టర్ ఎన్. కళ్యాణ్ చక్రవర్తిని సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఒక ప్రకటనలో తెలిపారు.



## కత్తిపోట్ల వరకు వెళ్లిన బాత్రూం గొడవ

**విశ్వంభర, కోరుట్ల జూన్ 03:** కోరుట్ల పట్టణంలోని హాజీపూర కాలనీలో బాత్రూం విషయంలో తన పిల్లలను తల్లి మందలిస్తుండగా నా ఇంటి ముందు గొడవ చేయొద్దు అంటూ పక్క ఇంటి పాషా ఆ మహిళపై చెప్పుతో దాడి చేశాడు. మాట మాట పెరగడంతో ఇంట్లోకి వెళ్లి కత్తితో వచ్చి అడ్డు వచ్చినా తండ్రి, కూతురుపై దాడీ చేసిన అనంతరం పొరుగున ఉన్న ముగ్గురు వ్యక్తులను కూడా పాషా గాయపరిచాడు. ఈ దాడిలో గాయపడిన క్షతగాత్రులను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు.



## మత్తడి పోస్తున్న చెరువులు

### ఆనందంలో రైతులు

ఆదివారం రాత్రి కురిసిన వర్షాలతో చింతపల్లి మండలంలోని చెరువులు మత్తడిపోస్తున్నాయి.. దీంతో రాయినిగూడెం, వర్కాల, చింతపల్లి, నెల్వలపల్లి, తక్కళ్లపల్లి పలు గ్రామాలవాసులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక చెరువు కింద వరిసాగు చేసే రైతులు సంతోషంతో ఉన్నారు. మండలంలోని పలు చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరడంతో చెరువులు మత్తడి పోస్తున్నాయి.

- విశ్వంభర, చింతపల్లి జూన్ 03:

# ఏరియా దవాఖానలో పండ్ల పంపిణీ

- దశాబ్ది కాలంలో ఎల్బీనగర్ ఎంతో అభివృద్ధి
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ జూన్ 3 :** తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వనస్థలిపురం ఏరియా దవాఖానలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్ది కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. అదే విధంగా ఎల్బీనగర్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. అభివృద్ధిలో భాగంగా నాగోల్‌లో ఎస్టీపీ ప్లాంట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ పనుల వల్ల ఎన్నో సత్ఫలితాలు రావడం జరిగిందని తెలిపారు. పనుల్లో భాగంగా ఎన్నో ఇబ్బందులు ఎదురైనా.. వాటిని అధిగమించామని, ఇంకా కొన్ని పనులు చివరిదశలో ఉన్నాయని వాటిని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే ప్రధాన ట్రాఫిక్ సమస్యలు ఉన్న చోట స్కై,ఫ్లైఓవర్లు నిర్మించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పరిష్కారం చేసినట్లు తెలిపారు. అలాగే పేదలకు మరింత వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడు మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మిస్తుందని, అవి ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని మరికొన్ని ఫ్లైఓవర్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్ఎంఓ కృష్ణ, వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, గజ్జల మధుసూదన్‌రెడ్డి, సుమన్‌గౌడ్, మాధవరం నర్సింహారావు, మధుగౌడ్, సామ బుచ్చిరెడ్డి, శివశంకర్, సత్యంచారి, ఖైసర్, సంజయ్, మిట్ట రామ్మోహన్, రాఘవేంద్రరావు, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర చిహ్నంలో కాకతీయ కళాతోరణం తొలగింపుపై మంత్రి సీతక్క క్లారిటీ..!



**విశ్వంభర, వరంగల్ :** రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు చేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయం స్టేట్ పాలిటిక్స్ తీవ్ర దుమారం రేపుతోంది. స్టేట్ అఫిషియల్ లోగోలో ప్రస్తుతం ఉన్న చార్మినార్, కాకతీయ కళాతోర ణం తొలగించాలనుకుంటున్న ప్రభుత్వం నిర్ణయంపై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ భగ్గుమంటుంది. కాంగ్రెస్ సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే బీఆర్ఎస్ నేతలు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు సైతం చేపట్టారు. ఎట్టి పరిస్థితు ల్లో ఎంబ్లమ్లో చార్మినార్, కాకతీయ%ళి% కళాతోరణం తొలగించొద్దని డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులపై మంత్రి సీతక్క స్పందిం చారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో కాకతీయ కళాతోరణం తొల గింపుపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలోని మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించకముందే విపక్షాలు అప్పుడే ఆందోళన చేయడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు రాష్ట్రం గీతాన్ని కూడా వివాదస్పదం చేయడం తగదని చురకలంటిం చారు. ఇక, తెలంగాణలో కాంగ్రెస్ 14 ఎంపీ సీట్లు గెలుస్తోందన్న విశ్వాసం ఉందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణలో విద్యుత్ కోతలపై కాంగ్రెస్ ట్వీట్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ,ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం కొనసాగుతుంది. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ వ్యాప్తంగా విద్యుత్ కోతలు ఉంటాయని బీఆర్ఎస్ పార్టీ తరచు విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక టిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించింది. తెలంగాణలో ఎక్కడా విద్యుత్ కోతలు లేవని కాంగ్రెస్ పార్టీ ట్వీట్ చేసింది. 'వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ తీగలకు ఆనుకుని ఉండే చెట్ల కొమ్మలను తొలగించేందుకు, స్తంభాల మెయింటెనెన్స్ కోసం మాత్రమే విద్యుత్ నిలిపివేస్తున్నాం తప్ప కోతలు ఎక్కడా లేవు అని స్పష్టం చేసింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా అనవసరంగా విద్యుత్ నిలిపివేసిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారు' అని కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో టిఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడింది.



# గ్రూప్ 1 అభ్యర్థుల హాల్ టికెట్‌పై ఫొటో తప్పనిసరి

**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రూప్–1 ప్రిలిమినరీ ఎగ్జామ్ ఈ నెల 9వ తేదీన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. ఓఎంఆర్ విధానంలో రాత పరీక్ష నిర్వహించనున్నారు టీఎస్‌పీఎస్సీ అధికారులు. ఈ క్రమంలో గ్రూప్ 1 హాల్ టికెట్లు కూడా కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.అయితే హాల్ టికెట్‌పై లేటెస్ట్ పాస్ ఫొటో తప్పనిసరిగా అతించుకోని వెళ్లాలి. అంటే 3 నెలల క్రితం నుంచి నేటి వరకు దిగిన పాస్ ఫొటో తప్పనిసరి. హాల్ టికెట్‌పై అభ్యర్థి తన ఫొటో పేస్ట్ చేయకపోతే ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతించరు అని స్పష్టం చేసింది. ఈ నిబంధనను హాల్ టికెట్‌లో పొందుపరిచినట్లు టీఎస్‌పీఎస్సీ అధికారులు తెలిపారు. ఫొటో కింద సంతకం చేసేందుకు తప్పనిసరిగా స్పేస్ ఉంచుకోవాలని ,హాల్ టికెట్‌తో పాటు పాస్ పోర్ట్, ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు,పాన్ కార్డు, గవర్నమెంట్ ఎంప్లాయ్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఒరిజినల్ కార్డును పరీక్షా కేంద్రం వద్ద చూపిస్తేనే లోపలికి అనుమతిస్తారు. కాగా, 563 పోస్టుల కోసం దాదాపు 4.30 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా జూన్ 9 ప్రిలిమినరీ పరీక్ష, అక్టోబర్ 21న మెయిన్స్ పరీక్ష నిర్వహించునున్నారు.



# మూసారాంబాగ్ బేకరీలో భారీ అగ్ని ప్రమాదం..!

**విశ్వంభర, మూసారాంబాగ్ :** సాధారణంగా వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటాయి. ఇటీవలే చాలా చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించిన విషయం తెలిసిందే. తాజాగా హైదరాబాద్ లోని మూసారాంబాగ్ లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ మూసారాంబాగ్ లో ఉన్న ఒక రెడ్ రోజ్ బేకరీలో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. మంటలు స్థానికులు భయంతో పరుగు తీశారు. మంటలను ఆర్పేందుకు ఐదు అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకుని విజయవంతంగా మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తూ ఎటువంటి గాయాలు కాలేదు. అయితే, భారీగా ఆస్తి నష్టం జరిగింది అని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# ఘనంగా సీనియర్ పాత్రికేయుల జన్మదిన వేడుకలు

**విశ్వంభర, కూకట్ పల్లి జూన్ 3:** కూకట్‌పల్లి సీనియర్ పాత్రికేయుడు భాస్కర్‌చారి, శ్రీనివాస్ రెడ్డిల పుట్టినరోజు సందర్భంగా వారిని పలువురు ప్రముఖులు సాలువతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారుడు, ఉద్యమ గాయకుడు దరువు అంజన్న, ఆకుల వీరస్వామి, మేడ్చల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం, బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ, మాణిక్య చారి, సురేష్, ధనుంజయ చారి తదితరులు పాల్గొని వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# కత్తితో దాడి చేసినా పట్టువదల్లేదు

- మొబైల్ దొంగలను పట్టించిన హైదరాబాద్ కుర్రాడు

**విశ్వంభర, అమీర్‌పేట :** హైదరాబాద్‌లోని వెంగళరావు నగర్ పరిధి లక్కీ హస్టల్‌లో నివాసం ఉంటున్న పి.జాషువా కుమార్ ఆదివారం ఉదయం హాస్టల్ బయట కూర్చుని తన మొబైల్‌లో ఏదో వీడియో చూస్తున్నాడు. ఆ సమయంలో అటుగా ఓ నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనం వచ్చింది దానిపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు జాషువా వద్దకు వచ్చి ఏదో అడ్రస్ అడిగినట్లు నటించారు. అలా ఒక్కసారిగా అతడిని నమ్మించి ఓ ఫోన్‌కాల్ చేసుకోవాలని అతడిని సెల్‌ఫోన్ అడిగారు. అలా అతడు మొబైల్ ఇవ్వగానే అక్కడి నుంచి ఉడాయించడానికి ప్రయత్నించారు. కానీ అలర్ట్‌గా ఉన్న ఆ యువకుడు వారు తన చేతిలో మొబైల్ తీసుకుని పారిపోయేందుకు యత్నించగా తాను వారి బైక్ కీ లాగేసుకున్నాడు. అతడు చేసిన పని చూసి కంగుతిన్న ఆగంతకులు అతడిని కత్తితో బెదిరించి, దాడి చేయడానికి ప్రయత్నించాడు. అయినా జాషువా వెనక్కి తగ్గలేదు. ఆ ఇద్దరిలో ఓ వ్యక్తిని యువకుడిని పట్టుకోగా అతడు కత్తితో దాడి చేశాడు. ఈ క్రమంలో బాధితుడు గట్టిగా అరవడంతో హాస్టల్ నుంచి బయటికి వచ్చిన యువకులు ఆగంతకులను పట్టుకుని 100కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న మధురానగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆగంతకుల విషయంలో జాషువా సాహసాన్ని స్థానికులు ప్రశంసించారు. ఈ మధ్యకాలంలో దొంగలు కొత్త తరహా చోరీలకు తెరలేపారు. అడ్రెస్ అడుగుతున్నట్లు దగ్గరికి రావడం వాళ్ల టార్గెట్ అలర్ట్‌గా లేని సమయంలో మెడలో చైన్లు, చేతిలో మొబైళ్లు లాక్కొని పరార్ అవ్వడం వంటి ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఇంకొన్ని కేసుల్లో తమకు తెలిసిన వాళ్లకు ఫోన్ చేసుకోవాలని, తమ మొబైల్‌లో ఛార్జింగ్ అయిపోయిందంటూ ఫోన్ అడిగి తీసుకుని ఉడాయిస్తున్నారు. ఇలాంటి ఘటనలు కూడా రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. ఈ క్రమంలో ఎవరైనా తెలియని వ్యక్తులు వచ్చి అడ్రెస్ అడిగినప్పుడు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూ చిస్తున్నారు.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెల్చాల గ్రామానికి చెందిన సాయి కిరణ్ నందాల సివిల్స్–2023లో ఆల్ ఇండియా 27వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా 27వ ర్యాంక్ సాధించిన సాయి కిరణ్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.







# గ్రాట్యూటీ కొలిక్కి రాక వాయిదా పడ్డ బీడీ కార్మికుల చర్చలు

**విశ్వంభర, మహబూబ్ నగర్ 3 :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ హొటల్లో బీడీ కార్మికుల కూలీ రేటు పెంచాలని బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో కార్మిక సంఘాల నాయకులు సోమవారం చర్చలు నిర్వహిచడం జరిగింది. ఇప్పటివరకు ఐదు సార్లు యజమానులతో కార్మిక సంఘాల ప్రతినిధులకు చర్చలు జరిగాయి. ఈ 5వ దఫా చర్చలో వేయి బీడీలకు 230 రూపాయలు కూలీ మరియు ప్రావీడెంట్ పండ్ యాజమాన్యం వాటా 5 రూపాయలు మొత్తం కలిపి వేయి బీడీలకు 235 రూపాయలు పెంచేందుకు యజమానులు అంగీకరించారు. గ్రాట్విటీ సమస్య పెండింగ్లో ఉండడం ఆ విషయం కూడా చర్చించాలని కార్మిక సంఘాలు పట్టుబట్టడంతో బీడీ యజమానులు గ్రాటివిటీ గురించి చర్చించడం కొరకు మరో వాయిదాను కోరడం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా అనేక మంది కార్మికులు పనిచేస్తూ చనిపోయారని, చాలామంది కార్మికులు చేతకాక పనిని మానుకున్నారని వాళ్లకు



ఇప్పటిదాకా గ్రాట్యూటీ చెల్లించకపోవడం విషాదకరమని కార్మిక సంఘాలు వాపోయాయి. గ్రాటివిటీ పెంచే విషయంలో గతం మాదిరిగా యజమానులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కార్మిక సంఘాలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. పెంచిన కొత్త కూలీ ఏప్రిల్ 1నుండి అమలు ఆవుతుంది. ఈ చర్చలో బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యం సోహెల్, సుధాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వసీమ్, జియా సెట్, మరియు కార్మిక సంఘాల నాయకులు ఏఐటీయూసీ నాయకులు మాకం రామ్మోహన్, పి వెంకటేష్, రాబర్ట్ టిఎఫ్టియు నాయకులు ఎస్ఎం ఖలీల్, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ కార్మిక విభాగం నుండి అబ్రహం, ఎస్ జాన్, పెద్ద బాలరాజు, ఐఎఫ్టీయూ నుండి కే. సూర్యం, జెఎన్. దేవధానం, అరుణ్ కుమార్, మహిముద్ వేణుగోపాల్, బుచ్చన్న, ఐఎన్టీయూసీ నుండి దాసు, పెద్ద బాలరాజు, సవరన్న పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**ఏబీవీపీ నాయకుడు గోపీచంద్**

**విశ్వంభర, దేవరకొండ జూన్ 3:** దేవరకొండ నియోజకవర్గంలో అధిక ఫీజులు వసూలు చేస్తూ.. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూ, బుక్స్, స్టేషనరీ అంటు వేలకు వేలు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకుడు యలమల గోపీచంద్ డిమాండ్ చేశారు. దేవరకొండలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గోపీచంద్ మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలను అమ్ముతూ.. వివిధ రకాల పేర్లతో అధిక ఫీజులు వసూలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. తెలంగాణ విద్యాశాఖ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో యూనిఫాం, షూ, బుక్స్, స్టేషనరీ అమ్మకూడదని డీఈఓ ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశా




రు. 1904 సంవత్సరంలో ప్రభు త్వం తీసుకు వచ్చిన జీవో నెంబర్ 1 ప్రకారం ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యాసంస్థలు పనిచేయాలని చెప్తున్నా.. వాటిని ఏ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పాటించకుండా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ధనార్జనే ధ్యేయంగా డొనేషన్లు, స్పెషల్ ఫీజులు, బస్సు ఫీజు, యూనిఫామ్ ఫీజు, బుక్స్ ఫీజ్ అని వివిధ రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల ను మానసికంగానూ వేధిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా 2009 లో వచ్చిన జీవో నెంబర్ 91 ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు టెక్నో ఈ టెక్నో డిజె, టారెంట్, ఒలింపియాడ్ అనే బ్రాండ్ పేరుతో పాఠశాల నడప వద్దని పాఠ్యపుస్తకాలను అమ్మవద్దని ఉన్న వాటిని కూడా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు మొద్దునిద్ర వీడి అధిక ఫీజులు వసూలు చేస్తున్న, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దుచేసి వారి పైన శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు.

## షాపింగ్ కాంప్లెక్స్‌కు సహకరించాలని చిరు వ్యాపారుల వినతి



**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 03:** మాజీ మంత్రి, నాగర్ కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని ఆమనగల్లు మండల కాంప్లెక్స్ చిరు వ్యాపారులు మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన ఏర్పటు చేస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించాలని చిరు వ్యాపారులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లు రవి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో మాట్లాడి షాపింగ్ కాంప్లెక్స్ కు సహకరించాలని కోరతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారులు గాజుల శీను, నరేందర్, సుధాకర్, వెంకటేష్, దుర్గమ్మ, సావిత్రమ్మ, పార్వతమ్మ, అమృతమ్మ, నాయకులు వస్పూల జంగయ్య, ఎంఏ ఖలీల్, ఖాదర్, ఖాదర్, శివలింగం, మల్లేష్, తదితరులు ఉన్నారు.



## పరిగిలో రెండో రోజు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

**విశ్వంభర, పరిగి:** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం పరిగి పట్టణంలోని బాలసదనంలో చిన్నారులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మాజీ సీఎం కేసీఆర్ కృషి మరువలేనిదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్, ఎంపీపీ అరవింద్ రావు, సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, కౌన్సిలర్లు నాగేశ్వర్, కృష్ణ, రవికుమార్, తాహెర్ అలీ, కో ఆప్షన్ సభ్యులు అన్వర్ హుస్సేన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## మైసిగండి మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 03:** కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అమ్మవారి దర్శనం చేసుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు మన ప్రాంత ప్రజలపై ఎల్లపుడూ ఉండాలని, అమ్మవారి దయతో అందరు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, సీనియర్ నాయకులు రచ్చ శ్రీరాములు, కాలే మల్లయ్య, జైపాల్ రెడ్డి, సురేష్ రెడ్డి, నరేందర్, వినోద్, మల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, చంద్ర శేఖర్, రఘులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గొడ్డలికి పదును పెట్టిన పోలీసు అధికారి

**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల :** కష్ట నష్టాలకోర్చి కొలిమిలో నిప్పులు రాజేసి వ్యవసాయ పనులకు పనికొచ్చే పరికరాలను తయారు చేసే కమ్మరి వృత్తి నుంచి ఖాకీ కొలువు సాధించిన పోలీసు అధికారి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నేర్చుకున్న పని ఎన్ని సంవత్సరాలైన మరవలేము అనే మాట ఇప్పుడు ఈ పోలీస్ అధికారిని చూస్తే చెప్పవచ్చు. వృత్తిలో భాగంగా వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి చందుర్తి మండలం మల్యాల గ్రామానికి వచ్చాడు. అక్కడ ఓ కమ్మరి ఇనుప పనిముట్లు చేస్తుండగా అతని వద్దకు వెళ్లి సుత్తి, శానం తీసుకొని గొడ్డలిని తయారు చేశాడు. దాంతో చూపరులు అవాక్కయ్యారు. నేటి కుల వృత్తికి డీఎస్పీ నాగేంద్రచారి ఆదర్శమని చెప్పవచ్చు. సుత్తి, శానం పట్టి డీఎస్పీ పనిచేసిన దృశ్యం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

## ప్లాంటేషన్‌కు ఏపీఓ రమేష్ స్థల పరిశీలన

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) జూన్ 03 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం గృహసముదాయముల వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటటానికి ఉపాధి హామీ పథకం మండల అదనపు కార్యక్రమాధికారి బోడిగే రమేష్ గౌడ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం మండల టెక్నికల్ అసిస్టెంట్ జమాండ్ల యాదిరెడ్డి, ఏఫ్ఏ వెల్మకన్నే సత్యనారాయణ, భాస్కర్, పాండు, మల్లేశం, నగేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.






## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

**విశ్వంభర, దోమ జూన్ 03:** మండల కేంద్రంలో ఉన్న ఎస్‌జీ ఫంక్షన్‌హాల్ సమీపంలో గల లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా కొనసాగింది. దీంతో గ్రామంలో పండగ వాతావరణం చోటు చేసుకుంది. గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. స్వామివారి కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుఖః సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. దైవచింతరతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



## వ్యక్తి అదృశ్యం

**విశ్వంభర, ఆమనగల్లు, జూన్ 3:** మండల నాగిళ్ళ గ్రామస్తుడు అదృశ్యమైనట్లు మాడుగుల పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం నాగిళ్ళ గ్రామాని చెందిన పాలకూర్ల శ్రీశైలం, వృత్తిరిత్యా వంట మాస్టర్, ఎత్తు 5.6 అడుగులు, చామన చాయ రంగు ఇతను గతంలో హైదరాబాద్‌లోని సంతోష్ నగర్ చుట్టుపక్కల గల హొటల్లో వంట మాస్టర్ గా సుమారు 8 సంవత్సరాలు పనిచేసాడు. తర్వాత కరోనా రెండోవ వేవ్ వచ్చినప్పటి నుంచి 2021 చివరిలో అతని గ్రామం నాగిళ్ల వచ్చి అక్కడ కొన్ని రోజులు ఉన్నాడు. అదిలాబాద్ పని నిమిత్తం వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్ళాడు. కానీ ఇప్పటివరకు తిరిగి రాలేదు. అతను కనపడకపోవడంతో అతని అన్న పాలకుర్ల నిరంజన్ మాడుగుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు మాడుగుల సీఐ ఎస్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే సీఐ 87126 62365, లేదా మాడుగుల ఎస్ఐ ఉపేందర్ 8712662385కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



## అధికవడ్డీ ఆశచూపి రూ.50 కోట్లతో పరార్

**విశ్వంభర, మేడిపల్లి జూన్ 3 :** మేడిపల్లి పీఎస్ పరిధి బోడుప్పల్ రాఘవేంద్ర నగర్ కాలనీలో ఓ వ్యక్తి భారీ మోసం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. భాషెట్టి నాగరాజ్ అధిక వడ్డీ ఆశ చూపి సుమారు రూ.50 కోట్లను కొందరి వద్ద వసూలు చేసి పరారయ్యాడు. రూ.10 వడ్డీ ఇస్తామని చెప్పి ఒక్కొక్క వ్యక్తి వద్ద సుమారు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల పైన వసూలు చేశాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# రాశి ఫలాలు



– మాధవశేషు స్వామి, వాస్తు, జ్యోతిష్యం పురోహిత్, సెల్: 9059308808

**26-05-2024 నుండి 04-06-2024 వరకు**



**మేష రాశి :** సామాన్యంగా ఉన్నది. ఆలోచనలు లేక కొంత అనిశ్చితిని కలిగి ఉంటారు. నిలకడలేని తనము ఎక్కువగా ఉండును. కుటుంబ ఆర్థిక విషయాలు చికాకు కల్గించును. నిదానంగా శుభంగా పూర్తి అగును. నిద్రలేమి అధికమగును.



**వృషభ రాశి :** వ్యాపారాభివృద్ధి కల్గును. శరీరం అలసటగా ఉండును. కుటుంబ విషయాలలో ఆర్థికంగా అలోచించి ముందుకు సాగుతారు. పుత్రా సంతానం అభివృద్ధి ఎక్కువగా ఉండును. ఈ వారం ఇతరులకు డబ్బు ఇవ్వరాదు. ఇచ్చినచో తిరిగిరావు.




**మిథున :** సానుకూలంగా ఉన్నది. కొత్త వ్యాపారం ప్రారంభానికి ఆలోచిస్తారు. భార్య ఆరోగ్యం మెరుగుపడును. ఆకస్మిక ప్రయాణం చేయుదురు. దాచిన విలువైన కాగితాలు, డబ్బులు మరచిపోగలరు. బంధు వర్గం వారితో జాగ్రత్త అవసరం. విరోధాలు ఉండును.



**కర్కాటక :** విశేష యోగవంతంగా ఉంది. తలచిన వెంటనే పనులు పూర్తగును. విదేశీ ప్రయాణాలు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి యోగవంతంగా ఉండును. స్వంత ఆలోచనతో వ్యాపారం చేయుట మంచిది. శుభ వార్తలు వింటారు.



**సింహరాశి :** సామాన్యంగా ఉన్నదని చెప్పొచు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. భార్య వలన మాట పట్టింపులు ఏర్పడును. అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడిననూ వారం చివరిలో శుభం కల్గును.



**కన్యారాశి :** అనుకూలంగా ఉన్నది. నూతన ప్రయత్నాలు ఫలించును. నిరుద్యోగులకు ఉద్యోగం ప్రాప్తించును. పుత్ర సంతానంతో ఆనందంగా కాలక్షేపం చేస్తారు. డబ్బు ఖర్చు అధికంగా ఉండును.



**తులరాశి :** ఏ విషయం ఎలా ఉన్ననూ ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ అవసరం. శారీరకంగా ఎక్కువ కష్టాన్ని కలిగి ఉందురు. సంతానం ద్వారా ధన నష్టం కల్గును. ఆర్థిక పరిస్థితి సామాన్యంగా ఉండును.



**వృశ్చికరాశి :** సామాన్యంగా ఉన్ననూ, అనుకున్న కోర్కెలు నెరవేరును. కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడి సంతోషంగా ఉంటారు. కీర్తి ప్రతిష్ఠలు మేరుగుపడును. శారీరక శ్రమ అధికం కావటం వల్ల శిరో బాధలు ఏర్పడును.



**ధనుస్సురాశి :** గడ్డుకాలంగా ఉన్నది. కోరుకున్న పనులు అవ్వక తీవ్ర నిరాశతో ఉంటారు. ఏ పని చేసిననూ ఒకటికి మూడు సార్లు తిరగవలసి వస్తుంది. వాహనం నడపడంలో జాగ్రత్త అవసరం.



**మకరరాశి :** శ్రమకు తగిన ఫలితాన్ని సాధిస్తారు. స్నేహితులతో విరోధాలు, అకాల భోజనం, సోదర విరోధం, మాట విలువ తగ్గును. ఆర్థిక విషయాలు చికాకు కలిగిస్తాయి. కోర్టు వివాదం ఒక కొలిక్కి వస్తుంది.



**కుంభరాశి :** రాజయోగంగా ఉన్నది. వ్యాపారాభివృద్ధి చెందుతారు. చేసే కృషి ఫలిస్తుంది. ఆర్థిక విషయల్లో జాగ్రత్త అవసరం. కొంత చికాకుగా ఉన్ననూ వారం చివరి వరకు అన్ని పనులు పూర్తి అగును. సోదర, బంధు వర్గం వారికి విశేష సహకారం అందించగలరు.



**మీనరాశి :** విశేషంగా ఉన్నదని చెప్పొచ్చు. కార్య దీక్షతో అన్ని పనులు పూర్తి చేస్తారు. ద్రవ్యం నిల్వ చేస్తారు. స్నేహితులతో విహారయాత్రలు చేయుదురు. ఆర్థిక విషయాలలో సంతోషంగా ఉంటారు.



# జపాన్‌లో భూకంపం

- నిముషాల్లోనే రెండుసార్లు
- భయంతో జనాల పరుగులు

**విశ్వంభర :** జపాన్‌లో భూకంపం సంభవించింది. కేవలం నిముషాల వ్యవధిలోనే రెండుసార్లు రావడంతో ప్రజలంతా భయాందోళనకు గురయ్యారు. ఇషికావా ప్రిఫెక్చర్‌లో భూకంపం సంభవించింది. సోమవారం తెల్లవారుజామున 6.31 గంటలకు నోటో ద్వీపకల్ప ఉత్తర భాగంలో 5.9 తీవ్రతతో భూమి కంపించింది. మరో 10 నిమిషాల తర్వాత నానో, అనామిజు నగరాలతో పాటు నీగాటా ప్రిఫెక్చర్‌లోని కొన్ని ప్రాంతాల్లో 4.8 తీవ్రతతో మరోసారి భూకంపం సంభవించింది. నోటో పీఠభూమిలో భూకంప కేంద్రం ఉందని జపాన్ వాతావరణ శాఖ తెలిపింది. భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు వచ్చాయని పేర్కొంది. ప్రస్తుతం ఎలాంటి సునామీ ముప్పు లేదని అధికారులు వెల్లడించారు. కాగా, ఇదే ప్రాంతంలో జనవరి 1న సంభవించిన భూకంపంలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. అటు, భూకంపం సంభవించిన ప్రాంతానికి సమీపంలోని రెండు అణువిద్యుత్ ప్లాంట్లలో ఎలాంటి అసాధారణ పరిస్థితి లేదని న్యూక్లియర్ రెగ్యులేషన్ అథారిటీ తెలిపింది. నోటో ద్వీపకల్పంలోని షికా ప్లాంట్‌కు మాత్రం స్వల్ప నష్టం వాటిల్లిందని పేర్కొంది. కాగా, భద్రతా తనిఖీల నిమిత్తం షింకన్ సెన్ సూపర్ - ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఇతర రైలు సేవలను తాత్కాలికంగా నిలిపేశారు.

### భార్య గెలుపు కోసం పొర్లుదండాలు పెట్టిన

# హీరో శరత్ కుమార్



**విశ్వంభర, చెన్నై:** దేశ వ్యాప్తంగా ఎన్నికల కౌంటింగ్‌కు సమయం ఆసన్నం అయింది. నేడు ఎవరి భవిష్యత్ ఏంటనేది తేలిపోతుంది. ఇలాంటి సమయంలోనే అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు గుడులు, చర్చిల చుట్టూ చేరిపోతున్నారు. ఈ క్రమంలోనే సీనియర్ నటుడు శరత్ కుమార్ చేసిన పని సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన రాధిక గెలవాలని ఆయన ఈ ప్రయత్నాలు చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ముందు రాధిక శరత్‌కుమార్ దంపతులు.. తమిళనాడులోని విరుధ్‌నగర్‌లో ఉన్న శ్రీ పరాశక్తి మారియమ్మన్ ఆలయాన్ని సందర్శించారు. ఈ క్రమంలోనే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ పరాశక్తి మారియమ్మన్ ఆలయ ప్రాంగణంలో పొర్లు దండాలు పెట్టారు. అంతేకాకుండా గత కొన్ని రోజులుగా రాధిక తరఫున ఎన్నికల ప్రచారంలో కూడా శరత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే శరత్‌కుమార్ పొర్లు దండాలు పెడుతున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. విరుధ్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ తమ పార్టీ అభ్యర్థిగా రాధికను బరిలోకి దింపారు. ఇక అదే విరుద్‌నగర్ స్థానం నుంచి రాధికకు పోటీగా దివంగత నటుడు కెప్టెన్ విజయకాంత్ కుమారుడు విజయ ప్రభాకరన్ బరిలోకి దిగారు. డీఎండీకే-అన్నాడీఎంకే పొత్తులో భాగంగా విజయ ప్రభాకరన్ ఆ స్థానంలో పోటీ చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి సిట్టింగ్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ మరోసారి బరిలో నిలిచారు.



### 93 ఏళ్ల వయసులో ఐదో పెళ్లి

# చేసుకున్న మీడియా దిగ్గజం

**విశ్వంభర, కాలిఫోర్నియా :** ఈ నడుమ పెళ్లిళ్లకు వయసుతో సంబంధం లేకుండా పోతోంది. వృద్ధాప్య సమయంలో కూడా తోడును వెతుక్కుంటున్నారు. ఇప్పుడు తాజాగా అంతర్జాతీయ మీడియా దిగ్గజం, ఆస్ట్రేలియన్ - అమెరికన్ బిలియనీర్ రూపర్ట్ మర్డోక్ 93 ఏళ్ల వయసులో ఐదో పెళ్లి చేసుకున్నారు. తన కంటే వయసులో 26 ఏళ్ల చిన్నవారైన రిటైర్డ్ పరమాణుజీవ శాస్త్రవేత్త ఎలీనా జుకోవాను ఆయన మనువాడారు. కాలిఫోర్నియాలోని సొంత ఎస్టేట్‌లో శనివారం వీరి వివాహం సంప్రదాయబద్ధంగా జరిగింది. వీరి వివాహానికి అమెరికా ఫుట్‌బాల్ టీం 'న్యూ ఇంగ్లాండ్ పేట్రియాట్స్' యజమాని రోబెర్ట్ క్రాఫ్ట్, ఆయన సతీమణి డానా బ్లూమ్‌బెర్గ్ హాజరయ్యారు. వివాహానికి సంబంధించిన ఫోటోలు బ్రిటన్ పత్రిక 'ది సన్'లో ప్రచురితమయ్యాయి. కాగా, ఈ జంట మార్చిలో తమ నిశ్చితార్థాన్ని ప్రకటించారు. మర్డోక్‌కు ఇది ఐదో వివాహం. మొదట ఆస్ట్రేలియాకు చెందిన పాట్రిషియా బుకర్‌ను 1956లో ఆయన వివాహమాడారు. అనంతరం 1960ల్లో వీరి వివాహ బంధం ముగిసిపోయింది. ఆ తర్వాత జర్నలిస్ట్ అన్నామరియా మన్‌ను వివాహం చేసుకుని 30 ఏళ్ల తర్వాత 1999లో ఆమెకు విడాకులిచ్చారు. ఆ తర్వాత వెండీ డాంగ్‌ను పెళ్లి చేసుకుని.. ఆమెకు విడాకులిచ్చిన అనంతరం 2016లో జెర్రీ హాల్‌ను నాలుగో వివాహం చేసుకున్నారు. ఆమెను పెళ్లాడిన ఆరేళ్లకు విడాకులు తీసుకున్నారు. తన రెండో భార్య అన్నా మరియా మన్ నుంచి విడిపోయిన సందర్భంలో మర్డోక్ చెల్లించిన భరణం అత్యంత ఖరీదైన వాటిల్లో ఒకటిగా నిలిచింది. ఆ సమయంలో ఆమెకు 1.7 బిలియన్ డాలర్ల ఆస్తి ఇచ్చినట్లు సమాచారం. మర్డోక్ తన మాజీ భార్యల్లో ఒకరైన వెన్‌డీ డెంగ్ ఇచ్చిన పార్టీలో జుకోవా ఆయనకు పరిచయమయ్యారు. అప్పటి నుంచి వీరు డేటింగ్‌లో ఉన్నారు. రష్యాకు చెందిన జుకోవా అమెరికాకు వలస వచ్చారు. గతంలో ఆమెకు మాస్కో ఆయిల్ బిలియనీర్ అలెగ్జాండర్‌తో వివాహమైంది. మర్డోక్ 1950ల్లో మీడియా కెరీర్‌ను ప్రారంభించి న్యూస్ ఆఫ్ ది వరల్డ్, ది సన్ వార్తా పత్రికలను ప్రారంభించారు. ఆ తర్వాత అమెరికాలో స్థిరపడి న్యూయార్క్ పోస్ట్, వాల్ స్ట్రీట్ జర్నల్ వంటి పబ్లికేషన్స్ కొనుగోలు చేశారు. 1996లో ఫాక్స్ న్యూస్ ప్రారంభించారు. మర్డోక్ నికర ఆస్తుల విలువ 17.7 బిలియన్ల డాలర్లుగా ఫోర్బ్స్ 2023లో లెక్కగట్టింది.



# 64.2 కోట్ల మంది ఓటర్లతో భారత్ రికార్డు

- ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ మనదే
- వెల్లడించిన కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

**విశ్వంభర, ఢిల్లీ :** ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ మనదే అని కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటర్లతో భారత్ చరిత్ర సృష్టించినట్లు రాజీవ్ కుమార్ వెల్లడించారు. ఇప్పటి వరకు ఇంత ఎక్కువ మంది ఓటర్లు ఏ దేశం ఎన్నికల్లో కూడా పాల్గొనలేదని ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య ప్రక్రియను పక్కా ప్రణాళికతో విజయవంతంగా నిర్వహించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం మనదే అని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసిన క్రమంలో సోమవారం సీఈసీ



నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. అయితే, ఎన్నికల ముగింపుపై సీఈసీ ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. ఏడు విడతలుగా పోలింగ్ విజయవంతంగా జరిగిందని.. ఈసారి మహిళలు కీలక పాత్ర పోషించారని సీఈసీ చెప్పారు. ఈ సందర్భంగా ఓటర్లకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 64.2 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని.. వారిలో 31.2 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారని ఆయన వెల్లడించారు. జీ7 దేశాల్లోని మొత్తం ఓటర్ల కంటే ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న వారి సంఖ్య (64.2 కోట్లు) 1.5 రెట్లు ఎక్కువ. ఐరోపా సమాఖ్యలోని 27 దేశాల ఓటర్ల కంటే ఈ సంఖ్య 2.5 రెట్లు ఎక్కువగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో 1.5 కోట్ల మంది పోలింగ్, భద్రతా సిబ్బంది విధులు నిర్వహించారని.. 68,763 బృందాలు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాయని స్పష్టం చేశారు. ఎన్నికల ఏర్పాట్ల కోసం 4 లక్షల వాహనాలు ఉపయోగించామని.. 135 ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి తెచ్చినట్లు రాజీవ్ కుమార్ తెలిపారు.

# పెరిగిన అమూల్ పాల ధరలు

- లీటరుకు రూ.2 చొప్పున పెంపు
- దేశ వ్యాప్తంగా ఏక కాలంలో అమలు
- పాత ధరలకే అమూల్ తాజా నానా పౌచ్

**విశ్వంభర, అహ్మదాబాద్ :** నిత్యవసర సరుకుల ధరలు ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. ద్రవ్యోల్బణం కారణంగా ఇప్పటికే చాలా సరుకుల ధరలు పెరిగాయి. కాగా ఇప్పుడు అమూల్ పాల ధరలు కూడా పెరిగాయి. దేశ వ్యాప్తంగా అమూల్ పాలకు మంచి డిమాండ్ ఉంటుంది. అయితే గుజరాత్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ అమూల్ పాల ధరలను పెంచింది. ఈసారి లీటరుకు రూ.2 చొప్పున పెంచారు. జూన్ 3 సోమవారం నుంచి ఈ ధరలు అమల్లోకి వచ్చాయి. దీంతో లీటరు పాలకు రూ.2 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ధరల పెరుగుదల మూడు అమూల్ పాలకు వర్తిస్తుంది. అమూల్ గోల్డ్, అమూల్ తాజ్, అమూల్ శక్తి లీటర్ పాలు రెండు రూపాయల మేర పెరిగాయి. అంటే ఈ మూడు పాలల్లో ఏదైనా కొనుగోలు చేస్తే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే అమూల్ తాజా నానా పౌచ్ ధరల్లో ఎలాంటి పెంపుదల లేదు. అంటే పాత ధరలకే ఈ పాలు లభిస్తాయి. ఈ పెరుగుదల మొత్తం దేశంలో ఏకకాలంలో



జరిగింది. అమూల్ పాల పెంపు అనేది ఏ ఒక్క రాష్ట్రానికో సంబంధించినది కాదని కంపెనీ స్పష్టం చేసింది.

**చిన్న ప్యాకెట్ మినహా..**

అమూల్ కొత్త ధరల ప్రకారం అమూల్ గోల్డ్ హాఫ్ లీటర్ ఇప్పుడు రూ.32 నుంచి రూ.33కి పెరిగింది. అమూల్ తాజా 500 ఎంఎల్ ధర రూ.26 నుంచి రూ.27కి పెరిగింది. అమూల్ శక్తి 500 ఎంఎల్ ఇప్పుడు రూ.29 నుంచి రూ.30కి పెరిగింది. అమూల్ తాజా చిన్న ప్యాకెట్లు మినహా అన్ని పాల ధరలను లీటరుకు రూ.2 పెంచారు. అమూల్ గోల్డ్ 500 ప్యాక్ ఇప్పుడు అహ్మదాబాద్‌లో రూ.33కి అందుబాటులో ఉంటుంది. ప్యాక్ రూ.30కి, అమూల్ తాజా రూ.27కి అందుబాటులో ఉండనున్నాయి.

### గాల్లోనే ఢీ కొన్న విమానాలు..


### పైలట్ మృతి

**విశ్వంభర,పోర్చుగల్ :** రెండు విమానాలు గాల్లోనే ఢీ కొన్నాయి. పల్టీలు కొడుతూ రెండు విమానాలు బలంగా నేల మీదకు దూసుకొచ్చి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక పైలట్ మృతి చెందగా.. మరో పైలట్ తీవ్రంగా గాయపడ్డాడు. దక్షిణ పోర్చుగల్‌లో జరుగుతున్న ఎయిర్‌షోలో ఈ అపశృతి చోటు చేసుకుంది. బెజాలో జరుగుతున్న ఎయిర్‌షోలో మొత్తం ఆరు విమానాలు విన్యాసాలు ప్రదర్శిస్తున్నాయి. ఈ క్రమంలో ఒకటి వేగంగా దూసుకెళ్లి మరో విమానాన్ని ఢీకొట్టింది. దీంతో అవి రెండూ ఒక్కసారిగా కుప్పకూలాయి. ఒకటి ఎయిర్‌బేస్‌కు బయట.. మరొకటి దానికి సమీపంగా కుప్పకూలిపోయాయి. ఈ ఘటనపై విచారణకు పోర్చుగల్ ప్రభుత్వం ఆదేశించింది. ప్రమాదానికి గల కారణాలేంటో దర్యాప్తులో గుర్తిస్తామని పోర్చుగల్ రక్షణమంత్రి నునో మెలో వెల్లడించారు. పోర్చుగల్, స్పెయిన్ పైలట్లతో కూడిన 'యాక్ స్టార్స్' అనే ఏరోబాటిక్ గ్రూప్ ఈ వైమానిక విన్యాసాలను నిర్వహిస్తోంది. ఇందులో పాల్గొన్నవన్నీ యాకోవ్లెవ్ యాక్-52 రకానికి చెందిన విమానాలు. ప్రమాదంలో మృతి చెందిన పైలట్ స్పెయిన్‌కు చెందిన వ్యక్తి కాగా.. పోర్చుగల్ పైలట్ గాయపడినట్టు అధికారులు తెలిపారు. గాయపడిన పైలట్‌ను చికిత్స కోసం బెజా హాస్పిటల్‌కు తరలించినట్టు వెల్లడించారు.

# ఐఏఎస్ దంపతుల కుమార్తె ఆత్మహత్య

- బిల్డింగ్ పై నుంచి దూకిన లిపి రస్తోగి
- అక్కడికక్కడే మృతి

**విశ్వంభర, ముంబై :** ఐఏఎస్ దంపతుల కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. మహారాష్ట్ర ప్రభుత్వంలో సీనియర్ పోస్ట్‌లో పని చేస్తున్న ఐఏఎస్ దంపతుల 27 ఏళ్ల కుమార్తె బహుళ అంతస్తుల భవనంలోని 10వ అంతస్తు నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఓ బైక్‌పై ఆమె మృతదేహాన్ని చూసిన గార్డు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్య చేసుకున్న యువతిని లిపి రస్తోగి(27)గా గుర్తించారు. ఆమె మహారాష్ట్ర కేడర్ సీనియర్ ఐఏఎస్ అధికారి వికాస్, రాధిక రస్తోగిల కుమార్తె. తెల్లవారుజామున 4 గంటలకు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆ సమయంలో లిపి తల్లిదండ్రులు గాఢ నిద్రలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆమె 10 అంతస్తులోని తన ఇంటి కిటికీలోంచి దూకారు. ఆత్మహత్యకు ముందు ఆమె సూసైడ్ నోట్ కూడా రాశారు. దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లిపి రస్తోగి తన సూసైడ్ నోట్‌లో తన మరణానికి ఎవరినీ బాధ్యులను చేయలేదు. ఆమె హర్యానాలోని సోనిపట్‌లో ఎల్ఎల్‌బీ చదువుతున్నారు. ఆమె పరీక్ష మరికొద్ది రోజుల్లో జరగబోతోంది. పరీక్షలకు సరిగ్గా సిద్ధం కాలేదని నోట్ లో పేర్కొన్నారు.



**తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులే..**

లిపి రస్తోగి తండ్రి వికాస్ రస్తోగి మహారాష్ట్రలోని హయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆమె తల్లి రాధికా రస్తోగి కూడా రాష్ట్ర ప్రభుత్వంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్నారు. న్యాయవాది సారా కపాడియా యొక్క న్యాయ సంస్థ వెస్టా లీగల్‌లో గత ఏడాది డిసెంబర్ నుంచి లిపి ఇంటర్న్‌గా పనిచేయడం ప్రారంభించింది. అంతకు ముందు ఆమె పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశ్విని రాయ్కర్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేశారు.

# కౌంటింగ్ వేళ పార్టీలకు గుడ్ న్యూస్

**• మరో ఏజెంట్ ను నియమించుకోవచ్చు • కొత్త నిర్ణయం తీసుకున్న ఈసీ**




**విశ్వంభర, అమరావతి :** ఏపీలో ఎన్నికల కౌంటింగ్‌కు అన్నీ రెడీ అయిపోయాయి. మరి కొన్ని గంటల్లో పార్టీల భవితవ్యం ఏంటో తేలిపోనుంది. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలు అన్ని తీవ్రమైన పోటీలో ఉన్నాయి. కాగా పార్టీల నుంచి ఈసీకి బోలెడన్ని వినతులు వస్తున్న నేపథ్యంలో అధికారులు వారికి ఒక వెసలుబాటు కల్పించారు. కౌంటింగ్ కేంద్రంలో మరో ఏజెంట్‌కు నియమించుకోవడం కోసం రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. రిటర్నింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ టేబుల్ దగ్గర మరో ఏజెంట్‌ను పార్టీలు నియమించుకోవచ్చని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం వెల్లడించింది. అభ్యర్థి లేని సమయంలో మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించుకునేలా రాజకీయ పార్టీల ఏజెంట్లకు అవకాశం కల్పించినట్లుగా ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. మరోవైపు, కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముడంచెల భద్రతను ఎన్నికల సంఘం కేంద్ర భద్రతా సంస్థల సాయంతో ఏర్పాటు చేసింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఐడీ కార్డులు, ప్రత్యేక పాసులు ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించేలా కఠినంగా వ్యవహరించనున్నారు. ఈ విషయంలో ఎవరు ఆలసత్వంగా వ్యవహరించినా వారిపై చర్యలు తీసుకుంటామని ఇప్పటికే కలెక్టర్, ఎస్పీలు హెచ్చరికలు జారీ చేశారు.

### ఏజెంట్ ఎవరంటే..

ఓట్ల లెక్కింపు సమయంలో రాజకీయ పార్టీలు పంపిన ఏజెంట్లు కీలక పాత్ర పోషిస్తారు. కౌంటింగ్ కేంద్రాల్లో వీరు అన్ని విషయాలను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తూ ఉంటారు. ఎన్డీయే కూటమి, అధికార వైసీపీ అభ్యర్థులు తమకు, తమ పార్టీకి విధేయులుగా ఉన్న వారిని ఇప్పటికే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకున్నారు. వీరు కౌంటింగ్ కేంద్రాల్లో ఉండి అప్రమత్తంగా వ్యవహరిస్తుండాలి.



# నిఘా నీడలో ఆంధ్రప్రదేశ్

- **అల్లర్లు సృష్టిస్తే జైలుకే**
- **రాష్ట్రంలోకి దిగిన కర్నాటక, సెంట్రల్ ఫోర్స్ పోలీసులు**
- **అడుగడుగునా కట్టుదిట్టమైన భద్రత**

**విశ్వంభర, అమరావతి :** నేడు దేశ మంతా ఎన్నికల కౌంటింగ్ జరుగుతోంది. ఇక ఏపీలో లోకల్ సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలకు కౌంటింగ్ జరుగుతోంది. ఈ క్రమంలోనే పోలింగ్ రోజు జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగాకట్టుది ట్టమైన చర్యలు తీసుకుంటున్నారు పోలీసులు. ఎక్కడా చిన్న గొడవ కూడా జరగకుండా ఉండేందుకు ఏపీవ్యాప్తంగా పెద్దఎత్తున కేంద్ర బలగాల మోహరించారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బంధీగా చర్యలు చేపట్టారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్‌లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల దగ్గర 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. అంతేకాకుండా.. సీఎం జగన్, చంద్రబాబు నివాసాలు, పార్టీల ఆఫీసుల దగ్గర భద్రత పెంచారు. ఏపీవ్యాప్తంగా కొనసాగుతున్న కార్డన్ సెర్చ్ నిర్వహించి.. రౌడీషీటర్ల బైండోవర్, పలువురిపై నగర బహిష్కరణ వేటు వేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ తర్వాత కూడా 20 కంపెనీల బలగాలతో భద్రతను ఏర్పాటు చేశారు. పోలింగ్ రోజున జరిగిన అల్లర్లు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

### 90వేల మంది పోలీసులు..

ఏపీలో కౌంటింగ్‌కు దాదాపు 90వేల మందిని మోహరించింది ఈసీ. సుమారు 60వేల మంది సివిల్ పోలీసులను 8వేల మంది సాయుధ బలగాలను మరో 20వేల మంది సిబ్బందిని రంగంలోకి దించింది. 45వేల 960మంది ఏపీ స్టేట్ పోలీసులకు తోడుగా 3500మంది కర్నాటక పోలీసులు, 4500మంది తమిళనాడు పోలీసులు రేపు బందోబస్తులో ఉండనున్నారు. అలాగే, 1622మంది హోంగార్డులు, 3366 మంది ఇతర పోలీస్ సిబ్బంది కౌంటింగ్ సెక్యూరిటీ విధుల్లో ఉంటారు. వీళ్లకు తోడుగా మరో 18,609మందిని మోహరించింది ఈసీ. ఇందులో 3010మంది ఎన్‌సీసీ, 13వేల 739మంది ఎన్ఎస్ఎస్ సిబ్బంది, 1614మంది ఎక్స్ సర్వీస్‌మెన్, 246మంది రిటైర్డ్ పోలీస్ సిబ్బంది విధుల్లో ఉంటారు.

# కౌంటింగ్ వేళ రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు

- **తేడా వస్తే రౌడీషీట్లు పెడుతాం**
- **ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా**



ఏపీలో ఎన్నికల వేళ అంతా టెన్షన్ టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. పోలింగ్ రోజున జరిగిన గొడవలు నేపథ్యంలో కౌంటింగ్ రోజున మరిన్ని గొడవలు జరిగే ప్రమాదం ఉందని పోలీసులు అప్రమత్తం అయ్యారు. మరీ ముఖ్యంగా సోషల్ మీడియాలో చాలా మంది యూజర్లు అప్పుడే ఫలితాలపై పోస్టులు పెట్టడాన్ని గమనించారు. రెచ్చొట్టే పోస్టులు పెట్టి గొడవలకు దారి తీస్తారని గమనించిన ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కీలక ఆదేశాలను జారీ చేశారు. కౌంటింగ్ టైంలో పోలీసులు సోషల్ మీడియాలో నిఘా పెట్టారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని.. గీత దాటితే తాటతీస్తామంటున్నారు ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా. ప్రత్యర్థులను రెచ్చగొట్టినా, ఇతరులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా చూస్తూ ఊరుకోబోమంటున్నారు. కచ్చితంగా చర్యలు ఉంటాయని అందుకే అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో బెదిరింపులకు పాల్పడటం, రెచ్చగొట్టే కామెంట్స్ చేన వారి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా వివిధ గ్రూప్‌లను క్రియేట్ చేసి నిర్వహిస్తున్న అడ్మిన్‌లు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. తప్పుడు పోస్టులను నియంత్రించాల్సి ఉంటుందని అంటున్నారు. లేకుంటే యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని వార్నింగ్ ఇస్తున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన వారు మరింత సంయమనం పాటించాలని రెచ్చగొట్టే పోస్టులు పెట్టి కష్టాలు కొనితెచ్చుకోవద్దని హితవుపలుకుతున్నారు. ఏమైనా తేడాగా పోస్టులు కనిపిస్తే %గుణ% యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనుకాడేది లేదని అంటున్నారు. అలాంటి పోస్టులు ఎవరి ప్రోత్సాహంతో పెడుతున్నారు. కారణాలు ఏంటని పూర్తిగా విచారించి భాగమైన వారందరిపై కూడా కేసులు బుక్ చేస్తామని చెబుతున్నారు. రెచ్చగొట్టే కామెంట్స్‌తోపాటు ప్రత్యర్థులను ఆగ్రహం తెప్పించే పోస్టులు, ఫొటోలు, వీడియోలు, స్టేటస్లు పెట్టుకున్నా ప్రమాదకరమని అంటున్నారు. అందుకే కేవలం అడ్మిన్‌లు మాత్రమే పోస్టులు పెట్టుకునేలా సెట్టింగ్ మార్చుకోవాలని సూచిస్తున్నారు. అలాంటివి మీకు వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో కూడా షేర్ చేసుకోవద్దని అంతా అలర్ట్‌గా ఉండాలని అంటున్నారు. సోషల్ మీడియాపై పోలీసు నిఘా నిరంతరం ఉంటుందని కచ్చితంగా ఏమాత్రం ఏమరుపాటుగా ఉంటే కేసుల్లో ఇరుక్కొని జీవితాతం స్టేషన్లు చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.




# ఏపీలో నరాలు తెగే ఉత్కంఠ..

- **ఎక్కడ చూసినా ఫలితంపైనే చర్చ**
- **సెలవులు పెట్టుకున్న ఉద్యోగులు**
- **హొటళ్లను బుక్ చేసుకుంటున్న నేతలు**
- **కౌంటింగ్‌ను లైవ్‌లో చూసేందుకు స్క్రీన్స్ ఏర్పాటు**
- **రౌండ్ రౌండ్ కి బెట్టింగ్ కాసేందుకు సై అంటున్న యువత**

**విశ్వంభర, విజయవాడ :** అటెన్షన్ ఏపీ.. ఎన్నికల్లో చివరి ఘట్టం కౌంటింగ్ పై నరాలు తెగే ఉత్కంఠ మొదలైంది. మరికొద్ది గంటల్లోనే ప్రజాతీర్పు బ్యాలెట్ బాక్సులను దాటుకుని బయటకు రానుంది. అభ్యర్థులు పార్టీ నేతల్లో మాత్రమే కాదు సాధారణ ప్రజల్లోనూ టెన్షన్ మొదలైంది. ఏ పార్టీ పీఠం ఎక్కబోతోంది? ఏ పార్టీ ప్రతిపక్షంలో కూర్చోబోతోంది? అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఓ వైపు కౌంటింగ్ కు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోలీసులు భద్రతపై దృష్టి పెట్టారు. ఇటు బెట్టింగ్ రాయుళ్లు సైతం సరంజామా సిద్ధం చేసుకుంటున్నారు. రౌండ్ రౌండ్ కి బెట్టింగ్ కాసేందుకు సై అంటున్నారు. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు అంటూ? లెక్కలు కట్టి మరీ బెట్టింగ్ లు కాసేందుకు సిద్ధమైపోతున్నారు. ఏపీలో అయితే సంక్రాంతి ఫెస్టివల్ వైబ్స్ కనిపిస్తున్నాయి. ఉద్యోగులు రేపటి కౌంటింగ్ కోసం సెలవులు పెట్టేస్తున్నారు. జిల్లాల్లో ఉన్న నేతలు, మంచి హోదాలో ఉన్న వ్యాపారులు హొటళ్లలో బుక్ చేసుకుంటున్నారు. కౌంటింగ్‌ను లైవ్‌లో చూసేందుకు స్క్రీన్లను కూడా సిద్ధం చేసుకుంటున్నారు. ఇక ఐపీఎల్ మ్యాచ్ లను యూత్ ఎలా ఎంజాయ్ చేస్తారో అలా నాయకులంతా మందు పార్టీలను ముందే ప్రిపేర్ చేసుకుంటున్నారు. మొత్తానికి ఏపీలో ఓ పండుగ వాతావరణం కనిపిస్తోంది. భారత్, పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ ఉంటే జనం ఎలా ఊగిపోతారో అదే రేంజ్ లో ఏపీ ప్రజలు, నాయకులు ఫలితాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఇటు వైసీపీ, అటు టీడీపీ కూటమి తమదే అధికారం అంటూ ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. పోలింగ్ పర్సంటేజ్ పెరగడంతో అన్ని వర్గాల్లో ఆందోళన కనిపిస్తోంది. మహిళా ఓటర్లు, యువ ఓటర్లు ఎవరికి జై కొట్టారో? అని అభ్యర్థులు తేల్చుకోలేకపోతున్నారు. ఇటు బెట్టింగ్ రాయుళ్లు కూడా కాయ్ రాజా కాయ్ అంటూ రెడీ అయిపోయారు. తమ అభిమాన నాయకుడే గెలుస్తాడని కొందరు, లేదు లేదు తమ అభిమాన నేతకే జనం పట్టం కడతారని మరికొందరు పందేలకు దిగుతున్నారు. ఏ నేత ఎవరితో కలిశారు? అదెలా లాభం చేకూరుతుందో? ఎవరికి వారే విశ్లేషణలు కూడా చేసుకుంటున్నారు.

# వైసీపీకి పోస్టల్ బ్యాలెట్ల విషయంలో ఎదురుదెబ్బ

**ఈసీ నియమాలపై జోక్యం చేసుకోలేమన్న సుప్రీం**



**విశ్వంభర, విజయవాడ :** పోస్టల్ బ్యాలెట్ల విషయంలో వైసీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల మీద అటెస్టింగ్ అధికారి సంతకం ఉంటే సరిపోదని.. ఆయన పేరు, హోదా, సీల్ కూడా ఉంటేనే వాటిని లెక్కించాలంటూ వైసీపీ ముందు నుంచి కోరుతోంది. కానీ ఇవేమీ లేకపోయినా అధికారి సంతకం ఉంటే వాటిని లెక్కించొచ్చు అంటూ ఈసీ ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే ఈసీ నిర్ణయం మీద వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కాగా పోస్టల్ బ్యాలెట్ అంశానికి సంబంధించి హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆ పార్టీ వేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నియమాలపై జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. కాగా, పోస్టల్ బ్యాలెట్ ఓటర్ డిక్లరేషన్‌కు సంబంధించి 'ఫాం – 13ఏ'పై అటెస్టింగ్ అధికారి సంతకం ఉంటే చాలు, ఆయన పేరు, హోదా, అధికారిక ముద్ర (సీల్) లేకపోయినా ఆ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లుబాటవుతాయంటూ కేంద్ర ఎన్నికల సంఘం మే 30న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై వైసీపీ ఏపీ హైకోర్టును ఆశ్రయించింది. ఎన్నికల సంఘం ఉత్తర్వులను కొట్టేయాలని పిటిషన్‌లో కోరింది. దీనిపై విచారించిన ఉన్నత న్యాయస్థానం వైసీపీ వాదనలను తోసిపుచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ఓటు సీల్ చేయకున్నా కౌంటింగ్‌కు అర్హత ఉందన్న ఎన్నికల సంఘం ఆదేశాలను సమర్థించింది. పిటిషనర్‌కు అభ్యంతరం ఉంటే ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాలన్న ఈసీ తరఫు న్యాయవాదుల వాదనలతో ఏకీభవిస్తూ జూన్ 1న తీర్పు వెలువరించింది.

### సుప్రీంకోర్టులో పిటిషన్..

అయితే, హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆదివారం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారించిన సర్వోన్నత న్యాయస్థానం పోస్టల్ బ్యాలెట్ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో వైసీపీ ఎన్నికల కౌంటింగ్‌కు ముందు ఎదురుదెబ్బ తగిలినట్లయింది. అటు, ఇదే అంశంపై విశాఖ తూర్పు టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీంకోర్టులో కేవియెట్ పిటిషన్ దాఖలు చేశారు.




# పిన్నెల్లికి సుప్రీంలో ఎదురుదెబ్బ

- **కౌంటింగ్ సెంటర్ కు వెళ్లొద్దని ఆదేశాలు**
- **బెయిల్ విషయంలో ఊరట**

**విశ్వంభర, మాచర్ల :** వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి సుప్రీంకోర్టులో షాక్ తగిలింది. కౌంటింగ్ రోజున అంటే ఈ రోజు కౌంటింగ్ సెంటర్ లోకి వెళ్లకుండా సుప్రీంకోర్టు ధర్మసనం ఆదేశించింది. పోలింగ్ రోజున మాచర్లలో ఈవీఎంలను ధ్వంసం చేసిన కేసులో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయం తెలిసిందే.. అంతేకాకుండా.. పిన్నెల్లిని అరెస్ట్ నుంచి మినహాయింపు ఇచ్చింది.. హైకోర్టు తీర్పును సవాల్ చేసిన టీడీపీ ఏజెంట్.. సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది.. ఈ కేసును విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. కౌంటింగ్ రోజున సెంటర్‌కు వెళ్లొద్దని పిన్నెల్లికి ఆదేశిచ్చింది. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర రక్షణపై స్టే ఇవ్వకపోతే న్యాయవ్యవస్థను హేళన చేసినట్టేనని బెంచ్ పేర్కొంది. అయితే విచారణ సందర్భంగా ఈవీఎం ధ్వంసం వీడియోను పిటిషనర్ తరఫు న్యాయవాదులు న్యాయమూర్తుల ఎదుట ప్రదర్శించారు. అయితే.. ఆ వీడియోలో ఉన్నది ఎవరో తెలియదు. ఇది అధికారిక వీడియో కాదు అంటూ పిన్నెల్లి తరఫున న్యాయవాది వికాస్ సింగ్ వాదించారు. అక్కడ ఫొటోలు కూడా ఉన్నాయి అంటూ పేర్కొన్న బెంచ్.. నిందితుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కౌంటింగ్ స్టేషన్‌లోకి ప్రవేశించకుండా నిషేధం విధిస్తున్నామని తెలిపింది. కౌంటింగ్ పరిసర ప్రాంతాలకు కూడా పిన్నెల్లి వెళ్లకూడదని సుప్రీం ఆదేశించింది. పిన్నెల్లిని 6వ తేదీ వరకూ అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తప్పుపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. పిన్నెల్లికి ముందస్తు ఉపశమనం కల్పించి హైకోర్టు తప్పు చేసిందని అభిప్రాయపడింది. ఇలా చేయడం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని ధర్మాసనం అభిప్రాయపడింది.

# నేడు రాష్ట్రంలోని 14 జిల్లాల్లో వర్షాలు





**విశ్వంభర, విశాఖపట్నం :** ఏపీలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. మరో రెండు రోజుల్లో రాష్ట్రమంతా నైరుతి రుతుపవనాలు విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక కోస్తాకు అనుకుని తమిళనాడు పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో ఐదు రోజుల వరకు ఏపీకి వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షం.. పిడుగుల పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీంతో అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మంగళవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లో జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల మరియు నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే చాన్స్ ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# నేడు, రేపు మద్యం దుకాణాలు బంద్




**విశ్వంభర, విజయవాడ :** నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో అధికారులు అలెర్ట్ అవుతున్నారు. ఏ చిన్న గొడవ జరగకుండా ప్రశాంతంగా కౌంటింగ్ జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఏపీలో గొడవలు జరుగుతాయనే అనుమానాల నేపథ్యంలో ఎలాంటి గొడవలు జరగకుండా మద్యం దుకాణాలను బంద్ చేయాలని నిర్ణయించారు. 4వ తేదీ మంగళవారం మద్యం దుకాణాలు మూసివేయాలని ఎక్సైజ్ శాఖను ఎన్నికల సంఘం ఆదేశించింది. అయితే స్థానిక పరిస్థితులు, శాంతిభద్రతల రీత్యా 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు అధికారులు మద్యం దుకాణాలు మూసివేయనున్నారు. ఈ మేరకు ఇప్పటికే పలు జిల్లాల కలెక్టర్లు ఎక్సైజ్ శాఖకు ఆదేశాలిచ్చారు. ఇటీవల జరిగిన కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలనలోను రాష్ట్ర డీజీపీ ఇదే విషయాన్ని వెల్లడించారు. జూన్ 3, 4, 5 తేదీల్లో ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మద్యం అమ్మకాలు నిషేధిం చినట్లు చెప్పారు. కౌంటింగ్ సందర్భంగా రాష్ట్రంలో జరుగు తున్న పరిస్థితులను ఈసీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. జిల్లాలోని అన్ని హొటళ్లు, లాడ్జీల్లో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని డీజీపీ, జిల్లా ఎస్పీలు హెచ్చరికలు జారీ చేశారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు ఈసీ చర్యలు చేపట్టింది. భారీగా స్థాయిలో కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రోఅబ్జర్వర్లు కౌంటింగ్ విధుల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సూక్ష్మ పరిశీలన, సీసీ కెమెరాల నిఘా మధ్య కౌంటింగ్ నిర్వహించనున్నారు. బ్యారికేడింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు, వాహనాల పార్కింగ్, మీడియా కేంద్రం ఏర్పాటు, రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడి ప్రణాళిక, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన ఏర్పాట్లు, మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ రోజు రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

# వరల్డ్ కప్‌లో నయా చరిత్ర

- రికార్డ్ సృష్టించిన బౌలర్ రూబెన్ ట్రంపెల్‌మాన్
- ఇన్నింగ్స్ తొలి 2 బంతులకు 2 వికెట్లు
- 2,633 టీ20 మ్యాచ్‌ల్లో తొలిసారి..
- సూపర్ ఓవర్‌లో ఒమన్‌పై ఉత్కంఠ భరిత విజయం సాధించిన నమీబియా




**విశ్వంభర, స్పోర్ట్స్ :** వెస్టిండీస్, అమెరికా వేదికగా జరుగుతున్న టీ20 వరల్డ్ కప్2024లో నమీబియా పేసర్ రూబెన్ ట్రంపెల్‌మాన్ టీ20 క్రికెట్‌లో ఇదివరకు ఎప్పుడూ ఎరుగని సరికొత్త రికార్డును సృష్టించాడు. బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవల్ మైదానం వేదికగా ఒమన్, నమీబియా మధ్య జరిగిన మ్యాచ్‌లో చారిత్రాత్మక ప్రదర్శన చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్‌ను ఇన్నింగ్స్ ఆరంభంలోనే రూబెన్ గట్టి దెబ్బ కొట్టాడు. ఒమన్ ఇన్నింగ్స్ ఆరంభించిన తొలి 2 బంతుల్లో 2 వికెట్లు తీశాడు. తొలి బంతికి ఓపెనర్ ప్రజాపతి, ఆ మరుసటి బంతికి కెప్టెన్ అకిబ్ ఇలియాస్‌లను పెవీలియన్‌కు పంపించాడు. ఇద్దరినీ గోల్డెన్ డకౌట్ చేశాడు. ఈ విధంగా టీ20 క్రికెట్‌లో ఇన్నింగ్స్ ఆరంభ తొలి రెండు బంతుల్లో రెండు వికెట్లు తీసిన మొట్టమొదటి ఆటగాడిగా రూబెన్ ట్రంపెల్‌మాన్ నిలిచాడు. 2,633 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌ల్లో ఈ విధంగా జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**సూపర్ ఓవర్‌లో నమీబియా థ్రిల్లింగ్ విక్టరీ**

టీ20 వరల్డ్‌కప్‌లో గ్రూప్‌బీలో భాగంగా సోమవారం బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవర్ మైదానం వేదికగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో నమీబియా థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. మ్యాచ్ టైగా ముగియడంతో సూపర్ ఓవర్‌కు దారి తీసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్ 19.4 ఓవర్లలో 109 పరుగులకు ఆలౌట్ అయింది. 110 పరుగుల టార్గెట్‌తో బ్యాటింగ్ ఆరంభించిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి సరిగ్గా 109 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ టై అవడంతో సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా వికెట్ నష్టపోకుండా 21 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్యఛేదనలో ఒమన్ 1 వికెట్ నష్టానికి 10 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో నమీబియా ఉత్కంఠభరిత విజయాన్ని ఖాతాలో వేసుకుంది.




# క్రికెట్‌కు కేదార్ జాదవ్ వీడ్కోలు

- అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు గుడ్‌బై
- 'ఎక్స్'వేదికగా రిటైర్మెంట్ ప్రకటన
- భారత్ తరపున 2 సెంచరీలు, ఆరు అర్ధ సెంచరీలు




**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత క్రికెటర్ కేదార్ జాదవ్ అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన రిటైర్మెంట్ ప్రకటన తక్షణమే అమలులోకి వస్తుందని స్పష్టం చేశాడు. తన నిర్ణయాన్ని ఎక్స్ వేదికగా జాదవ్ ప్రకటించాడు. తన క్రికెట్ ప్రయాణంలో మద్దతుగా నిలిచిన, ప్రేమాభిమానాలు అందించిన ప్రతి ఒక్కరికీ జాదవ్ కృతజ్ఞతలు తెలిపాడు. తాను అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి రిటైర్ అయినట్టుగా పరిగణించాలని కోరాడు. కాగా జాదవ్ ప్రస్తుత వయసు 39 సంవత్సరాలు. కాగా కేదార్ జాదవ్ చివరిసారిగా 2020లో భారత్ తరపున న్యూజిలాండ్‌పై మ్యాచ్ ఆడాడు. ఇంగ్లాండ్ వేదికగా 2019 ప్రపంచ కప్‌లోనూ టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. 2019 ప్రపంచ కప్‌కు ముందు టీమిండియా కీలక మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్లలో జాదవ్ ఒకడిగా కొనసాగాడు. మొత్తం 73 వన్డే మ్యాచ్‌లు ఆడిన జాదవ్ 2 సెంచరీలు, 6 అర్ధసెంచరీలు సాధించాడు. 101.6 స్ట్రైక్ రేట్, 42.05 సగటుతో 1389 పరుగులు చేశాడు. ఇక టీ20 ఫార్మాట్ విషయానికి వస్తే 9 మ్యాచ్‌లు ఆడిన జాదవ్ 123.23 స్ట్రైక్ రేట్‌తో కేవలం 122 పరుగులు మాత్రమే సాధించాడు. 2019 వరల్డ్ కప్‌లో కీలక ఆటగాడిగా ఉన్న జాదవ్ ఆ తర్వాత రాణించలేకపోయాడు. ఇక ఆ తర్వాత 2023 వన్డే వరల్డ్ కప్ కోసం జట్టు రూపొందించే క్రమంలో జాదవ్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు. ఇక ఐపీఎల్ 2018లో చెన్నై సూపర్ కింగ్స్ టైటిల్ వేటలో కేదార్ జాదవ్ కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2023 ద్వితీయార్థంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున జాదవ్ చివరిసారిగా ఆడాడు. ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల తరపున కూడా ఆడాడు. ఐపీఎల్ కెరియర్‌లో మొత్తం 95 మ్యాచ్‌లు ఆడిన జాదవ్ 4 అర్ధసెంచరీలు సాధించాడు. 123.14 స్ట్రైక్ రేట్‌తో 1208 పరుగులు సాధించాడు. ఇక ఈ మధ్య జియో సినిమాకు మరాఠీలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నాడు.

# టీ20 వరల్డ్‌కప్.. ఒమన్-నమీబియా మ్యాచ్ టై!

- బ్రిడ్జిటౌన్ వేదికగా ఒమన్, నమీబియా మధ్య మ్యాచ్
- 19.4 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలిన ఒమన్
- లక్ష్యఛేదనలో నమీబియా 109 రన్స్‌కే పరిమితం కావడంతో మ్యాచ్ టై
- సూపర్ ఓవర్‌లో నమీబియాను వరించిన విజయం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా బ్రిడ్జిటౌన్ వేదికగా ఒమన్, నమీబియా మధ్య జరిగిన మూడో మ్యాచ్ టై అయింది. మొదట బ్యాటింగ్ చేసిన ఒమన్ 19.4 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత 110 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి దిగిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి ఆరు



వికెట్ల నష్టానికి 109 పరుగులే చేసింది. దీంతో మ్యాచ్ టై అయింది. ఇక మ్యాచ్ టై కావడంతో ఐసీసీ నిబంధనల ప్రకారం సూపర్ ఓవర్ నిర్వహించారు. ఈ సూపర్ ఓవర్‌లో నమీబియా విజయం సాధించింది. సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసింది. నమీబియా నిర్దేశించిన 22 పరుగుల లక్ష్యఛేదనలో ఒమన్ వికెట్ నష్టానికి కేవలం 10 రన్స్ మాత్రమే చేసింది. దీంతో నమీబియా విజేతగా నిలిచింది.

# టీ20 వరల్డ్ కప్ ప్రైజ్‌మనీని భారీగా పెంచిన ఐసీసీ

- ప్రైజ్‌మనీ కోసం రూ.93.51 కోట్లు కేటాయింపు
- ప్రపంచ కప్ విజేత జట్టుకు రూ.20.3 కోట్ల ప్రైజ్‌మనీ
- రన్నర్ జట్టుకు రూ10.64 కోట్లు
- భారీగా పెంచిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 వరల్డ్ కప్2024 కోసం పోటీ పడుతున్న జట్లకు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) గుడ్‌న్యూస్ చెప్పింది. వెస్టిండీస్, అమెరికా వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీ కోసం భారీ ప్రైజ్‌మనీని ప్రకటించింది. మొత్తం రూ.93.51 కోట్లు కేటాయించింది. అత్యధికంగా రూ.20.3 కోట్లు టైటిల్ విజేతకు అందజేయనున్నట్టు ఐసీసీ వెల్లడించింది. కాగా టీ20 వరల్డ్ కప్2022ను ముద్దాడిన ఇంగ్లండ్ దాదాపు రూ.12 కోట్ల మొత్తం నగదు బహుమతిగా స్వీకరించింది. కాగా ప్రస్తుత వరల్డ్ కప్‌లో మొత్తం 20 జట్లు పాల్గొంటుండగా ప్రతి జట్టు కనీసం రూ.1.87 కోట్ల మొత్తాన్ని ప్రైజ్‌మనీగా పొందింది. ఇక రన్నరప్‌గా నిలిచిన జట్టు రూ.10.64 కోట్లు, సెమీ ఫైనల్స్‌లో ఓడిపోయే జట్లు రూ. 6.55 కోట్లు చొప్పున, సూపర్8 దశలో వెనుదిరిగిన జట్లు రూ. 3.18 కోట్లు, ప్రతి గ్రూపులో 3వ స్థానంలో నిలిచిన జట్లు రూ. 2.06 కోట్లు, మిగిలిన జట్లు రూ. 1.87 కోట్ల మొత్తాన్ని ప్రైజ్‌మనీగా స్వీకరించనున్నాయి. కాగా జూన్ 29న బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవల్‌లో ఫైనల్ మ్యాచ్ జరగనుంది.




## పెరిగిన ఇన్ఫోసిస్ సీఈఓ వేతనం..

# రూ.66 కోట్లతో రెండో స్థానం..

**విశ్వంభర, బిజినెస్ :** దేశీయ దిగ్గజ ఐటీ సేవల సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సలీల్ పరేఖ్ వార్షిక వేతన భారీగా పెరిగింది. 202324 ఆర్థిక సంవత్సరంలో ఆయన ఏకంగా రూ. 66.2 కోట్లు వేతనంగా అందుకున్నారు. ఈ మేరకు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో సీఈఓ వేతనం వివరాలను వెల్లడించింది. 202323 ఆర్థిక సంవత్సరంలో సలీల్ పరేఖ్ వేతనం రూ.56.4 కోట్లుగా ఉండగా.. దాంతో పోలిస్తే ఈ సారి 17.3 శాతం మేర పెరగడం గమనార్హం. అంటే గతేడాదికందా రూ.10 కోట్లకుపైగా సీఈఓ వేతనం పెరిగింది. అంతకు ముందు ఏడాది ఈ మొత్తం రూ.71.02 కోట్లుగా ఉండడం గమనార్హం. ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ వేతనంలో ఫిక్స్‌డ్ పే, వేరియబుల్ పే, రిటైరల్ బెనిఫిట్స్ వంటివి కలిసి ఉన్నాయి. అలాగే ఆర్థిక సంవత్సరంలో వినియోగించుకున్న స్టాక్ ఇన్సెంటివ్స్ విలువ సైతం కలిగి ఉన్నట్లు కంపెనీ తెలిపింది. సలీల్ పరేఖ్ ఫిక్స్‌డ్ శాలరీ రూ. 7.12 కోట్ల నుంచి రూ. 7.47 కోట్లకు పెరిగింది. బోనస్ రూపంలో ఆయన గత ఆర్థిక సంవత్సరం 2023 24 లో రూ. 19.75 కోట్లు అందుకున్నారు. అలాగే 2 లక్షల 58 వేల 636 రెస్ట్రిక్టడ్ స్టాక్ యూనిట్లను విక్రయించడం ద్వారా ఆయనకు రూ. 39.03 కోట్లు వచ్చాయి. మొత్తంగా గత ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం రూ.66.2 కోట్లుగా ఉన్నట్లు రెగ్యులేటరీ ఫైలింగ్ ద్వారా స్పష్టమవుతోంది. దీంతో ఆయన ఐటీ పరిశ్రమలో అత్యధిక వేతనం అందుకుంటున్న వారిలో రెండో స్థానానికి చేరుకున్నారు. మరోవైపు.. ప్రముఖ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS) సీఈఓ, ఎండీ కృతివాసన్ గత ఆర్థిక ఏడాది 2023 24 లో రూ. 25.36 కోట్లు వేతనం అందుకున్నారు. ఆ తర్వాత విప్రో సీఈఓ, ఎండీ శ్రీనివాస్ పల్లియా రూ. 58.4 కోట్లు వేతనంగా అందుకోనున్నారు. అయితే ఆయన కంటే ముందు విప్రో సీఈఓగా ఉన్న థియరీ డెలాపోర్టే సుమారు 20 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ. 166 కోట్లు వేతనంగా పొందడం గమనార్హం. ఆయన ఏప్రిల్ 6, 2024 న సీఈఓ పదవీకి రాజీనామా తప్పుకున్నారు. మరోవైపు.. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కంపెనీ సీఈఓ సీ విజయ్ కుమార్ రూ. 28.4 కోట్లు వేతనంగా పొందారు. ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సీఈఓ దెబాషిస్ ఛటర్జీ రూ. 17.2 కోట్లు అందుకున్నారు.

# జూన్ 5 నుంచి ఆర్బీఐ ఎంపీసీ సమావేశం

**విశ్వంభర, బిజినెస్:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వైమాసిక నిర్వహించే ద్రవ్య విధాన కమిటీ సమావేశం ఈ బుధవారం (జూన్ 5) ప్రారంభం కానుంది. రెండు రోజుల సమావేశం అనంతరం జూన్ 7న ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సమావేశ తీర్మానాలను ప్రకటించనున్నారు. ఈ సమావేశంలో అందరి మనసులు ఎక్కువగా బ్యాంకు వడ్డీ రేటుపైనే కేంద్రీకరిస్తున్నాయి. అలాగే, జీడిపి, ద్రవ్యోల్బణంపై ఆర్‌బిఐ అంచనాలు ఆసక్తిని కలిగిస్తాయి. ఎంపీసీ చివరి సమావేశం ఏప్రిల్‌లో జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది రెండో సమావేశం. ద్రవ్య విధాన కమిటీలో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ సహా ఆరుగురు సభ్యులుగా ఉంటారు. వీరిలో ముగ్గురు ఆర్‌బీఐలో అధికారులు కాగా, మరో ముగ్గురు బాహ్య సభ్యులుగా ఉంటారు. నిబంధనల ప్రకారం.. ఆర్బీఐ ఎంపీసీ సంవత్సరానికి కనీసం




నాలుగు సార్లు సమావేశం కావాలి. ఎంపీసీ సమావేశం సాధారణంగా రెండు నెలలకు ఒకసారి జరుగుతుంది. అంటే ఏడాదికి ఆరు సార్లు సభ నిర్వహిస్తారు. ఏప్రిల్ 5న ఆర్బీఐ వడ్డీ రేటును 1% పెంచింది. 6.50కి కొనసాగించాలని నిర్ణయించారు. ఆరుగురు ఎంపీసీ సభ్యులలో ఐదుగురు వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడానికి అనుకూలంగా ఓటు వేశారు. ఒక్కరు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈసారి కూడా 5:1 ఓట్ల మద్దతుతో వడ్డీ రేటును కొనసాగించాలనే నిర్ణయానికి రావచ్చు.

**డిసెంబర్ వరకు రెపో రేటు తగ్గింపు లేదు?**

రెపో రేటు అనేది బ్యాంకులకు ఆర్‌బిఐ అందించే నిధులపై వసూలు చేసే వడ్డీ రేటు. బ్యాంకులు తమ కస్టమర్లకు తదనుగుణంగా వడ్డీ రేట్లను వసూలు చేయవచ్చు. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, రెపో రేటు కూడా ఎక్కువగానే ఉంచబడుతుంది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు రెపో ఒక సాధనం. భారతదేశంలో ద్రవ్యోల్బణం ఇప్పటికీ ఉంది 4 పైన మిగిలి ఉంది. అందువల్ల వడ్డీ రేటును తగ్గించే ఆలోచనలో ఆర్బీఐ ప్రస్తుతానికి లేదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డిసెంబర్ వరకు రెపో రేటును తగ్గించే అవకాశం చాలా తక్కువ. జనవరి 2024 తర్వాత, వడ్డీ రేటు తగ్గించవచ్చు.

# 45 పైసలకే రూ.10 లక్షల ఇన్సూరెన్స్..

**విశ్వంభర, బిజినెస్:**

చాలా మంది రైలు ప్రయాణం చేస్తుంటారు. కానీ అందరికి కొన్ని విషయాలు తెలిసి ఉండవు. రైలు ప్రయాణం చేసేవారి కూడా ఇన్సూరెన్స్ ఉంటుందన్న విషయం మీకు తెలుసా? ఈ ఇన్సూరెన్స్ కూడా రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. మీరు రైల్వేలో ప్రయాణిస్తున్నట్లయితే, ఈ ప్రత్యేక బీమా సేవ గురించి మీరు తప్పక తెలుసుకోవాలి. కేవలం 45 పైసలు ఖర్చు చేయడం ద్వారా మీరు ఈ లక్షలాది రూపాయల బీమా కవర్ పొందవచ్చు. మీరు టికెట్ బుక్ చేసుకున్నప్పుడల్లా ఈ ప్రయాణ బీమా తీసుకోండి. ఇది మీ కుటుంబానికి ఆర్థికంగా సహాయం చేస్తుంది. టిక్కెట్‌ను బుక్ చేసుకునే సమయంలో ప్రయాణీకుడు ట్రావెల్ ఇన్సూరెన్స్ తీసుకోవాలా వద్దా అనే ఆప్షన్ ఉంటుంది. ఇందుకోసం వారి నుంచి నామమాత్రంగా 45 పైసలు వసూలు చేస్తారు.

**ఎంత ఖర్చవుతుంది?**

రైలు ప్రమాదంలో ప్రయాణికుడు గాయపడితే, అతనికి రూ.7.5 లక్షల బీమా సౌకర్యం లభిస్తుంది. అలాగే రూ.2 లక్షల విలువైన ఆసుపత్రి చికిత్స ఉచితం. ప్రమాదంలో ప్రయాణికుడు చనిపోతే లేదా శాశ్వతంగా అంగవైకల్యం చెందితే, అతని కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షల బీమా లభిస్తుంది. 45 పైసల బీమా తీసుకునే వారు మాత్రమే ఈ బీమాను క్లెయిమ్ చేసుకోవచ్చు. టిక్కెట్‌ను బుక్ చేసేటప్పుడు మీరు నామినీ వివరాలను సరిగ్గా పూరించడం మర్చిపోవద్దు. ఇది చాలా ముఖ్యమైనది.




## నియమాలు ఏమిటి?

ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు మాత్రమే ప్రయాణ బీమా అందుబాటులో ఉంటుంది. అదే సమయంలో ఒక PNRలో బుక్ చేసిన అన్ని టిక్కెట్లు ప్రయాణ బీమా ప్రయోజనాన్ని పొందుతాయి. నిర్ధారిత, ఆర్ఏసీ టిక్కెట్ హోల్డర్లకు మాత్రమే ప్రయాణ బీమా అందుబాటులో ఉంటుంది. నామినీ లేదా లబ్ధిదారు రైలు ప్రమాదం జరిగిన 4 నెలలలోపు ప్రయాణ బీమాను క్లెయిమ్ చేయాలి. దీని కోసం మీరు బీమా చేసిన కంపెనీకి వెళ్లి మీ వివరాలను తెలియజేయాలి. మీరు కొన్ని రోజుల్లో మీ ప్రయాణ బీమాను అందుకుంటారు

**క్లెయిమ్ ఎలా పొందాలి?**

ఏదైనా ప్రమాదం జరిగితే, టిక్కెట్లను బుక్ చేసుకునే సమయంలో ప్రయాణ బీమా తీసుకున్న ప్రయాణికులందరికీ ఇది లభిస్తుంది. ఈ బీమా కింద అతనికి 10 లక్షల రూపాయలు అందుతాయి. అయితే దానిని క్లెయిమ్ చేసే పద్ధతి భిన్నంగా ఉంటుంది. రైల్వే ఈ డబ్బును అందించదు. కానీ ప్రయాణ బీమాను తీసుకున్న సంస్థ ఈ బీమా రక్షణను అందిస్తుంది.

## రికార్డు స్థాయిలో దూసుకుపోయిన

# స్టాక్ మార్కెట్లు



**విశ్వంభర, బిజినెస్:**

దేశంలో రేపు ఎన్నికల కౌంటింగ్ జరగనుండగా, నరేంద్ర మోదీ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్న అంచనాల నేపథ్యంలో... నేడు భారత స్టాక్ మార్కెట్లు దూసుకుపోయాయి. సెన్సెక్స్, నిఫ్టీ గత మూడేళ్లలో ఎన్నడూ గరిష్ఠ లాభాలు అందుకున్నాయి. సెన్సెక్స్ 2,507 పాయింట్ల వృద్ధితో 76,468.78 వద్ద ముగియగా... నిఫ్టీ 733 పాయింట్ల లాభంతో 23,263 వద్ద ముగిసింది. 2021 జనవరి నుంచి సెన్సెక్స్, నిఫ్టీ ఒక్కరోజులో ఇన్ని పాయింట్ల వృద్ధి నమోదు చేయడం ఇదే ప్రథమం. ఇవాళ ఒక్కరోజే మదుపరులకు రూ.14 లక్షల కోట్ల ఆదాయం వచ్చిపడింది. ఎగ్జిట్ పోల్స్ లో చాలావరకు ఎన్డీయేనే వస్తుందన్న అంచనాలు వెలువరించడం, స్టాక్ మార్కెట్లను విపరీతంగా ప్రభావితం చేసింది. ఇవాళ ట్రేడింగ్ ఆరంభంలోనే సెన్సెక్స్, నిఫ్టీ కళ్లెం వదిలిన గుర్రాల్లా పరుగులు తీశాయి. సెన్సెక్స్ 3.39, నిఫ్టీ 3.25 శాతం వృద్ధి నమోదు చేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్బీఐ, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, మహీంద్రా, అదానీ పోర్ట్స్, ఎయిర్ టెల్, ఎన్టీపీసీపవర్ గ్రిడ్, ఓఎన్జీసీ లాభాలు అందుకున్నాయి. ఐషర్ మోటార్స్, ఎల్టీఐ మైండ్ ట్రీ, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, బ్రిటానియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ నష్టాలు చవిచూశాయి.

# ఆగిపోనున్న హెచ్‌డీఎఫ్‌సీ ట్రాన్సాక్షన్లు

**విశ్వంభర, బిజినెస్:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు.. తన కస్టమర్ల కోసం కీలక ప్రకటన జారీ చేసింది. ఈ మేరకు వారికి ఇమెయిల్ సహా ఎస్ఎంఎస్ ద్వారా సందేశాలు ఇచ్చింది. అప్‌గ్రేడ్ విండో నేపథ్యంలో.. బ్యాంక్ కస్టమర్లకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులు, ఇతర ప్రీపెయిడ్ కార్డులతో చేసే ట్రాన్సాక్షన్లు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని స్పష్టం చేసింది. ఈ మేరకు బ్యాంక్ వెల్లడించింది. 'హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డ్ అండ్ ప్రీపెయిడ్ కార్డ్ ట్రాన్సాక్షన్లు.. 2024, జూన్ 4 12.30 ఏఎం నుంచి 2.30 ఏఎం వరకు అందుబాటులో ఉండవు. ఇంకా జూన్ 6 12.30 ఏఎం 2.30 ఏఎం మధ్య కూడా అంతరాయం కలగనుంది.' అని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తన కస్టమర్లకు ఇమెయిల్ చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రీపెయిడ్ కార్డు సర్వీసుల నుంచి మొదలుకొని.. బ్యాంకు డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులకు సంబంధించి సిస్టమ్ అప్‌గ్రేడ్ చేసేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ 4వ తేదీన అప్‌గ్రేడ్ సమయంలో అన్ని ఏటీఎం విత్‌డ్రాయల్స్, పీఓఎస్ (కార్డ్ స్వైప్ మెషీన్ ఎట్ స్టోర్స్), ఆన్‌లైన్ (పేమెంట్ గేట్‌వే పోర్టల్) అండ్ నెట్ సేఫ్ ట్రాన్సాక్షన్లకు అంతరాయం కలగనుంది. ఇంకా జూన్ 6వ తేదీకి సంబంధించి అన్ని రూపే కార్డు అండ్ నెట్ సేఫ్‌కు సంబంధించి అన్ని ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు నిలిచిపోనున్నాయి. ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లకు సంబంధించి ఈ తేదీల్లో నిర్దేశించిన సమయాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూపే కార్డులు కూడా పనిచేయవు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కాకుండా ఇతర పేమెంట్ గేట్‌వేల్లో కూడా ఇవి పనిచేయవు. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తన కస్టమర్లకు ఇటీవల ఒక అలర్ట్ జారీ చేసిన సంగతి తెలిసిందే.

# అర్జున్ రెడ్డి రికార్డ్ బ్రేక్..

## నవదీప్ బోల్డ్‌గా రెచ్చిపోయాడుగా..

**విశ్వంభర, సినిమా :** నవదీప్ కొంచెం గ్యాప్ తర్వాత మళ్ళీ హీరోగా 'లవ్ మౌళి' సినిమాతో రాబోతున్నాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సీ స్పేస్, నైరా క్రియేషన్స్ నిర్మాణంలో అవనీంద్ర దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. నవదీప్ ఈ సినిమాతో రెండో వర్షన్ తో వస్తున్నాను అని, ఇది తన సెకండ్ ఇన్నింగ్స్ అని ప్రమోట్ చేస్తున్నాడు. ఆల్రెడీ లవ్ మౌళి సినిమా నుంచి వచ్చిన టీజర్, ట్రైలర్, సాంగ్స్ తో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా జూన్ 7న రిలీజ్ కానుంది.ఈ సినిమాలో నవదీప్ ఓ పెయింటర్ అని, తనకు కావాల్సిన అమ్మాయి, తనకు కావాల్సిన ప్రేమ కోసం పలువురు అమ్మాయిలతో ట్రావెల్ చేస్తాడని తెలుస్తుంది. అయితే ట్రైలర్ లోనే కొన్ని బోల్డ్ సీన్స్ ఉన్నాయి. దీంతో సినిమాలో కూడా చాలా బోల్డ్ సీన్స్ ఉండబోతున్నట్టు తెలుస్తుంది. లిప్ కిస్ లు మాత్రమే కాక ఎక్స్‌పోజింగ్, మరిన్ని రొమాంటిక్ సీన్స్ లవ్ మౌళి సినిమాలో చాలానే ఉన్నట్టు సమాచారం. లవ్ మౌళి ట్రైలర్ లోనే ఏడు లిప్ కిస్ సీన్లు ఉన్నాయి. తాజాగా సెన్సార్ అవ్వగా సెన్సార్ బోర్డు సమాచారం ప్రకారం ఈ సినిమాలో భారీగా ముద్దు సీన్లు ఉన్నట్టు తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం లవ్ మౌళి సినిమాలో ఏకంగా 42 లిప్ కిస్ సీన్స్ ఉన్నాయని సమాచారం. ఈ విషయం తెలిసి సినీ పరిశ్రమ వ్యక్తులు కూడా ఆశ్చర్యపోతున్నారు. 42 లిప్ కిస్ లు ఏంటి బ్రో అంటూ నెటిజన్లు కూడా నవదీప్ పై సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. గతంలో అర్జున్ రెడ్డి సినిమాలో 25 కు పైగా లిప్ కిస్ సీన్స్ ఉన్నాయి. ఇప్పుడు నవదీప్ లవ్ మౌళి సినిమాలో ఏకంగా 42 ముద్దు సీన్స్ తో అర్జున్ రెడ్డి రికార్డ్ బ్రేక్ చేస్తాడని అంటున్నారు. ఇందులో నవదీప్ న్యూడ్ గా కూడా నటించడం గమనార్హం. ఈ లవ్ మౌళి సినిమాకు ఆల్రెడీ A సర్టిఫికెట్ ఇచ్చారు. మరి లవ్ మౌళి సినిమాతో నవదీప్ ఏ రేంజ్ లో ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తాడో చూడాలి.



# కల్కిలో మెరిసే తారలు ఎంతమంది?

**విశ్వంభర, సినిమా :** ప్రభాస్ కల్కి సినిమా కోసం అభిమానులతో పాటు దేశమంతా ఎదురుచూస్తుంది. వైజయంతి మూవీస్ బ్యానర్ పై నాగ్ అశ్విన్ దర్శకత్వంలో దాదాపు 400 కోట్ల భారీ బడ్జెట్ తో గ్రాండ్ గా తెరకెక్కింది ఈ సినిమా. ఇప్పటికే రిలీజ్ చేసిన గ్లింప్స్, పోస్టర్స్, యానిమేషన్ సిరీస్ లతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమాలో చాలా మంది స్టార్లు ఉన్న సంగతి తెలిసిందే. కల్కిలో ప్రభాస్ తో పాటు కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటాని.. ఉన్నారని ఆల్రెడీ మూవీ యూనిట్ అధికారికంగా ప్రకటించారు. అయితే ఈ సినిమాలో మరింతమంది స్టార్లు గెస్ట్ అప్పీరెన్స్ లు ఇవ్వబోతున్నారని ఇప్పటికే పలు వార్తలు వచ్చాయి. కల్కి సినిమాలో నాని, విజయ్ దేవరకొండ, రాజమౌళి, ఆర్జీవీ, దుల్కర్ సల్మాన్, రానా.. ఉన్నారని వార్తలు వచ్చాయి. తాజాగా ఈ సినిమాలో మరో ఇద్దరు హీరోయిన్స్ ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్ లో దూసుకుపో తున్న మృణాల్ ఠాకూర్ తో పాటు, సీనియర్ నటి శోభన కూడా కల్కి సినిమాలో గెస్ట్ పాత్రలు చేయబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో ఈ సినిమాలో ఎంతమంది స్టార్స్ కనిపిస్తారో అని ప్రేక్షకులు ఎదురుచూస్తు న్నారు. మరి ఈ వార్తలు అన్ని నిజమేనా తెలియా లంటే సినిమా రిలీజ్ వరకు ఆగాల్సిందే. ఇక కల్కి సినిమా జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది.



# యాపిల్ బ్యూటీ హన్సిక బుల్లితెరకు ఎంట్రీ

**విశ్వంభర, సినిమా:** యాపిల్ బ్యూటీ హన్సిక 'దేశముదురు' సినిమాతోనే తెలుగులో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి కెరీర్ మొదలుపెట్టింది. తెలుగులో చాలా మంది స్టార్ హీరోల సరసన నటించిన ఈ భామ ఆ తర్వాత తమిళ్, హిందీలో కూడా బిజీ అయింది. రెండేళ్ల క్రితం పెళ్లి చేసుకున్న హన్సిక పెళ్లి తర్వాత కూడా వరుసగా సినిమాలు చేస్తుంది. సోషల్ మీడియాలో కూడా హన్సిక చాలా యాక్టివ్ గా ఉంటుంది.తాజాగా హన్సిక ఇప్పుడు టీవీ షోలోకి ఎంట్రీ ఇచ్చింది. ప్రముఖ డ్యాన్స్ షో ఢీ ప్రతి సీజన్ లో ఓ కొత్త లేడి జడ్జ్ ని తీసుకువస్తారు. ఇటీవల ఢీ సెలబ్రిటీ స్పెషల్ సీజన్ అయిపోగా మరో కొత్త సీజన్ మొదలవుతుంది. ఈ సారి కూడా సెలబ్రిటీ స్పెషల్ గానే ఢీ షో సాగనుంది. గత సీజన్ లో హీరోయిన్ ప్రణీతను జడ్జిగా తీసుకురాగా ఈ సీజన్ కి హన్సికను జడ్జిగా తీసుకువచ్చారు. ఢీ షోలో హన్సిక జడ్జిగా వస్తుందని తెలియడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ షోకి సంబంధించిన ప్రోమో కూడా విడుదల చేయగా హన్సిక ప్రోమోలో సందడి చేసింది. ఇక హన్సికతో పాటు శేఖర్ మాస్టర్, గణేష్ మాస్టర్ కూడా జడ్జీలుగా ఉన్నారు.





# జాన్వీ కపూర్ చెల్లితో 'లవ్ టుడే' రీమేక్

**విశ్వంభర, సినిమా :** 2022లో తమిళ్ లో చిన్న సినిమాగా వచ్చిన 'లవ్ టుడే' భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. రొమాంటిక్ కామెడీ డ్రామాగా వచ్చిన లవ్ టుడే ప్రదీప్ రంగనాథన్ హీరోగా, దర్శకుడిగా తెరక్కించాడు. ఇవానా హీరోయిన్ గా నటించగా, యువన్ శంకర్ రాజా సంగీతం అందించాడు. లవర్స్ ఫోన్స్ మార్చుకునే కాన్సెప్ట్ తో ప్రేక్షకులను మెప్పించింది ఈ సినిమా. తెలుగులో కూడా డబ్బింగ్ రిలీజయి మంచి విజయం సాధించింది. కేవలం 5 కోట్లతో తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా 100 కోట్లు కలెక్ట్ చేసింది. ప్రస్తుతం లవ్ టుడే నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమాను బాలీవుడ్ లో రీమేక్ చేయబోతున్నారని గతంలోనే వార్తలు వచ్చాయి. తాజాగా మరోసారి లవ్ టుడే రీమేక్ వార్తలు బాలీవుడ్ లో వైరల్ అవుతున్నాయి. అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా, జాన్వీ కపూర్ చెల్లి ఖుషి కపూర్ హీరోయిన్ గా అద్వైత్ చందన్ దర్శకత్వంలో లవ్ టుడే సినిమా రీమేక్ అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ మొదటి సినిమా మహారాజా ఇంకా రిలీజ్ అవ్వలేదు. ఖుషి కపూర్ ఒక సినిమా చేసింది. ఇప్పుడు వీళ్ళిద్దరూ లవ్ టుడే రీమేక్ లో నటించబోతున్నారు తెలుస్తుంది. ఇటీవల సౌత్ నుంచి బాలీవుడ్ కి వెళ్లి రీమేక్ అయిన సినిమాలేవీ అంతగా సక్సెస్ అవలేదు. మరి సౌత్ ప్రేక్షకులని మెప్పించిన లవ్ టుడే బాలీవుడ్ లో సక్సెస్ అవుతుందా చూడాలి.








Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com